నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

సంపుటి 11 | సంచిక 122

సోమవారం | 26 ఫిబ్రవరి 2018 | హైదరాబాద్

| పేజీలు 12+12 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్ష తిథి : ఏకాదశి మ.3.44, పునర్వసు తె.4.21, వర్జ్యం సా.5.24 నుంచి 6.54 వరకు, రాహుకాలం: ఉ.7.30 నుంచి 9.00 వరకు; దుర్ముహూర్తం: మ .12.24 నుంచి 1.12 వరకు, తిరిగి మ.2.46 నుంచి 3.34 వరకు సూర్యోదయం : ఉ.6.41 గం; సూర్యాస్తమయం: సా. 6.18 గం.

## మహిళా సాధికారతే నా కల

● భారతదేశం ఎంతో మంది శాస్త్రవేత్తలకు నిలయం ● సుశ్రుతుడు, చరకుడు వైద్య రంగంలో మనకు గర్వకారణం ● ఇంటెలిజెన్స్‌ను నిరుపేదల సంక్షేమానికి ఉపయోగించాలి ● జాతీయ విపత్తులు మినహా మిగతావన్నీ మానవ తప్పిదాలే ● మనం అప్రమత్తతతో ఉండి, నిబంధనలను పాటించాలి ● సామాజిక, ఆర్థిక జీవితంలో మహిళలందరికీ సమాన భాగస్వామ్యం ● రేడియో ప్రసంగం మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నెలవారీ రేడియో ప్రసంగం మన్ కీ బాత్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ఆదివారం మాట్లాడారు. భారతదేశం ఎంతో మంది శాస్త్రవేత్తలకు నిలయం. భారత్ గొప్ప గణిత శాస్త్రజ్ఞులైనటువంటి బౌధాయణ, భాస్కర, బ్రహ్మగుప్త, ఆర్యభట్టలకు నిలయం. శుశృతుడు, చరకుడు వైద్య రంగంలో మనకు గర్వకారణం. సర్ జగదీష్ చంద్రబోస్, హరగోవింద్ ఖురానా, సత్యేంద్ర నాథ్ బోస్ వీరంతా గొప్ప శాస్త్రవేత్తలు అంటూ భారత శాస్త్రరంగంలో వాళ్లు చేసిన సేవలను గుర్తు చేశారు. టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను పేదలు, నిరుపేదల సంక్షేమానికి ఉపయోగించాలని ప్రధాని సూచించారు. జాతీయ విపత్తులు మినహా మిగతావన్నీ మానవ తప్పిదాలే. మనం

ప్రముఖ సినీ నటి శ్రీదేవి ఇక లేరు. అభిమాన కోటికి కన్నీళ్లు మిగులుస్తూ ఆమె కన్నుమూశారు. 1963 ఆగస్టు 13న పుట్టిన శ్రీదేవి అసలు పేరు శ్రీ అమ్మా యాంగేర్ అయ్యపాన్. తమిళనాడులోని శివకాశి సొంతూరు. 1975 లో బాలనటిగా సినిమాల్లో ప్రవేశించి.. తెలుగులో 85, హిందీలో 71, తమిళంలో 72, మళయాళంలో 26, కన్నడంలో 6 చిత్రాల్లో నటించి అతిలోకసుందరిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

## దివికెగిసిన అతిలోక సుందరి



### గుండెపోటుతో అందాలనటి శ్రీదేవి కన్నుమూత


● వెంటనే చికిత్స మొదలుపెట్టినా ఫలితం లేకుండా పోయింది ● బాలీవుడ్ నటుడు మోహిత్ మార్వా పెళ్లికి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి ● శ్రీదేవి అసలు పేరు శ్రీ అమ్మా యాంగేర్ అయ్యప్పన్ ● 1975లో బాలనటిగా సినిమాల్లో ప్రవేశం ● అన్ని వయసుల వారికీ అత్యంత ఇష్టమైన నటిగా గుర్తింపు ● శ్రీదేవి భౌతిక కాయం తరలింపులో జాప్యం ● ఇంకా పూర్తికాని లీగల్ ఫార్మాలిటీస్ ● సోమవారం అక్కడి ఫార్మాలిటీస్ పూర్తయ్యాకే భౌతికకాయం తరలింపు

ముంబై: ప్రముఖ సినీ నటి శ్రీదేవి ఇక లేరు. అభిమాన కోటికి కన్నీళ్లు మిగులుస్తూ ఆమె కన్నుమూశారు. ఆమె వయస్సు 54 ఏళ్ళు. బాలీవుడ్ నటుడు మోహిత్ మార్వా పెళ్ళికి అటెండ్ కావడానికి భర్త బోనీ కపూర్, చిన్న కూతురు ఖుషీ కపూర్‌తో కలిసి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి.. అక్కడ హార్ట్ ఎటాక్ రావడంతో అకస్మాత్తుగా మృతి చెందినట్లు సమాచారం. దడక్ మూవీ షూటింగ్ కారణంగా శ్రీదేవి పెద్ద కూతురు జాన్వీ కపూర్ ఈ పెళ్లికి హాజరు కాలేదని తెలుస్తోంది. విషాద వార్త మిగతా 6లో

### శ్రీదేవి మృతి కలచివేసింది



శ్రీదేవి మరణించిందన్న వార్త తనను ఎంతో కలచివేసిందని మోడీ తెలిపారు. భారతీయ సినీ చరిత్రలోనే గొప్ప నటిగా ఆమె పేరు సంపాదించారని కొనియాడారు. చిత్రపరిశ్రమకు శ్రేదేవీ లేని లోటు భర్తీ చేయలేనిదన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మోడీ ఆకాంక్షించారు. – ప్రధాని మోడి



### దేశం గర్వించదగ్గ నటి సిఎం చంద్రబాబు

### శ్రీదేవి మరణం తీరనిలోటు : కేసీఆర్



## అవినీతి నిర్మూలనలో మోడీ విఫలం



● మోడీ చెబుతున్న మాటలు కేవలం ఎన్నికల వాగ్దానాలే!
● దేశానికి కాపలాదారుగా ఉంటానన్న మోడీ ఏం చేస్తున్నారు
● బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లెక్కలేనన్ని సమస్యలు
● గుజరాత్ ఎన్నికల ప్రచారంలో పలు ఫిర్యాదులు అందాయి
● కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## నేటి నుంచి బస్సుయాత్ర

● మధ్యాహ్నం ఒంటి గంటకు చేవెళ్ల నుంచి ప్రారంభం ● ప్రజాచైతన్య యాత్రలో పాల్గొననున్న కాంగ్రెస్ అగ్రనేతలు ● ఎక్కడో ఒక చోట రాహుల్ పాల్గొనే ఛాన్స్ ● ఐక్యంగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం ● రాహుల్, కుంతియా, ఉత్తమ్ బొమ్మలతో 40 సీట్ల ఓల్వో బస్సు సిద్ధం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాచైతన్య బస్సు యాత్ర నేటి నుంచి ప్రారంభం కానుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు చేవెళ్ల నుంచి బస్సుయాత్ర ప్రారంభం కానుండగా, అంతకుముందు కాంగ్రెస్‌నేతలు సర్వ మత పూజలు నిర్వహించనున్నారు. నాంపల్లిలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, అరెమైసమ్మ దేవాలయంలో పూజలు, మొయినాబాద్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్‌పార్టీ మార్చి 11వతేదీ వరకు నిర్వహించనున్న ప్రజాచైతన్యబస్సుయాత్రలో ఎక్కడో ఒక చోట ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పాల్గొనే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుని నుంచి రాష్ట్ర పార్టీ నేతలకు వర్తమానం అందినట్లు సమాచారం మిగతా 6లో

## రైతే రాజు



### రైతులను 'ధనికులు'గా మార్చడమే లక్ష్యం

● రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి ● రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడుగా 'గుత్తా' ● చెక్కులద్వారానే 'పెట్టుబడి' డబ్బు అందజేత ● పెట్టుబడి పథకం కోసం రూ.12 వేల కోట్లు ● అడవిపందుల బెడదనుంచి కాపాడేందుకు సోలార్ ఫెన్సింగ్ ● 75శాతం సబ్సిడీతో టార్పాలిన్లు సరఫరా ● నాట్లు వేసే యంత్రాలను 50 శాతం సబ్సిడీతో అందజేత ● ప్రతి నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ● ప్రతి రైతు వేదికకు రూ.12లక్షల నిధులు ● ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గత ప్రభుత్వాల తీరుతో రైతు పరిస్థితి ఘోరంగా మారిందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఒకప్పుడు కరువు వస్తే ఆ ఏడాదిని గుర్తు పెట్టుకునే వాళ్లం. వాతావారణ సమతౌల్యం దెబ్బతినడం వల్లనే అతివృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడ్డాం. సమైక్య రాష్ట్రంలో నీళ్లివ్వలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ని అవస్థలు పడ్డమో వర్ణనాతీతం. రైతుల కోసం మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నం. దశాబ్దాల తరబడి వేదనకు గురై ఈ సంకల్పానికి శ్రీకారం చుట్టినం. వ్యవసాయానికి రైతే రాజు. గ్రామాల్లో రైతుల ఆవేదన నా చెవులారా విన్న. జరగాల్సింది ఇంకా ఎంతో ఉంది. వ్యవసాయం వాణిజ్యం కాదు.. అదొక జీవన మిగతా 6లో



## అంతా ఇంతే!




అందులో మీరెన్నిసార్లు హోదా కోసం ఢిల్లీకి వెళ్లారో ఉంటుందా!

## బీసీలకు ఏదీ న్యాయం?

### బడుగుల బతుకులు మారేదెప్పుడు?



● 70 ఏళ్ల స్వాతంత్ర భారతావనిలో రాజ్యాధికారంలో వాటా అందని ద్రాక్షేనా! ● పార్లమెంటులో బిసి బిల్లు ప్రవేశపెట్టేది ఎప్పుడు? ● అరకొర నిధులతో బీసీల సంక్షేమం ఎలా సాధ్యం ● బీసీల జనగణన పూర్తి చేయాలనే తపన పాలకులకు లేదా? ● తెలుగు రాష్ట్రాల్లో బిసి సబ్-ప్లాన్ అమలు ఎప్పుడు? ● బిసిల రిజర్వేషన్లు 59 శాతానికి పెంచాలని డిమాండ్ స్థానిక సంస్థల కోటాలోనూ పెంచేలా చర్యలు చేపట్టాలి ● బిసి విద్యార్థుల పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించాలి ● క్రీమీలేయర్‌ను వెంటనే ఎత్తివేయాలని బీసీల డిమాండ్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: 70ఏళ్ల స్వతంత్ర భారతావనిలో బడుగులకు రాజ్యాధికారంలో వాటా అందని ద్రాక్షలానే మిగిలిపోయింది. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాలలో దక్కాల్సిన హక్కుల కలలు.. కలలుగానే మిగిలిపోతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే.. బడుగుల బతుకులు పాలకులకు గుర్తుకు వచ్చేది. అధికారంలో ఉన్న



న్నాళ్లు గుర్తుకు రాని సంక్షేమం, అభివృద్ధి, పథకాలు ఎన్నికల నగారా మోగించగానే గుర్తుకువస్తాయి. మళ్లీ అధికారం దక్కించుకోవాలనే తపనే కనిపిస్తుంది తప్ప.. న్యాయం చేయాలని కాదు. అధికారం కోసం ఆయా రాజకీయ పార్టీలు తమ మేనిపెస్టోలో అమలుకు సాధ్యం కాని పథకాలను సైతం పొందుపరచి, వాటిని అమలు చేయడం తమతోనే సాధ్యమని, దీంతో మిగతా 6లో

## కదం తొక్కుతూ జనాన్ని పలకరిస్తూ

● ప్రకాశం జిల్లాలోని కనిగిరి మండలంలో పాద యాత్ర ● జోష్‌గా కొనసాగుతున్న జగన్ ప్రజా సంకల్ప యాత్ర ● 1300కిలో మీటర్లు దాటిన ప్రజా సంకల్పయాత్ర ● నందనమారెళ్ల వద్ద మొక్క నాటిన జగన్

(కనిగిరి నుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు జనంలోకి వెళ్లిన వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రలో తొలినాటి జోష్‌నే కొనసాగిస్తున్నారు. అదే తరహాలో జనం తాకిడి పాదయాత్రలో కనిపిస్తోంది. ఎక్కడా అలసిపోకుండా జనం గోడు వింటూ నేనున్నానని చెబుతూ ముందుకు కదులుతున్నారు. ఆదివారంనాడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అంతే హుషారుగా తన పాద యాత్రను కొనసాగించారు. ప్రకాశం జిల్లాలోని కనిగిరి మండలం టకారిపాలెం గ్రామం నుంచి ప్రారంభమైంది. దాదాపు ఆరునెలలపాటు జగన్ పాదయాత్ర నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు జగన్ పాదయాత్ర నిర్వహిస్తుండగా ఆ పాదయాత్ర



ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో జరుగుతోంది. టకారిపాలెం నుంచి పాదయాత్ర ప్రారంభంకాగా మిగతా 6లో

# దుష్ప్రచారం వెనుక కోచింగ్ సెంటర్ల పాత్ర

హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీఆర్‌టీ పరీక్షల నిర్వాహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీఎస్‌పీఎస్సీ) పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అనంతరం కూడా, పరీక్షలు వాయిదా పడనున్నాయన్న సామాజిక మాధ్యమాల వేదికగా జోరుగా జరిగింది. ముందస్తు షెడ్యూల్ ప్రకారమే టీఆర్‌టీ పరీక్షలు నిర్వాహిస్తామని ఒకవైపు ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ గంటా చక్రపాణి పదే, పదే ప్రకటించినా, ఈ ఊహాగహానాలకు మాత్ర తెరపడలేదు. టీఎస్‌పీఎస్సీని అప్రతిష్టపాలు చేసేవిధంగా ఈ దుష్ప్రచారాన్ని నిర్వహించిందేవరన్న దానిపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చే స్టడీ సెంటర్ల నిర్వాహకులే టీఎస్‌పీఎస్సీని అప్రతిష్టపాలు చేసేవిధంగా సామాజిక మాధ్యమాల ద్వారా, ఈ దుష్ప్రచారాన్ని నిర్వహించినట్లు ప్రభుత్వ వర్గాలు గుర్తించినట్లు సమాచారం. టీఆర్‌టీ వాయిదా పడితే, కోచింగ్ తీసుకునే అభ్యర్థుల నుంచి మరింత డబ్బులు దండుకోవచ్చున్న ఏకైక లక్ష్యంతోనే కోచింగ్‌సెంటర్ల నిర్వాహకులు ఈరకమైన ప్రచారానికి నాంది పలికారన్న విషయాన్ని తెలుసుకుని అవాక్కవడం ప్రభుత్వ వర్గాల వంతయింది. ధనార్జన కోసం కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇంతగా దిగజారి, అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడేందుకు ప్రయత్నించడం క్షమించరాని నేరమని భావిస్తున్న ప్రభుత్వ వర్గాలు, సైబర్ చట్టాల ద్వారా ఎలా శిక్షించే అవకాశముందో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీకి అప్పగించింది. గతంలో ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఈవోలే భర్తీ చేయగా, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం టీఆర్‌టీ పరీక్షల నిర్వహించే బాధ్యతను టీఎస్‌పీఎస్సీ అప్పగించడమే కాకుండా, ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కూడా భుజాలపైపెట్టింది. టీఆర్‌టీ పరీక్షల నిర్వాహణకు అభ్యర్థుల హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో పరీక్షలు వాయిదాపడనున్నాయంటూ ప్రచారం చేసిన వ్యక్తులు ఇదే అదనుగా మరింత రెచ్చిపోయారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తడానికి కారణాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది.

# భాగ్యనగరిలో ఈవెంట్లే ఈవెంట్లు

- నిత్యం జాతీయ, అంతర్జాతీయ సదస్సులు
- ప్రపంచంలోని ప్రముఖుల హాజరు
- ప్రముఖులకు సర్కార్ ఆతిథ్యం
- తెలంగాణ వంటకాల రుచి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో నిత్యం ఈవెట్లలో కిటకిటలాడుతోంది. జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హైదరాబాద్ వేదికగా మారింది. జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు తెలంగాణ సర్కార్ ప్రొత్సహం కనబరచడంతో ఇటీవల కాలంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో హైదరాబాద్ నగరం కళకళలాడుతున్నది. ముఖ్యంగా దేశంలో పెద్ద పెద్ద సదస్సులు నిర్వహించేందుకు సరైన భద్రత, అనువైన వేదికలు లేకపోవడం...ఇలాంటి వేదికలు నగరంలో ఉండడంతో అంతర్జాతీయ, జాతీయ సదస్సులన్నీ నగరంలో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులకు హాజరవుతున్న ప్రపంచంలోని ప్రముఖులు, పేరున్న పారిశ్రామిక వేత్తలకు తెలంగాణ సర్కార్ భద్రతతో పాటు ఆతిథ్యం కల్పిస్తున్నది. సదస్సులన్నీ అదిరేలా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి



కల్వకుంట్ల తారకరామారావు దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు తెలంగాణ వంటకాలను అతిథులకు వండివార్చుతున్నారు. ఏర్పాట్లు, ఆతిథ్యం చూపి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్‌తో సహా పారిశ్రామిక దిగ్గజాలు సైతం సర్కార్‌పై ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే!. జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో తెలంగాణాలోపెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రొత్సాహకాలను ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మరో పక్క మంత్రి కేటీఆర్ వివరిస్తూ పెట్టుబడులను రాబట్టేందుకు కృషిచేస్తుండడం గమనార్హం. ఈ సదస్సులకు హాజరయ్యే పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా భేటీ అవుతూ పెట్టుబడులు పెట్టాలని చేస్తున్న అభ్యర్థనలు ఫలిస్తున్నాయి. ఇటీవల కాలంలోనే అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సు, అలాగే తెలుగు మహాసభలను తెలంగాణ సర్కార్ అదిరేలా నిర్వహించింది. వీటితో పాటు జాతీయ ఐటి సదస్సును సక్సెస్‌గా నిర్వహంచిన ప్రభుత్వం అనంతరం బయో ఆసియా సదస్సు సైతం దిగ్విజయంగా ముగిసింది. అలాగే జాతీయ టూరిజం సదస్సు సైతం నిర్వహించి శభాష్‌అనిపించుకుంది. ఇక సోమవారం నుంచి రెండు రోజుల పాటు హెచ్‌ఐసీసీ వేదికగా జాతీయ ఈ-గవర్నెన్సె సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సదస్సును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ పాలనను ప్రజలకు పారదర్శకంగా..మధ్యవర్తి ప్రమేయం లేకుండా అందించే పలు అంశాలను ఈ సదస్సులో చర్చించబోతున్నారు.

## రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**టీ-పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క**



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రానున్నా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలని తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లోని ఇందిరా భవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ పూర్వ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయిన భట్టి విక్రమార్క మాట్లాడుతూ రానున్నా ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి, ఆరు దశాబ్దల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీకి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అప్రజాస్వామిక పాలన నడుస్తోందని విమర్శించారు. కుటుంబ పాలనకు ముగింపు పలికి, ఇందిరమ్మ సంక్షేమ రాజ్యాన్ని తెచ్చుకోవాలన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో యూత్ కాంగ్రెస్ పాత్ర చాలా ఉందన్న భట్టి , మనలో ఉన్న అభిప్రాయ భేదాలను పక్కన పెట్టాలని చెప్పారు. మనందరం కాంగ్రెస్ కుటుంబమన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకుల శ్రమ, కృషి, పట్టుదల వల్లే పార్టీ బలోపేతం అవుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్రతో దండయాత్ర మొదలుపెట్టిందని భట్టి అన్నారు.

## చంద్రబాబు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

**రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు**



అమరావతి,సూర్యబ్యూరో: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం, మార్గదర్శకమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రాకృష్ణుడు పేర్కొన్నారు. ఆదివారం మంత్రి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాజకీయనేతగా 40 ఏళ్ళను పూర్తిచేసుకోవడం పట్ల మంత్రి యనమల సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పురోగతిలో సీఎం చంద్రబాబుది ప్రధాన పాత్ర అన్నారు. అలాగే కొత్తరాష్ట్రం నిర్మాణంలో సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి అమోఘమని, సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకోవడంలో సీఎం చంద్రబాబు సాటిలేని మనిషి అని యనమల కొనియాడారు. అంతేగాక రాబోయే తరాల భవిష్యత్తు కోసం నిరంతరం తపన పడే నాయకుడు చంద్రబాబు అన్నారు

## ఎలాంటి నిర్ణయానికైనా చంద్రబాబు సిద్ధం

**ఏపీ మునిసిపాల్ మంత్రి నారాయణ**



విజయనగరం,సూర్యబ్యూరో: ఏపీ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం సహకరించకపోతే ఎలాంటి నిర్ణయానికైనా సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని నెల్లిమర్ల మండలం సారిపల్లి వద్ద నిర్మిస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ గృహ సముదాయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో వచ్చే ప్రయోజనాలే ప్యాకేజీ ద్వారా ఇస్తామన్నారని, ఏ రూపంలో ఇచ్చినా హోదాకు సమానంగా ఇవ్వాలన్నారు. ఇప్పటికి హోదా ఇస్తారనే ఆశతో ఉన్నామని మంత్రి అన్నారు. అలాగే విజయనగరంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తామని, షేర్‌వాల్ టెక్నాలజీతో నాణ్యమైన ఇళ్లు నిర్మిస్తున్నామని, మార్చి 24న 20వేల ఇళ్లను పేదలకు అందజేస్తామని మంత్రి అన్నారు.

## రాజీనామాలతో లాభంలేదు : సీఎం రమేశ్



అమరావతి, మేజర్‌న్యూస్: వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు బుందేల్‌ఖండ్ వంటి పరిహారం ఇవ్వాలని ఎంపీ సీఎం రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నా బీజేపీ ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు కృషి వల్ల రాయలసీమలో కియా మోటార్స్ వచ్చిందన్నారు. హామీల సాధన కోసం ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో ఎంపీలు రాజీనామాలు చేయడం వల్ల లాభంలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్ర ప్రభుత్వం పడిపోదని, అలాంటి సమయంలో రాజీనామాలతో ఉపయోగంలేదన్నారు. ఈడీ కేసుల కొట్టివేత కోసమే వైసీపీ అధినేత జగన్ బీజేపీ వెంటపడుతున్నారని రమేశ్ విమర్శించారు.



చేవేళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం అందుకున్న దృశ్యం.

## జగన్‌కు స్వాగతం ఎస్‌వో, పీఈటీ సస్పెన్షన్



కనిగిరి టౌన్, మేజర్‌న్యూస్ః వైసీపీ అధినేత జగన్ పాదయాత్ర సందర్భంగా కనిగిరి నగర పంచాయతీ పరిధిలోని కస్తూర్బా స్కూల్ విద్యార్థులు వైఎస్సార్ అక్షరాకృతిలో ప్రదర్శన ఇవ్వడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ప్రత్యేకాధికారి సుజాత, పీఈటీ వరలక్ష్మిలు సస్పెండ్ చేశారు. ఆమేరకు కలెక్టర్ వినయ్ చంద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ ప్రజా సంకల్పయాత్రలో భాగంగా కస్తూర్బా స్కూల్ మీదుగా శనివారం వెళ్తుండగా బాలికలు వైఎస్సార్ అక్షరాకృతిలో కూర్చొని స్వాగతం పలికారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థినులను తరగతులకు దుమ్మా కొట్టించి, ర్యాలీగా వస్తున్న రాజకీయ పార్టీల నేతలకు స్వాగతం పలికించారని ఎమ్మెల్యే బాబూరావు కలెక్టర్‌కు, సర్వశిక్షా అభియాన్ పీవోకు ఫిర్యాదు చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో అసిస్టెంట్ జీసీడీవో హేమలత, సీఎంవో కొండారెడ్డి కస్తూర్బా స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. తొలుత ఎస్‌వో సుజాతను సంజాయిషీ కోరుతూ మెమో జారీ చేసిన అధికారులు, విచారణ అనంతరం ఆమెతోపాటు, పీఈటీపై చర్యలు తీసుకున్నారు

# హైదరాబాద్‌లో చెక్కుచెదరని టీడీపీ

**ఇంటింటికి టీడీపీలో పాల్గొన్న రావుల**

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో తెలుగుదేశం పార్టీ చెక్కుచెదరలేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న ఇంటిటికి తెలుగుదేశం కార్యక్రమం లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని బోలాక్‌పూర్‌లో రావుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌నగరాన్ని అందంగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భారీ ఎత్తున ప్రజలు పాల్గొని, పార్టీకి నీరాజనం పలకడంతో పార్టీ పూర్వవైభవాన్ని సంతరిస్తుందని అనడంతో ఏమాత్రం సందేహం లేదన్నారు. అధికారం...తమ రాజకీయ లబ్ధికోసం పార్టీ నుంచి నేతలు వెళ్లినా తిరిగి నేతలను తయారు చేసుకునే సత్తా ఒక్క తెలుగుదేశం పార్టీకి మాత్రమే ఉందన్నారు. నగరంలో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు, నాయకుల కొదవ లేదని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతారన్నారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి లంకెల దీపక్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు ఎం .ఎన్. శ్రీనివాస్ రావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. భోలాక్‌పుర హౌస్ నుండి జిల్లా అధ్యక్షులు ఎం.ఎన్. శ్రీనివాస్ రావు, పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి డప్పును మోగించి కార్యక్రమాన్ని ప్రారంభిచారు. ఈ సందర్బంగా ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగాచేపడుతున్న పాదయాత్రకు ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని తెలిపారు. ప్రజల సమస్య



ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని, ప్రజలకు అండగా తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని అన్నారు. పాదయాత్రలో ప్రజలు స్వచ్చందంగా పాల్గొని తమ సమస్యలను మా దృష్టికి తెస్తున్నారని వాటికి పరిష్కరించే విధంగా స్థానిక నాయకులను, కార్యకర్తలను సమాయత్తం పరుస్తున్నామని ఎమ్మెన్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ ముప్పిడి నర్సింగ్, డివిజన్ అధ్యక్షులు నవీన్, అస్లాం, బాలరాజ్ గౌడ్, ఎ.సుదేష్ బబ్లా అంథోని, శంకర్ ముదిరాజ్, కోరెవు శ్రీహరి, జహీరుద్దీన్ సమర్, అమరం వినోద్, రవీందర్ గౌడ్, బాబూ, రామ్ పాల్ దేవుడా, టి ఎన్ ఎస్ ఎఫ్ శరన్ తదితరులు పాల్గొన్నారు.

# 27న సీఎం కేసీఆర్ సింగరేణి యాత్ర

**మార్చి 5న ధర్మపురి, బాసర, నిర్మల్ పర్యటన**

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 27న సింగరేణి యాత్ర చేపట్టనున్నారు. ఆ రోజున మంచిర్యాలలోని శ్రీరాంపూర్ గనుల ప్రాంతంలో పర్యటిస్తారు. అనంతరం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో జరిగే సమావేశంలో సింగరేణి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని రామగుండం 1, 2, 3 గనులు, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ గనులకు చెందిన కార్మికులకు 27వ తేదీన సెలవు ప్రకటించారు.

మార్చి 5న ధర్మపురి, ముధోల్, నిర్మల్ పర్యటన

సీఎం కేసీఆర్ మార్చి 5న ధర్మపురి, ముధోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఆ రోజున ఉదయం ధర్మపురి నృసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తర్వాత నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమవుతారు. అనంతరం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ముధోల్ నియోజకవర్గంలోని బాసర సరస్వతి దేవాలయంలో పూజలు జరిపి.. అక్కడ ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. సాయంత్రం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మల్‌లో జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయానికి, పోలీసు కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం పర్యటన సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన అంశాలపై జిల్లా అధికారులతో ఆదివారం సమీక్షించారు. బహిరంగ సభ ప్రదేశాన్ని సైతం మంత్రి పరిశీలించారు.

## శ్రీదేవి నటన చిరస్మరణీయం

★మరణవార్త తెలియగానే దిగ్భ్రాంతికి లోనయ్యా
★నటిగా శ్రీదేవి ముద్ర చిత్రసీమలో సుస్థిరం
★ సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్

హైదరాబాద్,మేజర్‌న్యూస్: భారతీయ వెండితెరపై తనదైన ముద్రను వేసుకున్న శ్రీదేవి హఠాన్మరణం నమ్మలేనిదని ప్రముఖ హీరో, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె మరణవార్త తెలియగానే దిగ్భ్రాంతికి లోనయ్యానని ఆయన చెప్పారు. అసమానమైన అభినయ ప్రతిభతో భారత ప్రేక్షకలోకం అభిమానాన్ని ఆమె చూరగొన్నారు. శ్రీదేవి ఇకలేరు అనే మాట నమ్మలేనిది. కానీ ఆమె చేసిన పాత్రలన్నీ చిరస్మరణీయాలే. ఆమె భౌతికంగా ఈ లోకాన్ని వీడినా నటిగా శ్రీదేవి ముద్ర చిత్ర సీమలో సుస్థిరం. ఆమె కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకుని నిలబడే మానసిక స్థైర్యాన్ని ఆ భగవంతుడు అందించాలని ప్రార్థిస్తున్నాను. తెలుగులో బడిపంతులు చిత్రంలో 'బూచాడమ్మ బూచాడు' అనే పాటలో ఆమె కళ్లు అటూ ఇటూ తిప్పుతూ పలికించిన హావభావాల్ని ప్రేక్షకులు ఎన్నటికీ మరిచిపోలేరు. అదే విధంగా అన్నయ్యతో జగదేకవీరుడు అతిలోకసుందరి చిత్రంలో దేవకన్య ఇంద్రజగా ఆమె కనిపించిన తీరు, 'మానవా' అంటూ ఆమె చెప్పే సంభాషణలు కూడా అందరూ గుర్తు చేసుకునేవే. ఆమె అమాయకత్వపు నటన మరువలేనిది. కొంత విరామం తర్వాత హిందీలో ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ చిత్రాల ద్వారా శ్రీదేవి తన శైలి నటనను ఈ తరానికీ చూపించారు. శ్రీదేవి తన పెద్ద కుమార్తెను కథానాయికగా చిత్రసీమకి తీసుకువస్తున్న తరుణంలో ఆమె ఈ లోకాన్ని వీడిపోవడం బాధాకరం అంటూ జనసేన పార్టీ తన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేరుతో సోషల్ మీడియాలో ఓ ప్రకటనను విడుదల చేసింది. కాగా, దుబాయిలో ఓ వివాహానికి హాజరైన శ్రీదేవి శనివారం రాత్రి గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మరణంతో చలనచిత్ర పరిశ్రమలు మూగబోయాయి.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జోగు



ఆదిలాబాద్, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగు రామన్న, జిల్లా కలెక్టర్ దివ్య ఆదివారం పరిశీలించారు. ఈనెల 27వతేదీన సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్మితమవుతున్న చనాకా-కోరాట బ్యారేజీ పనులను సీఎం పరిశీలించనున్నారు. అలాగే ఆయా అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి రామన్న, కలెక్టర్ దివ్యతోపాటు ఆయా శాఖల అధికారులు పరిశీలించారు.

# టీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడుదాం

- బస్సుయాత్రను విజయవంతం చేయాలి
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి
- మహిళలకు వడ్డీలేని రుణాలు అందజేస్తాం
- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- మాటల్లో తప్ప చేతల్లో కనిపించని బంగారు తెలంగాణ
- ఒకవైపు నిరుద్యోగులు పెరుగుతుంటే... అధికారాన్ని అనుభవిస్తున్న కేసీఆర్ కుటుంబ సభ్యులు
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ ః ప్రజా చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. అధికార టీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తున్న వర్గాలు కూడా తమతో కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు వడ్డీలేని రుణాలు, నిరుద్యోగ యువతకు రూ. మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఈసందర్భంగా ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఆదివారం గాంధీ భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. దళితులు, గిరిజనులకు మూడు ఎకరాల భూమి, రిజర్వేషన్లు కల్పిస్తానంటూ మోసం చేశారని మండిపడ్డారు. పోడు భూములను సైతం ఏజెన్సీల్లో టీఆర్ ఎస్ నేతలు వదలటం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టీఆర్ఎస్ పాలనలో కొనసాగుతున్న అవినీతి, అక్రమాలను బయటపెడతామని ఉత్తమ్ చెప్పారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్, వాటిని



అమలు చేయకుండా తెలంగాణ సమాజాన్ని మోసం చేశారని దుయ్యబట్టారు. ఉద్యమకారులు, అమరుల కుటుంబాన్ని ఆదుకుంటానని మాయమాటలు చెప్పి, ఆ కుటుంబాలను నయవంచన చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మాటల్లో తప్పా చేతల్లో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలను మాత్రమే కేసీఆర్ చేస్తున్నారని ఉత్తమ్ విరుచుకుపడ్డారు. నాలుగేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజా సంక్షేమన్నదే లేదని అన్నారు. అంతకుముందు ఇందిరాభవన్ లో జరిగిన పూర్వ ఎన్ ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు ద్వారా కేసీఆర్ నియంతపాలన, కుటుంబానికి పరిమితమైన సంక్షేమాన్ని ఎండగడతామని చెప్పారు.

**అప్పుల కుప్పగా తెలంగాణ**

గాంధీభవన్ లో ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, మల్లు రవి సమక్షంలో ఓయూ జేఏసీ, నిరుద్యోగ సంఘాల పోస్టర్ ఆవిష్కరించారు. గౌడలకు, కల్లుగీత కార్మికుల జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ ఆధ్వర్యంలో గౌడసంఘం పోస్టర్ ను ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడిజిల్లా కన్వీనర్ బుసనవేణి రమేష్ గౌడ్, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు. తెలంగాణలో ఒకపక్క నిరుద్యోగం పెరుగుతుంటే, కేసీఆర్ ఇంట్లో మాత్రం అందరూ అధికారం అనుభవిస్తున్నారని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణ కేసీఆర్ మాటల్లో తప్పా, చేతల్లో లేదని ఆయన అన్నారు. ఉత్తమ్ సమక్షంలో ఖమ్మం జిల్లా, డోర్నకల్ నుంచి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర విభజన సమయంలో మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం రూ. 2 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మారిందని ఉత్తమ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను తెలియజేసిన వారిపై అక్రమ కేసులు బనాయించటం, హత్యలు చేయించటం జరుగుతుందన్నారు. బస్సు యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పెర్క శ్యామ్ సారథ్యంలో నిర్మించిన తెలంగాణ గుండె చప్పుడు పాటల సీడీని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. కేసీఆర్ లాంటి నియంత పాలన వల్ల ఉద్యమకారులు, అమరుల స్ఫూర్తి దెబ్బతింటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉద్యమ స్ఫూర్తి, తెలంగాణ ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేరిస్తే, కేసీఆర్ కుటుంబపాలన చేస్తున్నారని ఉత్తమ్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో సాంస్కృతి బృందం పాటలు పాడి వినిపించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం మృత్యుంజయం, హరకాల వేణుగోపాలరావు, నేరళ్ల శారద పాల్గొన్నారు.

## జగన్ సీఎం అయితేనే అభివృద్ధి

**ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి**



చెన్నూరు, మేజర్‌న్యూస్ః వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. చెన్నూరు బెస్తకాలనీలో పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక కమలాపురం నియోజకవర్గంలో ఏడాదికి 100 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. నవర త్నాలు పథకం ద్వారా బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు 45 ఏళ్లకే పింఛన్లు ఇవ్వడం ద్వారా మంచి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రైతుల, మహిళల, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరి అభివృద్ధికి పాటు పడతామన్నారు. వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీదేవి మృతి భారత సినీ పరిశ్రమకు తీరని లోటు : కె.లక్ష్మణ్

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: సినీ వినీలాకాశంలో ధృవతారలా ఓ వెలుగు వెలిగిన గొప్ప నటి శ్రీదేవి మృతి పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నటి శ్రీదేవి అకాల మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గిరి చేసిందని, ఆమె లేని లోటు ఎవరూ పూడ్చలేరని లక్ష్మణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యావత్ భారత దేశ సినీ పరిశ్రమకు అమె మరణం తీరని లోటు, అమె అభినయంతో దేశమంతా అభిమానుల హృదయాలను చూరగొన్నారని, శ్రీదేవి తన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీదేవి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు.

అలాగే కేంద్రమాజీ మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యులు బండారు దత్తాత్రేయ శ్రీదేవి మృతి పట్ల ట్విట్టర్ ద్వారా సంతాపాన్ని తెలియజేశారు.

### శ్రీదేవి మృతి సినీ లోకానికి తీరని లోటు : వైసీపీ ఎమ్మెల్యే రోజా

తిరుమల, మేజర్‌న్యూస్‌: నటి శ్రీదేవి మరణం సినీ లోకానికి తీరని లోటని వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. శ్రీవారిని దర్శించుకునేందుకు రోజా తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. ఏడుకొండలవాడిని దర్శించుకున్న తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ శ్రీదేవిని ఆదర్శంగా తీసుకుని అనేకమంది సినిమాల్లో నటించటానికి వచ్చారని, అందులో తానూ ఒకరినని చెప్పారు. ఆమె ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

**చంద్రబాబు యూటర్న్‌:** ప్రత్యేక హోదా ఉద్యమంలో ప్రజలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ప్యాకేజీ కోసం పాకులాడిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా రాకుంటే రాష్ట్ర నష్టం పోతుందని చంద్రబాబు ఇప్పుడు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. కేసులకు భయపడేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాదని తనపై బురద చల్లినా నిర్దోషిగా నిరూపించుకోవటానికి కోర్టులకు తిరుగుతున్నారని చెప్పారు. కానీ చంద్రబాబు నాయుడు ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా బుక్కైనా స్టేలు తెచ్చుకుని కోర్టులకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నారని ధ్వజమెత్తారు.

# రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై సీఎం కసరత్తు

- భారీగా ఆశావహులు
- తెరపైకి కొత్త పేర్లు
- పోటీ పడుతున్న పలువురు సీనియర్ నేతలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్ర సమితిలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై గులాబిదళపతి, సీఎం చంద్రశేఖర్‌రావు వడపోతకు శ్రీకారం చుట్టారు. ఉద్యమపార్టీ అయిన టీఆర్ఎస్‌లో పదవులకోసం భారీగా ఆశావాహులు పదవికోసం పోటీపడుతున్నారు. దీంతో పార్టీలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక వేడి కొనసాగుతున్నది. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కోసం సీఎం కేసీఆర్ వడపోతకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారితో పాటు పార్టీకి సేవలు అందిస్తున్న ముఖ్యనేతలు, సీనియర్లకు రాజ్యసభ అవకాశం కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఏప్రిల్ 2వ తేదీతో తెలంగాణ లో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో... 3 స్థానాలు కూడా టిఆర్ఎస్ పార్టీకే గెలుచుకునే అవకాశం కలిగింది. దీంతో టిఆర్ఎస్ పార్టీ లోని కొంత మంది ఆశావాహులైన నేతలు రాజ్యసభ పదవిపై దృష్టి సారించారు. పార్టీలో మొదటి నుండి పనిచేస్తున్న నేతలతో పాటు తాజాగా పార్టీలో చేరిన నేతలు, ఇతర పార్టీలోని కొంతమంది నేతలు కూడా రాజ్యసభ సీటు కోసం తహతహలాడుతున్నారు. వీరిలో పలువురు నేతలు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావులతో పాటు ఎంపి కవితల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. రాజ్యసభ సీటు కోసం పోటీ పడుతున్న వారిలో పలువురు సీనియర్లున్నారు. టిఆర్ఎస్ పార్టీలో రాజ్యసభ సీటును ఆశిస్తున్న వారిలో పార్టీ ప్రధాన కార్యదర్శి, సీఎం వ్యక్తిగత కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, గొల్ల కురుమలలో నుంచి ఒక్కరికి ప్రాతినిధ్యం కల్పిస్తానని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించడంతో ఆ వర్గాలకు చెందిన పలువురు నేతలు రాజ్యసభ పదవికోసం ఎవరికివారుగా యత్నిస్తున్నారు. ఈ సామాజిక వర్గానికి చెందిన వరంగల్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యాసంస్థల అసోసియేషన్ నాయకుడు సుందర్ రాజ్ యాదవ్ రాజ్యసభ టికెట్ ఆశిస్తున్నారు. టీఆర్ఎస్ పార్టీ, ఉద్యమంలో క్రియ శీలకంగా పాల్గొనడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అందరితో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. అంతేకాదు గతంలో పార్టీ కార్యక్రమాలకు తనదైన శైలిలో చేయూతనిస్తు ముందుకు సాగారు. మరో సీనియర్ నాయకుడు రాజయ్య యాదవ్ కూడా రాజ్యసభ రేసులో ఉన్నారు. అయితే ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం ప్రత్యేకంగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలువురు నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి





సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. అంతేకాదు రెడ్డి సామాజికవర్గానికి చెందిన పలువురు నేతలు రాజ్యసభ సీటును అడుగుతున్నట్లుగా సమాచారం. రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఒక మాజీ ఎమ్మెల్సీ తో పాటు మరో నాయకుడు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లుగా వినికిడి. మరోవైపు స్పీకర్ మధుసూదనాచారి పేర్లు కూడా సీఎం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వరంగల్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు పేరు కూడా రాజ్యసభ రేసులో ఉన్నట్లు పార్టీ నేతలు



చర్చించుకుంటున్నారు. ఇప్పటి వరకు పార్టీ పరంగా రాజకీయ పదవులు కల్పించని కులాలకు ఈ సారి రాజ్యసభలో ప్రాతినిత్యం కల్పించాలని సీఎం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగా సీఎం సొంత సామాజిక వర్గానికి చెందిన సంతోష్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సంతోష్ పేరు ఖారారు అయ్యిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన నేతల్లో కొంతమంది రాజ్యసభ అభ్యర్థిత్వంపై ఎవరికి వారుగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గొల్ల కురుమ వర్గానికి చెందిన చెందిన సుందర్ రాజ్ యాదవ్ తెరపైకి వచ్చారు. ఈయనకు ముఖ్యమంత్రి దగ్గర ప్రాధాన్యత ఉన్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు స్థానాలకు



పదుల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతుండటంతో ఎంపికపై సీఎం కెసిఆర్ వడపోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు విశ్వసనీయ సమాచారం. మరో వారం రోజుల్లోనే అభ్యర్థుల ఎంపికపై సీఎం కేసీఆర్ స్పష్టత ఇవ్వనున్నారు. ఇందులో అదృష్టం ఎవరికి వరిస్తుందో వేచిచూడాలి మరీ...!

## కళ్లతో అన్ని భావాలను పలికించిన గొప్ప నటి శ్రీదేవి

**ఎంపీ మురళీమోహన్**



రాజమహేంద్రవరం,సూర్యబ్యూరో: సినీ ప్రపంచంలో ధ్రువతారగా వెలుగొందిన శ్రీదేవి అందరినీ వదిలి నింగికెగశారు. ఈ సందర్భంగా ఆమెతో కలసి నటించిన మురళీమోహన్ ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 'మా బంగారక్క' అనే సినిమాలో తామిద్దరం కలసి తొలిసారి హీరోహీరోయిన్లుగా నటించామని ఆయన తెలిపారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో ఇద్దరం కలసి నటించామని చెప్పారు. ఆమె చాలా సరదాగా ఉండేవారని తెలిపారు. బాలనటిగానే ఎంతో మంచి పేరు తెచ్చుకున్న ఆమె హీరోయిన్ గా అగ్రస్థానానికి ఎదిగినా, అంతే ఒద్దికగా ఉండేవారని, డైరెక్టర్ ఏది చెబితే దాన్ని పాటించేవారని చెప్పారు. ఆమె సిన్సియారిటీ, నిబద్ధతను చూసిన తామంతా ఏ రోజైనా శ్రీదేవి అగ్రనటిగా ఎదుగుతుందని, ఈ దేశాన్ని ఏలుతుందని అనుకున్నామని తెలిపారు. అలాంటి ఆమె తిరిగిరాలేని దూరాలకు వెళ్లిపోయిందనే వార్తను వినలేకపోతున్నామని, జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.సెట్లో ఉన్నప్పుడు ఆమె ఎంతో సరదాగా, గలగలా నవ్వుతూ ఉండేవారని ఆమె ముఖంలో తాను ఏనాడూ కోపాన్ని కాని, బాధను కానీ చూడలేదని మురళీమోహన్ అన్నారు. ఆమెకు అగ్రనటిననే గర్వం ఏమాత్రం లేదని చెప్పారు. శ్రీదేవి కళ్లు అద్భుతమని ఆ కళ్లతో ఆమె నవ్వగలదు, ఏడవగలదని... కళ్లతో అన్ని భావాలను పలికించిన గొప్ప నటి అని అన్నారు. ఆమె మరణ వార్తను యావత్ దేశం జీర్ణించుకోలేకపోతోందని చెప్పారు. తెల్లవారకముందే ఆమె మరణవార్తతో అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారని అన్నారు. అంతటి మహా మనిషి ఏ లోకంలో ఉన్నా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని చెప్పారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత శ్రీదేవిని ఎక్కువగా కలుసుకోలేదని మురళీమోహన్ తెలిపారు. ఒక మూడు, నాలుగు సార్లు సినిమా ఫంక్షన్లలోనే కలుసుకున్నామని చెప్పారు. గత నాలుగేళ్లుగా ఆమెను కలవలేకపోయానని తెలిపారు.

## హోదా ఇవ్వకుంటే ఏప్రిల్ 6న ఎంపీ పదవికి రాజీనామా

**ఎంపీ మిథున్‌రెడ్డి**

కడప, మేజర్‌న్యూస్‌: ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఏప్రిల్ 6న ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని వైఎస్ఆర్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. హోదా విషయంలో రాయలసీమ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడటం మంత్రి నక్కల హరిబాబు, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌కు తగదని వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హితవు పలికారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం



## ఆంధ్ర వాల్మీకి వాసుదాసు సుందరకాండ ఎందుకు చదవాలి?

# తన స్వప్న వృత్తాంతాన్ని తోటి రాక్షసులకు చెప్పిన త్రిజట



– వనం జ్వాలానరసింహారావు, హైదరాబాద్

సోమవారం పేజీకి ప్రత్యేకం

కల విషయం చెప్పి రాక్ష స్త్రీలను మందలించిన త్రిజట

ఆంధ్రవాల్మీకి వాసుదాసు సుందరకాండ ఎందుకు చదవాలి?


వనం జ్వాలా నరసింహారావు

తనకొచ్చిన కల విషయం చెప్పడంతోపాటు, రాక్షసస్త్రీలను మందలిస్తుంది కూడా త్రిజట ఇలా:

రాక్షసస్త్రీలారా లేచి చాటుగా పొండి. సీతాదేవిని తీసుకెళ్లటానికి ఇక్కడకు వచ్చిన రాముడు, భయంకరంగా రాక్షసులందర్నీ చంపుతున్నప్పుడు, తనభార్యను బాధించిన మిమ్ములనందరినీ కూడా చంపకుండా వూరుకోడు. తనమీద ప్రేమున్నదనీ, తన్నేనమ్మిందనీ, తనతో సంతోషంగా అడవులకు వచ్చిందీమె అనీ, భావించే రాముడు, సీతకొరకై రాక్షసులందర్నీ చంపుతాడు. అందువల్ల మీమాటలు చాలించండి. బెదిరింపు మాటలు మానండి. ఇంకా బెదిరిస్తే మన ప్రాణాలకు అపాయం వస్తుంది. ప్రాయశ్చిత్తంతో క్షమించమని సీతను వేడుకుందాం. నా కల నిజమైన కల. సీత తప్పక తనభర్తను చేరుతుంది. సీతాదేవిని మనంబెదిరించాం, అరిచం, నిర్బంధించాం కాబట్టి మనమీద ఆమెకు ఎందుకు దయవుంటుందని అనుకోవద్దు. రావణుడు చస్తే మనలను, అయ్యోపాపం అని, అపాయం నుండి రక్షించే వారెవరున్నారు? సీత ప్రణతి ప్రసన్న అంటే, నమస్కార ప్రియురాలు. మనమెన్ని తప్పులు చేసినా నిష్కల్మషమైన బుద్ధితో క్షమించ మని వేడుకుంటే, శాంతించి మనలను తప్పక కాపాడుతుంది. మనకు రానున్న ఉపద్రవం నుండి ఈమె తప్ప వేరు ఎవరూ రక్షించలేరు. కల సంగతటుంచి, ఈమెకు శాశ్వతంగా పతి వియోగముందని తెలిపే గుర్తులు ఈమె శరీరంపైన ఎక్కడాలేవు. భర్త ఈమెకు తప్పక దర్శనమిస్తాడు.

సీత దు:ఖాన్ని అనుభవించడానికి అర్హురాలుకాదు. ఈమె దివ్యసుఖాలను అనుభవిస్తుంది. ఈమెను బాధిస్తే మనకొచ్చిన లాభమేంటి? నేనుచెప్తున్న మాటలు అసత్యంకాదంటానికి ఆమెను ఓ మారు జాగ్రత్తగా చూడండి. పొడగైన తామరరేకుల్లాంటి ఆమె ఎడమకన్ను ఎట్లదురుతుందో చూడండి. అది ఆమెకు మేలుచేస్తుంది. ఈమె అనుకున్నట్లే భర్తను కలుస్తుంది. రావణుడు నాశనం అవుతాడు. రామచంద్రమూర్తి గెలువు ఖాయం అంటుంది.

(ఇదిచెప్తుంటే ఉన్నట్లుండి సీతాదేవి ఎడమచేయి వులకించి అదిరింది. ఎడమతొడా అదిరింది. అంటే రాముడు సమీపంలోనే వున్నాడని మంగళసూచిక. మొదట సీతమ్మ ఎడమకన్ను అదిరింది. వెంటనే ఎడమ భుజం అదిరింది. తరువాత ఎడమ తొడ అదిరింది. ఇవన్నీ త్రిజట చెప్పినప్పుడు ఆ రాక్షస స్త్రీలంతా చూసారు. నిజమేనని నమ్మక తప్పింది కాదు. పురుషులకు కుడివైపు భాగాలు శుభప్రదాలు. స్త్రీలకు ఎడమవైపు



భాగాలు మంగళప్రదాలు. అదరడం అంటే ప్రొద్దస్తమానం అదరడమని కాదు. క్షణకాలం పాటుకలిగే స్పందన అది. సీతమ్మకు ఎడమవైపు శరీర భాగాలు అదరడం శుభసూచకం. దాన్ని బలపరుస్తూ చెట్టుపైనున్న పక్షి కూయడం విశేషం).

కొమ్మలమీదున్న పక్షులు అమితమైన సంతోషంతో, ఓదార్పు మాటలు పల్కుతూ, శుభసూచకం ప్రేరేపిస్తూ సీతకు ధైర్యాన్ని కలిగిస్తున్నాయనీ, దీన్నిబట్టి సీతకు త్వరలోనే శుభం కలుగనున్నదనీ, కాబట్టి రాక్షసులు ఆమెను బాధించవద్దనీ అంటుందిత్రిజట. దూరంగా పొమ్మనీ, ఆమెను నిర్భయంగా వుండనీయమనీ అనగానే, రాక్షసస్త్రీలంతా, త్రిజట చెప్పినట్లే సీతాదేవి శరణుజొచ్చారు. రక్షిస్తానని సీత వారికి అభయమిస్తుంది.

(త్రిజట విభీషణుడి కూతురని కొందరు, కాదని మరి కొందరు అంటారు. ఆమె సీతాపక్షపాతి, అభిమానం వున్నామె. కలంతా కల్పితమనుకున్నా, కోతివచ్చే విషయమ, లంక కాల్చే విషయం వూహించని విషయమేకదా! అంటే స్వప్నమంతా కల్పితం కాకపోవచ్చు. శూన్యవాదులు, మాయావాదులు, నాస్తికులు, స్వప్నాలు అసత్యమంటారు. రామాయణంలో మూడు స్వప్నాలున్నాయి. దశరథ స్వప్నం, భరత స్వప్నం, త్రిజట స్వప్నం. మూడూ నిజమయ్యాయి. ఆరోగ్యవంతులై నిర్మలమైన మనస్సున్న వారు కన్న కలలు నిజమవుతాయి. అనుభవంలో నేటికీ ఎన్నో స్వప్నాలు నిజమైన దాఖలాలున్నాయి.

పురుషుడికి(జీవాత్మకు) రెండు స్థానాలే వున్నాయి. ఇహలోకం, పరలోకం. మూడోది స్వప్నమనే తృతీయ స్థానం. అది ఇహ–పరలోకాల సంధిస్థానం. ఆ సంధి స్థానం నుండి ఇహ–పరలోకాలను రెండింటినీ చూస్తున్నాడు. పొలిమేర నుండి రెండువైపులా వున్న గ్రామాలను చూసినట్లే ఇదికూడా. భగవంతుడే నిద్రవుచ్చుతూ, మేల్కొన్నప్పుడున్న ఇంద్రియాలను తానే గ్రహించి, బాహ్యేంద్రియాలను విస్తరించి, స్వప్నాలను వాడి, వాడి అదృష్టం ప్రకారం సృష్టించి, కొంతసేపు వాడనుభవించేటట్లు చేస్తాడు. స్వప్నంలో కనిపించేవన్నీ సృష్టించబడినవే. అక్కడ రథాలు లేవు, గుర్రాలు లేవు, రథం పోయే దారీ లేదు, గుంటలూలేవు, పుష్కరిణులూ లేవు, నదులూ లేవు. ఏమీలేవు. అన్నీ సృష్టించబడినవే. ఆ సృష్టికర్త భగవంతుడే.

జీవుడు చేసిన పుణ్య–పాపాలను అనుభవించేందుకై, భగవంతుడే దానికి కావాల్సిన విషయాలను అప్పటికప్పుడే సృష్టిస్తాడు. కాబట్టి స్వప్నాల్లో చూసినవన్నీ అసత్యం కాదు. రెండుగ్రామాలు సత్యమైతే, నడుమనున్న పొలిమేర ఎట్లా అబద్ధమవుతుంది? కలల్లో సాధారణంగా అప్రియాలు కనబడవంటారు. ఎవడూ అప్రియాలను కోరుకోడుకదా! స్వప్న సృష్టికర్త భగవంతుడే. మొదటిజాములో వచ్చిన కల సంవత్సరానికి ఫలిస్తుందనీ, రెండోజామున వస్తే ఎనిమిదినెలలకనీ, మూడోజామున వస్తే మూడునెలలకనీ, నాలుగోజామున వస్తే నెలకేననీ, అరుణోదయ వేళవస్తే పది దినాలకనీ, సూర్యోదయాన వస్తే మూడురోజుల్లోనే ఫలిస్తుందనీ అంటారు. ఆవులు పితికే వేళ వస్తే వెంటనే ఫలిస్తుందట. ఏ కల ఏ జాములో వస్తే ఎన్నాళ్లకు ఫలిస్తుంది అన్న విషయాన్ని అటుంచితే, స్వప్నాలు యదార్థమౌతాయనడం శాస్త్ర సమ్మతం. అయోధ్యలో దశరథుడి స్వప్నం, మాతామహుల ఇంట్లో వుండగా భరతుడికి వచ్చిన స్వప్నం, లంకలో త్రిజటకు వచ్చిన స్వప్నం, వెరసి మూడూ ఫలించాయి కద! వాల్మీకి అద్భుత రచనా వైచిత్రి ఇక్కడ గమనార్హం. త్రిజట తన స్వప్నాన్ని వివరించిన విధం రాక్షస స్త్రీలకు హడలెత్తించగా, శింశుపా వృక్షంపై చక్కగా కూర్చొని ఇదంతా వింటున్న హనుమంతుడికి ఇక చేయవలసిన పని ఏదో అందంగా సూచించినట్లయింది.)

## సహజ సౌందర్యానికి అక్షర నీరాజనం



## చిరునవ్వుల మోవి

శ్రీదేవి ...
చిరునవ్వు చెరగని మోవి
చిలిపి కళ్ళతో బాక్సాఫీస్ కొల్లగొట్టే
మాయావి
వెండి తెర కి అబ్బిన నెత్తావి
తానే ఓ సౌందర్యపు పగడాల దీవి
తెలుగు,తమిళ, హిందీ మూవీ..
మూడు దశాబ్దాలుగా,
ఆమె శాసించిన రాజ్యాలైనాయి.

పురుషాధిక్యత పురివిప్పి
నర్తించునచట.
తాత వయసు హీరోలు,
లేత వయసు నాయికలతో
నటియించునకటా!
హీరోయిన్ పాత్ర కేవలం మూడేళ్ళ
ముచ్చట.
అచ్చట తొడగొట్టి నిలిచేనొక తారక
తండ్రీకొడుకుల సరసన రాణించిన
నాయిక.
ఆమె అందాల శ్రీదేవి గాక,
మరెవరూ కాదిక
చలనచిత్ర రంగానికి,
తిరుగులేని ఏలిక.

దేవీ భావ్యమా, శ్రీదేవీ భావ్యమా!
భువిని వీడి హఠాత్తుగా దివి ని
చేరుట భావ్యమా,
ఓ సౌందర్య కావ్యమా! ఇది
భావ్యమా.

–డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

## ఖగోళంలో కోకిల

ఎవరైతేనేమి
ఆ రుధిరాన్ని కోసేసి...
ప్రాణాన్ని మింగడమే
నా వృత్తి...

ముఖారవిందంలోని
రెండు నల్లటి నయన పక్షులు
విశ్వవిహారం చేసి వీక్షించిననేమి
వాటి రెక్కలు తుంచి
ఖగోళంలో విసిరేయడమే
నా లక్ష్యం...

శబ్దాలతో ప్రతిధ్వనించిన
ఆ కుహరములను
నిశ్శబ్ద మట్టికి అతికించడమే
నా కర్తవ్యం...

మనసులను చుంబించిన
జత ఎర్రటి పెదవుల శిఖరాలను
జాబిల్లిలో ఇమిడ్చాను
వెన్నెల పాలతో
విశ్వాభిషేకం చేస్తుందిలే...

దేహమంతా కిరణాలను
పూసుకున్న ఆ శ్రీదేవిని
నేడు భూదేవిలోకి
జారవిడుస్తున్న...
ఎందుకంటే?
భూదేవి అందవిహీనమౌతోంది
ఆ శరీరం నుండి కాసిన్ని కిరణాలను
పూసుకుంటుందట...

తాను గుర్తొస్తే
మీ మనోనేత్రాలతో
భూమిని...
ఆత్మీయ ఆలింగనం చేసుకోండి...

అఖిలాశ,
7259511956

## ముద్దు బిడ్డలం




ఓ భూమాత
మీముద్దు బిడ్డలం మేము
ఎందుకు మాత మాకిన్ని భాషలు
అటు వెళ్ళగానే కనడ
ఇటు వైపు వెళ్తే తమిళం
మరోవైపు మళయాళం
తూరుపు దిక్కు ఒరియా
ఉత్తరాన హిందీ
దేశ ఎల్లలు దాటితే
ఇంకా ఎన్నో

పరాయి భాష అంటున్న
ఆంగ్లం కొంత మెరుగు
అందరిని కలిపేను
మాతృభాష దినోత్సవం
జరుపున్న తరుణంలో
నాలో జనించిన ప్రశ్న ఇది
పొట్టకూటికి ఆదేశం ఈ దేశం

ఏ దేశం వెళ్ళినా
మా మాత భూమాత
ఒకే రంగు ఒకే రూపం
మరి పెదవి విప్పితే
తెలుస్తోంది తేడా
ఆతేడ తెస్తుంది తంటా
అందుకే మాతృభాష దినోత్సవం
జరుపుకుందాం సంతోషంగా

పరభాషకు పలుకుతాం జేజేలు
అది వారికి మాతృభాష కదా
వెరసి పెదవి విప్పి పలికే
ప్రతి పదమూ భాషే
ఆ భాషకు నీరాజనం
అదే పశుపక్ష్యాదులకు లేనిది
మానవులకు ఉన్నది

డా. విడి రాజగోపాల్

## తొలిరేయి ధూపం



అరవిరిసిన పూల మొగ్గలు
శయ్యపై పవళించి
నునుసిగ్గుల వలపు చూపులు
బిత్తరతో పయనించి
తన శ్రీవారి వేడి సెగలు
నిలువెల్లా తగలగానే
కంగారుతో తడబడి
మగని చూపులతో కలబడి
జారుకోలేక అక్కడే చిక్కుబడి
మధురావేశంతో ముడిపడి
పెదవులపైకి నవ్వు జొరబడి
మనసంతా సంతోషం నింపబడి
తెలియని ధైర్యం ఏదో..
ముందుకు తీయబడి
కౌగిలి సామ్రాజ్యంలో
ఖైదీలుగా పట్టుబడి
కొత్తదనం ఇప్పుడిప్పుడే పాతబడి
ఒకరిపైన ఒకరు మనసుపడి
కాదనలేని మొహమాటం
ఏదో ఎదుటపడి
వద్దన్న మాట ఎక్కడో మూలపడి
వలపు కెరటాలతో పోటీపడి
ఓడి గెలవడం లోనే ఆనందపడి
అవస్థలు పడుతున్న
కొత్త దంపతులను చూసిన
తొలిరేయి ధూపం
మనసారా నవ్వింది..
గదినిండా నిండింది..

గంజాం భ్రమరాంబ, తిరుపతి
9949932918

## పొద్దున్నే



తన కలల దుప్పటి తీసానా
దోసెడు నవ్వుల పువ్వుల్ని
నా ముఖం పై ఫెడిల్లుమని
విసురుతుంది.

బ్రష్ పై
పేస్టు పెట్టిస్తానా
ఆవులిస్తూ టీవీ ముందు కూర్చొని
డోరేమాన్ కు గుడ్ మార్నింగ్
చెవుతుంది.

తల్లి కోప్పడిందా
నిన్న సాయంత్రం తెచ్చుకున్న
చాక్లెట్లకై మారాం చేస్తుంది.
సముదాయించాలంటే పరగడుపునే
స్వీట్లు చప్పరిస్తూ శాంతి
పడుతుంది.


పంచదార చిలక ల్లాంటి రెండు
ముద్దుల్ని
గులాబి రెక్కల్లాంటి
కొంత నవ్వును
నా జేబులో వేసి స్కూ
లుకు బయలుదేరు తుంది.
సరిగ్గా అవుడే
చూస్తాను
ప్రతి ఉదయం
సీతాకోక చిలుక
యూనిఫాం వేసుకో
వడం
టక్కు టై షూ వేసుకోవడం
తూనీగ రెక్కలతో తుర్రున ఉడాయి
స్తుంది.

సాయంత్రం
హోం వర్కులో తను టీచర్ అయితే
నేను స్టూడెంట్ నవుతాను.
తన చిట్టి బొమ్మలకు
నేను వళ్ళంతా పులుముకున్న
రంగుల క్రేయాన్స్ బాక్స్ నవుతాను.

నా గుండె కొమ్మపై తూనీగలా
వాలినవుడు
నేను వెన్నెల పరుచుకున్న
ఆకాశంలా మారిపోతాను.

– గరికపాటి మణీందర్
99483 26270

## కవితా సంపుటి ఆవిష్కరణ




రవూఫ్ కవితా సంపుటి నది కాలం అతడు ఆవిష్కరణ సభ మార్చి 4వ తేదీ ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ బాగ్లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరి స్తారు. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షత వహిస్తారు. వాడ్రేవు చినవీరభద్రుడు, గుంటూరు లక్ష్మీనరసయ్య, శిఖామణి, శిలాలోలిత, కవి యాకూబ్ ప్రసంగిస్తారు.

## భగ్నలిపి



కువ కువలాడుతున్న ఆశల పరిమళం
క్షామధర్మాన్ని ఒలకబోసుకుంటున్నప్పుడు
ఎండిన మెతుకుల ఎంగిలిస్పర్శ
ఎడారిముఖాలకు వేలాడుతున్నప్పుడు
ఎన్ని స్టెరాయిడ్లిచ్చినా
ఎండుగొడ్డుకి పాలురావు

కాలం నది ఒడ్డున పేర్చిన
కలల పొదరింటిముందు
అనుభవాల కళ్ళాపి దుర్గంధమైనప్పుడు
పరిత్యాగాల పవిత్ర విత్తనాలు
చల్లినంతమాత్రాన
సుగంధాలు గ్రంధస్తంకావు

పేలుతున్న నిశ్శబ్దశబ్దాల నడుమ
మౌనరాగం మనసును దహిస్తున్నప్పుడు
మరోఆకృతి అవతరించే అవకాశం లేకపోలేదు
అదే జరిగితే
ఆ రూపానికి పేరు వెతకడానికి
ఎన్నిజన్మలు పునీతమవ్వాలో

దుఃఖిత సందర్భాల చివరి అంచుమీద
గాయపడిన కోకిలగానంలో
గమకాలు వెతకడమేగాని నరకాల మాటేమిటి
యాతనంటే ఎవరికైనా యాతనే
శోధనంటే దేనికైనా శోధనే

పగిలిన భావోద్వేగాల పెంకులు పేర్చుకుంటూ
బాధాక్షరాల భగ్నలిపి తయారౌతుంది
కలతపడని మనసేదన్నా వుంటే చెప్పండి
కొత్త వ్యాకరణాన్ని రచిద్దాం.

బంగారాజు కంఠ : 8500350464

## వృద్ధాప్యం



ఆ బుర్రలోని జ్ఞాపకాలు
అనుభవాల గ్రంథాలు

ఆ కళ్లలోని చిత్రాలు
దయార్ద్ర రూపికలు

ఆ చేతుల స్పర్శలు
లాలింపుల పార్శ్వాలు

ఆ హృదయపు లయలు
ఆత్మస్థైర్య నాదాలు

ఆ అడుగుల జాడలు
భావితరవు దివిటీలు

ఆ కంఠ స్వరాలు
నిర్దేశకవు బాకాలు

ఆ శ్రవణ ద్వంద్వాలు
మంచిచెడుల వడపోతలు
ఆ జిహ్వ మొగ్గలు
షడషోపేత సూచనలు

ఆ భుజస్కంధాలు
కష్టసుఖాల కావడికుండలు

వారి చర్య,ప్రతిచర్యలు
అభ్యసనపూర్వక పాఠాలు

ఆ ముడతల దేహం
జీవన సాఫల్య సంకేతం

వృద్ధాప్యం
భావితరాల
ఘన పయనానికి
లక్ష్యనిర్దేశిక శిఖరం

డా.పెంకి విజయ కుమార్
9553392949

## తెలంగాణ రాష్ట్రస్థాయిలో కవితల పోటీలు

ఉగాది పర్వదినం మా సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రస్థాయిలో కవితల పోటీలు నిర్వహిస్తున్నాము. ఈ పోటీలలో మా తెలంగాణ పల్లె ఇతివృత్తంగా కవితలు రాసి పంప గలరు. తెలంగాణ పల్లె అంశంపై 20 లైన్లకు మించని వచన కవితలను ఆహ్వానిస్తున్నాము. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న కవితల పోటీకి భిన్నంగా ఈసారి మాకు వచ్చిన కవితల్లో ఉత్తమ మైన కవితల్లో ఐదు కవితలను ఎంపిక చేసి సమాన బహుమతులు అందజేస్తాము. కవిత తమ స్వంతమనే హామీ పత్రంతో పాటు, పాస్‌పోర్ట్ పోటో జతచేసి ఏ4 పేపరుకు ఒకవైపు మాత్రమే రాసికానీ, డిటిపి చేసి కానీ పంపవచ్చు. కవిత పంపేవారు. విజేతల వివరాలను పత్రిక, మొబైల్ ద్వారా తెలియజేస్తాము. విజేతలకు సంస్థ సిల్వర్జూబ్లీ ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తాం. కవితలు మాకు చేరాల్సిన చివరితేది మార్చి–10. పోటీల నిర్వహణలో తుది నిర్ణయం నిర్వహకులదే.

**కవితలు పంపాల్సిన చిరునామా**
**కట్కూరి శంకర్,11-2-495,హనుమాన్‌నగర్,**
**యైటింక్లయిన్‌కాలనీ,గోదావరిఖని, రామగుండంమండలం**

## దేవుడు వైద్యులు



వైద్యవృత్తి దైవంతో సమానమట
రోగుల పాలిట వైద్యుడేదేముడట
వైద్యానికి మాయరోగంవచ్చెనట
చేసిన ప్రమాణాలన్నీ గాల్లో కలిసెనట.

రోగాల భక్షణ కోసం మందులట
రోగుల రక్షణ కోసం వైద్యులట
జబ్బుల ముంగిట ఔషధరాశులట
నాసిరకం మందులన్ని తెగ వాసికెక్కెనట

పక్షిలా గాల్లో ఎగురుతాడట
చేపలా నీటిలో ఈదుతాడట
నేలపై మనిషిలా బతకటం రాదట
సమాజానికి మార్గదర్శి ఔతాడట.


అవినీతికి వారే అడ్డుకట్టలట
లంచాలపై ఉక్కుపాదం మోపేరట

వాటాలు తేల్చండంటూగలాటాలట
నిక్కచ్చితో కూడిన రిక్వైర్ మెంట్లట

డైలీ వాకింగ్ లే చేతులపై
డైటింగ్ లే లక్ష్యా లట

డైరీ మిల్కులే నములునట
బేరియాట్రిక్ సిటీకికి పోదురట.

సోంపాక సీత;
భద్రాచలం. సెల్:7702436964.




# రానున్న ఆండ్రాయిడ్ ఓరియో గో ఎడిషన్

న్యూఢిల్లీ : సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ గూగుల్ తక్కువ ఖరీదైన, 512 ఎంబి నుంచి 1జిబి ర్యామ్ మాత్రమే ఉండే ఆండ్రాయిడ్ ఫోన్ల కోసం ఆండ్రాయిడ్ గో ఓఎస్‌ను విడుదల చేస్తామని గత ఏడాది ప్రకటి ంచిన విషయం విదితమే. కాగా చెప్పిన మేరకు గూగుల్ సదరు ఆపరేటింగ్ సిస్టమ్‌ను విడుదల చేయనుంది. గూగుల్‌కు చెందిన నూతన ఆపరే టింగ్ సిస్టమ్ ఆండ్రాయిడ్ ఓరియో 8.0కు గాను గో ఎడిషన్‌ను గూగుల్ విడుదల చేయనున్నది. బార్సిలోనాలో జరగనున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండబ్ల్యు) 2018 ప్రదర్శనలో గూగుల్ ఆండ్రా యిడ్ ఓరియో 8.0 గో ఎడిషన్‌ను లాంచ్ చేయ నున్నది. మరి 24 గంటల్లో ఎండబ్ల్యుసి 2018 ప్రదర్శన ప్రారంభం కానున్న నేప థ్యంలో అందరూ ఈ కొత్త ఓఎస్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఓరియో 8.0 గో ఎడిషన్ ఫోన్ల ధర రూ. 3250 మాత్రమే కాగా, ఆండ్రాయిడ్ ఓరి యో 8.0 గో ఎడిషన్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్న స్మార్ట్ ఫోన్ల ధరలు కేవలం రూ. 3250 ఉండే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ ఫోన్లలో గూగుల్‌కు చెందిన లైట్ వెయిట్ యాప్స్ అయిన గూగుల్ గో, గూగుల్ మ్యాప్స్ గో, జిమెయిల్ గో, యూట్యూబ్ గో, అసిస్టెంట్ గో, ఫైల్స్ గో, జిబోర్డ్ గోలు ఇన్‌బిల్ట్‌గా వస్తాయి. ఇక ఈ ఫోన్లలో 512 ఎంబి నుంచి 1 జిబి వరకు మాత్రమే ర్యామ్ ఉంటుంది. 8 జిబి ఇంటర్నల్ స్టోరేజ్ ఉం టుంది. ఆండ్రాయిడ్ 8.0 ఓరియో గో ఎడిషన్ కలిగిన ఫోన్లు అతి త్వరలో మార్కె ట్‌లోకి రానుండగా వాటిల్లో నోకియా 1 కూడా ఉండనున్నట్లు తెలి సింది. అత్యంత తక్కువ ధరతో, ఆకర్షణీయమైన ఫీచర్లతో దీన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం.

# హైపర్ లూప్‌ను ప్రవేశపెట్టాలనుకుంటున్నాం

- రైల్వే మంత్రి పీయూష్ గోయెల్
- ఈ టెక్నాలజీని సొంతం చేసుకునే అపురూప అవకాశం
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రైల్వే
- అర్హతలు కలిగిన వారికే రుణాలు

న్యూఢిల్లీ : దేశంలో మరో సరికొత్త రవాణా వ్యవస్థకు బీజం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు రైల్వే, బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయెల్ మాటలే నిదర్శనం. 'దేశంలో చివరి ఆవిష్కరణ 40 ఏళ్ల క్రితం రాజధాని రైలును ప్రవేశపెట్టినప్పుడు జరిగింది. బుల్లెట్ రైలు ఒక టెక్నాలజీ ప్రవేశం మాత్రమే. ఇప్పుడు హైపర్ లూప్‌ను ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నాం. ఈ టెక్నాలజీని అక్కున చేర్చుకునే అపురూప అవకాశం భారత్‌కు ఉంది. ఈ తరహా టెక్నాలజీలకు భారత్ కేంద్రం కాగలదు' అని ఎకనమిక్ టైమ్స్ ప్రపంచ వ్యాపార సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. హైపర్ లూప్ అనేది భూ ఉపరితలంపైనే పైపు లోపల వేగంగా తీసుకువెళ్లే రవాణా టెక్నాలజీ. 100 ఏళ్ల రైల్వేను ఆధునికంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి చెప్పారు. రుణాల జారీ వృద్ధి తగ్గడానికి కారణం, సరైన అర్హతలు లేని వ్యాపార సంస్థలకు రుణాలు ఇవ్వకపోవడం వల్లేనని మంత్రి చెప్పారు. యుపిఎ హయాంలో ఇష్టారీతిన ఎవరికి పడితే వారికి రుణాలు ఇచ్చారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత కలిగిన వారికే ఇస్తున్నామని గోయెల్ చెప్పారు.



# రెండు డజన్ల ఐపిఒలు సిద్ధం




న్యూఢిల్లీ : భారత స్టాక్ మార్కెట్లు భారీ ఊగిసలాట మధ్య ట్రేడ్ అవుతున్నా పెట్టుబడి దారులకు నమ్మకం ఏమాత్రం సడలలేదు. అందుకే దాదాపు రెండు డజన్ల కంపెనీలు వ్యాపార విస్తరణకు సిద్ధమైపో యాయి. దీనికి వారు ఐపిఒనే సరైన మార్గంగా ఎంచుకున్నారు. ఈ ఐపిఒల మొత్తం విలువ రూ. 25 వేల కోట్లకు పైమాటే. మూల ధనం పెంచుకోవడానికి, వ్యాపార విస్తరణకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు ఆ కంపెనీలు సెబీకి అందజేసిన సమాచారాన్ని బట్టి అర్థమవుతోంది. పబ్లిక్ ఆఫర్లకు వస్తున్న కంపెనీల్లో హిందూస్థాన్ ఏరోనాటిక్స్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్ వంటి సంస్థలు ఉన్నాయి.

లిక్విడిటీ కోసం...

ప్రస్తుతం ఐపిఒకు వస్తున్న కంపెనీలు మరొక ముఖ్య విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నాయి. ప్రస్తుతం ఉన్న షేర్‌హోల్డర్లకు లిక్విడిటీ పెరిగే విధంగా వాటాలను స్టాక్ మార్కెట్లలో అవి నమోదు చేస్తున్నాయి. దీనితో పాటు బ్రాండ్ విలువను మరింత పెంచేదుకు ఈ చర్య దోహదపడవచ్చని అవి భావిస్తున్నాయి. వాటిలో ప్రభుత్వ రంగ కంపెనీలు కూడా ఉన్నాయి. ఇప్పటికే బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీస్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఐఆర్ఇడిఎ వంటి సంస్థలకు ఇప్పటికే సెబీ లైన్ క్లియర్ చేసింది. మిగిలిన 20 కంపెనీలకు సంబంధించి కొన్ని అనుమతులు రావలసి ఉంది. అనుమతుల కోసం ఎదురు చూస్తున్న కంపెనీల్లో ఆర్ఐటిఇఎస్, మిధాని, బంధన్ బ్యాంక్, ఇండోస్టార్, నజారా టెక్నాలజీస్, రూత్ మొబైల్ వంటి సంస్థలు ఉన్నాయి. ఇప్పటికే సెకండరీ మార్కెట్‌లో వాటికి అత్యధిక విలువ లభించడంతో ఐపిఒకు మొగ్గు చూపుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే న్యూజెన్ టెక్నాలజీస్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా సంస్థలు మార్కెట్‌లోకి వచ్చాయి. 2017లో మొత్తం 36 కంపెనీలు రూ. 67 వేల కోట్లను సమీకరించాయి.

# హువావే నుంచి ఎంజాయ్ 8 స్మార్ట్ ఫోన్




న్యూఢిల్లీ : హువావే తన కొత్త స్మార్ట్ ఫోన్ 'ఎంజాయ్ 8'ని త్వరలో విడుదల చేయనున్నది. దీని ధర వివరాలను సంస్థ ఇంకా వెల్లడించలేదు. హువావే ఎంజాయ్ 8 విశిష్టతలు : 5.99 అంగుళాల హెచ్‌డి ప్లస్ ఫుల్ వ్యూ 2.5డి కర్వ్‌డ్ గ్లాస్ డిస్‌ప్లే, 1440/720 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, 1.8 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్, 3/4 జిబి ర్యామ్, 32/64 జిబి స్టోరేజ్, 256 జిబి ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, డ్యుయల్ సిమ్, 13, 2 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 8 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జి వీవోఎల్‌టిఇ, బ్లూటూత్ 4.2, 2900 ఎంఎహెచ్ బ్యాటరీ.

# హనుమాన్ ఆలయాన్ని నిర్మించిన ముస్లిం సోదరుడు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన మొయిన్ మెమోన్ ఆంజనేయస్వామి భక్తుడు. ఈకారణంగానే ఆయన స్వస్థలమైన మిర్జాపూర్ లో 500ఏళ్లనాటి హనుమాన్ ఆలయాన్ని పునరుద్ధరించారు. రెండు వారాల్లో ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేనెంతో అదృష్టం చేసుకొని ఉంటే గానీ నాకు హనుమాన్ ఆలయం పునరుద్ధరించే అవకాశం దక్కలేదు. ఇది నాకు హనుమాన్‌జీ ఇచ్చిన వరంలా భావిస్తాను. హనుమాన్ భక్తులందరికీ నా తరవు నుంచి నేనిచ్చే కానుక ఇది అని అన్నారు. మత ఛాందస భావాలతో అట్టుడికి పోతున్న ప్రస్తుత సమాజంలో ఇలాంటి వారు కూడా ఉన్నారనేది ఉపశమనం కలిగించే విషయమే.


# ఏప్రిల్ నుంచి ఇ-వే బిల్లుల అమలు

- 50 వేలకు మించే సరకు రవాణాకు తప్పనిసరి
- తొలి దశలో అంతర్‌రాష్ట్ర వాహనాలకు వర్తింపు




న్యూఢిల్లీ : వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అమలులోకి వచ్చి ఆరు మాసాలు దాటినా ఇ-వే బిల్లుల వ్యవస్థ ఏర్పాటు ఇంకా బాలారిష్టాలను దాటలేదు. ఈ నెల ఒకటవ తేదీ నుంచే ఇ-వే బిల్లులు తప్పనిసరి అని ప్రకటించిన కేంద్రం సాంకేతికపరమైన వనరుల లేమి, వెబ్‌సైట్ నిర్వహణలో లోపాలతో ఆ నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. తాజాగా ఏప్రిల్ 1 నుంచి ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ఈ సమావేశంలోని ముఖ్యాంశాలను ఉప సంఘం కన్వీనర్, బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ మీడియాకు తెలియజేశారు. మార్చి 10న మంత్రివర్గ ఉప సంఘంతో జిఎస్‌టి కౌన్సిల్ భేటీ కానున్నదని, ఆ తరువాత అమలు తీరు, రిటర్న్ క్లెయిమ్‌పై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. ఇ-వే బిల్లులతో సరకుల వాహనాల గమనాన్ని గుర్తించవచ్చు. దీని ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. పన్ను ఎగవేతదారులకు కళ్లెం పడుతుంది. ఈ వ్యవస్థ అమలుకు సంబంధించి వనరుల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. డిమాండ్‌కు తగ్గ వేగాన్ని ఇ-వే బిల్ వెబ్‌సైట్ అందుకోవడం లేదు. ఈ కారణంగా ఈ నెల 1 నుంచి ఈ వ్యవస్థ అమలులోకి రాలేదు. వెబ్‌సైట్ లోపాలను ఎన్ఐసి సిబ్బంది సవరిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు వెబ్‌సైట్‌పై పడే భారానికి సంబంధించి పరీక్షలు జరిపారు. మూడవ పరీక్ష త్వరలో జరుగనుంది అని సుశీల్ మోడీ తెలిపారు. ఈ వ్యవస్థ అమలులోకి వస్తే కేంద్రానికి రోజుకు రూ. 26 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నామని సుశీల్ మోడీ చెబుతూ, భవిష్యత్‌లో ఇది రూ. 75 లక్షలకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్థిక నగరాలకు సన్నాహాలు



- శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు సర్కారు చొరవ
- ఇప్పటికే ప్రారంభమైన కార్యాచరణ
- పెట్టుబడుల సదస్సులో మరింత ఫలితం

(విశాఖపట్నం నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : కార్మికులు పనిచేసేచోటే నివాసాలకు ప్రాధాన్యం ఇస్తే ఎక్కువ ఉత్పాదకతకు అవకాశం ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం శాటిలైట్ టౌన్‌షిప్, ఆర్థిక నగరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. వీటిని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే విశాఖలోని లంకెలపాలెం సమీపంలోని పరవాడ, సబ్బవరం, గాజువాక మండలాల పరిధిలోని 900 ఎకరాల్లో శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. ఈ బాధ్యతలు విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (ఉడా) పర్యవేక్షించనుంది. ఇక్కడ కొంత భాగంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇళ్లను కేటాయిస్తారు. విశాఖనగరంలో 25 ఎకరాల్లో ఇదే జిల్లాలోని అచ్యుతాపురం పారిశ్రామికవాడ ప్రాంతంలో 198 ఎకరాల్లో ఆర్థిక నగరాల నిర్మాణానికి ప్రతిపాదించారు.


ఇదే తరహాలో కృష్ణా, కర్నూలుతోపాటు గుంటూరు జిల్లా మంగళగిరి, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో ఏర్పాటుకు ప్రణాళికలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 980 ఎకరాల్లో ఆరు ఆర్థిక నగరాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతుంటే కృష్ణాజిల్లా జక్కంపూడిలోని 234 ఎకరాల్లో ఇప్పటికే చర్యలు మొదలయ్యాయి. వీటి ఏర్పాటు ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య, తరహాల పారిశ్రామిక (ఎంఎస్ఎంఈ) రంగంలో రూ. 22,280 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 1.61 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి దక్కుతుందని భావిస్తున్నారు. పారిశ్రామికవాడలు, కారిడార్ల ఏర్పాటు, అందుకు అనువుగా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం 13 జిల్లాల సమగ్రాభివృద్ధికి విస్పష్ట ప్రణాళికతో ముందుకెళ్తోంది. రాష్ట్రంలో సుస్థిర ఆర్థికాభివృద్ధికి అవసరమైన పరిశ్రమల ఏర్పాటుకు సర్కారు నిర్దేశించుకున్న పారిశ్రామిక రంగ మిషన్‌లో ఇవన్నీ అంతర్భాగంగా ఉన్నాయి. విద్యుత్తు, వ్యవసాయం, ఆహార శుద్ధి, మౌలిక వసతులు, తయారీరంగం, పెట్రో కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్ రంగాలలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించడమే ఈ మిషన్ లక్ష్యం. ప్రభుత్వం విశాఖ వేదికగా నిర్వహిస్తున్న ఉషోదయాంధ్రప్రదేశ్ పెట్టుబడుల సదస్సులో వీటి ఆలంబనతో సానుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు విశ్వసిస్తున్నారు.

విశాఖ సదస్సులో ఈ-స్పైస్ బజార్..

విశాఖ భాగస్వామ్య సదస్సులో ఈ-స్పైస్ బజార్‌ను కేంద్రమంత్రి సురేష్ ప్రభు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుగంధ ద్రవ్యాల సంస్థ ఛైర్మన్ జయతిలక్ ఆదివారం ప్రారంభించారు. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార, సాంకేతిక పరిజ్ఞాన శాఖ(డైటీ), సుగంధ ద్రవ్యాల సంస్థ సంయుక్త నిర్వహణలో దీన్ని రూపొందించినట్లు ఆ సంస్థ ఉపసంచాలకుడు శ్రీకాంతన్ థంపి తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు, ఆన్‌లైన్ వేదికగా దేశీయ విపణిలో ఎక్కడైనా పంటను అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్పైస్ బజార్‌ను రూపొం దించింది. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలం గాణ రాష్ట్రాల్లో మిరప, పసుపు రైతులకు ఆన్‌లైన్ వాణిజ్య వేదికగా ఈ-స్పైస్ బజార్ పనిచేస్తుంది.

# డబ్బులు ఏవి బాబూ!

- ఏపీలో నోట్ల కష్టాలు మరింత తీవ్రతరం
- 80 శాతం మూత పడ్డ ఏటీఎంలు
- బ్యాంకుల్లో నగదు ఇవ్వక నిలదీస్తున్న ఖాతాదారులు
- ప్రజలకు గుర్తొస్తున్న నోట్ల రద్దు రోజులు
- ఎఫ్‌ఆర్‌డీఏ బిల్లుతో తగ్గిన నమ్మకం



(అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్రంలో కరెన్సీకి కరువొచ్చింది. డబ్బుల కోసం ఖాతాదారులు ఏటీఎంల వెంట తిరగాల్సి వస్తోంది. ఏటీఎం అంటే ఎనీటైమ్ మనీ లాంటిది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడ కావాలంటే అక్కడ డబ్బు తీసుకోవచ్చు. చేతిలో ఏటీఎం కార్డు ఉంటే అదో భరోసా. ఇదంతా ఒకప్పటి మాట. రాష్ట్రంలో కరెన్సీ కష్టాలు తీవ్రమయ్యాయి. దీంతో ఇప్పుడు ఏటీఎం అంటే ఎనీ టైమ్ మూత అనే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో దాదావు 80 శాతం ఏటీఎంలు పనిచేయడం లేదు. ఎప్పుడు చూసినా షట్టర్లు మూసే ఉంటున్నాయి. తెరచి ఉన్న కొద్ది ఏటీఎంల్లో కూడా నగదు ఉండడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఉన్నాయని వెతుక్కుంటూ వెళితే అక్కడ రూ. 10-20వేలు వస్తే గొప్ప. ఇంత కష్టం ఎందుకని బ్యాంకుకు వెళితే.. అక్కడా అదే పరిస్థితి. రూ. 30-40వేలు అడిగితే ఐదు, పదివేలు ఇచ్చి చేతులెత్తేస్తున్నారు. లక్షకుపైగా అడిగితే కావాలంటే డిజిటల్ బదిలీ చేస్తాం తప్ప నగదు ఇవ్వలేమని తెగేసి చెబుతున్నారు. ఈ కరెన్సీ కష్టాలతో జనాలకు చిరాకొచ్చేసింది. చాలా అవసరం. మా డబ్బే కదా ఎందుకివ్వరు? అని గట్టిగా ప్రశ్నించినా, గొడవపడినా మేమేం చేయలేమన్న సమాధానమే వినిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కరెన్సీకి కరువొచ్చింది. నగదు కొరత తీవ్ర రూపం దాల్చింది. పైగా నెలాఖరు వచ్చేసింది. నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవు. ఆపై రెండురోజులుంటే పింఛన్లు, ఉద్యోగుల జీతాలు చెల్లించాల్సిన పరిస్థితి. వీటికి సుమారు రూ. 10 వేల కోట్లపైనే కావాలి. కానీ బ్యాంకుల్లోనేమో నగదు లేదు. దీంతో పెద్దనోట్ల రద్దు సమయంలో ఎదురైన పరిస్థితులే పునరావృతమవుతాయేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వు బ్యాంకు నుంచి జిల్లాల్లోని బ్యాంకుల చెస్ట్‌లకు నగదు అంతంతమాత్రంగానే వస్తోంది. దీంతో చెస్ట్‌లు కూడా పరిమితంగానే డబ్బును బ్యాంకులకు అందిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అదే పరిస్థితి. ఒక జిల్లాలో రూ. 500 కోట్లు చెస్ట్‌ను బ్యాంకులు అడిగితే అందులో 20 శాతం మాత్రమే ఇస్తున్నాయి. ఎంత అవసరం ఉందన్నా పూర్తి స్థాయిలో అందించడం లేదు. రిజర్వు బ్యాంకు నుంచి తమకు అంతే వస్తోందని, అంతకంటే ఎక్కువ ఇవ్వలేమని చెప్పేస్తున్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎఫ్‌ఆర్‌డీఏ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లు ప్రజల్లో, ఖాతాదారుల్లో ఆందోళన నింపింది. బ్యాంకులు నష్టాల బారిన పడి డిపాజిట్‌దారుల డబ్బును తిరిగివ్వకున్నా ఖాతాదారుల డబ్బుకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక భరోసా ఏమీ ఉండదని ఆ బిల్లులో పెట్టారు. దీంతో ప్రజలకు బ్యాంకులపై నమ్మకం సడలిపోయే పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో నోట్ల రద్దు అనంతరం కూడా ప్రజల్లో బ్యాంకులపై నమ్మకం తగ్గే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో తమ డిపాజిట్‌ల కాలపరిమితి తీరిపోయాక నగదును ఇంటికి తెచ్చేసుకుంటున్నారు. అవసరం ఉన్నా లేకున్నా ఇంట్లోనే డబ్బు పెట్టుకుంటున్నారు తప్ప మళ్లీ డిపాజిట్ చేయడం లేదు. దీంతో బ్యాంకులకు నగదు వసూళ్లు తగ్గిపోయాయి. సాధారణంగా ఒక బ్యాంకు శాఖ ఆ రోజు వచ్చిన వసూళ్లు, బ్యాంకు చేసే చెల్లింపులకు మధ్య తేడాను చెస్ట్ నుంచి తెచ్చుకుంటుంది. ఇప్పుడు డిపాజిట్లు తగ్గిపోవడంతో వచ్చేది తగ్గిపోయింది. అదే సమయంలో ఖాతాదారులు తీసుకునేది పెరిగింది. ఈ భారీ వ్యత్యాసాన్ని భరించేందుకు చెస్ట్‌ల నుంచి డబ్బు అడుగుతున్నా ఇవ్వకపోవడంతో ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్నారు.

కొత్త నోట్లు ఏమయ్యాయో...

మరోవైపు కేంద్రం రెండువేల నోట్ల ముద్రణను కొంత పరిమితివరకే చేసి ఆపై ఆపేసింది. అదే సమయంలో బ్యాంకుల్లో ఖాతాదారులు చేసే జమల్లో రెండు వేల నోట్లు ఉంటే అవి ఒకసారి బ్యాంకుకు, అక్కడినుంచి చెస్ట్‌కు, రిజర్వు బ్యాంకుకు వెళ్లాక తిరిగిరావడం లేదు. ఆ రెండువేల నోట్లను మళ్లీ బ్యాంకులకు పంపిణీ చేయడం లేదు. అదే సమయంలో ఖాతాదారుల చేతికి వచ్చిన రెండువేల నోట్లను వారు ఇళ్లల్లోనే పెట్టేసుకుంటున్నారు. రూ. 500, రూ. 200 నోట్లను విడుదల చేసినా, అవన్నీ చలామణిలో కనిపించకుండా పోతున్నాయి. ఆఖరికి రూ. 10 కొత్త నోట్లను ఒకసారి తీసుకోవడమే తప్ప మళ్లీ వాటిని చలామణిలోకి తేవడం లేదు. ఇది కూడా నగదు కొరత తీవ్రతకు కారణమవుతోంది. మరోవైపు డిజిటల్ లావాదేవీలు పెంచేందుకు కేంద్రమే కావాలనే నగదు పంపిణీని తగ్గిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగదు కొరతతో తమ పరిస్థితి ఘోరంగా తయారైందని ప్రజలతో పాటు బ్యాంకు సిబ్బంది కూడా వాపోతున్నారు. ఖాతాదారులకు విజ్ఞప్తి చేసి ఖాతాల్లో నిల్వ ఉంచమని అడుగుతాం. డిపాజిట్లు చేయిస్తాం. కానీ వారు అడిగినప్పుడు డబ్బు ఇవ్వకపోతే మమ్మల్ని నిలదీస్తున్నారు. మీరు చెప్తే నిల్వ ఉంచాం. మా డబ్బు మాకిచ్చేందుకు ఏమైందని నిలదీస్తున్నారు. ఏం చేయాలో అర్థకావడం లేదని కొందరు బ్యాంకు ఉద్యోగులు పేర్కొన్నారు.

బ్యాంకు బ్రాంచ్ ఏటీఎంల్లోనూ నిల్...

సాధారణంగా ప్రధాన బ్యాంకు బ్రాంచ్‌లు, బ్యాంకు శాఖల వద్ద ఉన్న ఏటీఎంల్లో ఎప్పుడూ డబ్బు ఉంటుంది. కానీ ఇప్పుడు బ్యాంకుల ప్రధాన బ్రాంచ్ ఏటీఎంల్లోనూ డబ్బులేవు. దీంతో బ్యాంకులకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. అక్కడేమో అడిగినంత ఇవ్వలేమని చెబుతుండడంతో ఖాతాదారులు గొడవకు దిగుతున్నారు. నోట్ల రద్దు సమయంలో ఇబ్బందులను మర్చిపోకముందే మళ్లీ ఈ దుస్థితి ఏమిటని బ్యాంకు అధికారులను నిలదీస్తున్నారు.




# వచ్చేస్తున్నాయ్ 5జి కంప్యూటర్లు



న్యూఢిల్లీ : ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ కంప్యూటర్ తయారీ సంస్థలైన డెల్, హెచ్‌పి, లెనోవో సాఫ్ట్‌వేర్ సంస్థ మైక్రోసాఫ్ట్‌తో కలసి త్వరలో 5జి టెక్నాలజీ ఉన్న పర్సనల్ కంప్యూటర్లను విడుదల చేయనున్నది. ఈ మేరకు ఇంటెల్ సంస్థ ఇప్పటికే ఆయా కంపెనీలతో భాగస్వామ్యం అయినట్లు తెలిపింది. 2019లో ఈ కంప్యూటర్లు యూజర్లకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండగా వీటిలో అధునాతన ఇంటెల్ ఎక్స్ఎంఎం 8000 సీరీస్ కమర్షియల్ 5జి మోడెమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. 2019 ద్వితీయార్థంలో 5జి కంప్యూటర్లు వచ్చే అవకాశం ఉన్నది. 5జి టెక్నాలజీతో రానున్న ఈ కంప్యూటర్లు 2 ఇన్ 1 పిసిల్లా పని చేస్తాయి. అంటే వీటిని ల్యాప్ టాప్‌లు లేదా ట్యాబ్లెట్ పిసిల్లా వాడుకోవచ్చన్నమాట. ఇక ఇందుకు సంబంధించిన టెక్నాలజీతో పాటు సదరు 5జి మోడెమ్‌లను ఇంటెల్ బార్సిలోనాలో జరగనున్న ఎండబ్ల్యుసి 2018లో ప్రదర్శించనున్నది. 5జి మోడెమ్ కలిగిన కోర్ ఐ5 8వ జనరేషన్ ప్రాసెసర్లను ఇంటెల్ ప్రదర్శిస్తుంది.

# వేలానికి స్టీవ్ జాబ్స్ సివి




న్యూయార్క్ : స్టీవ్ జాబ్స్! ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్న ఐఫోన్ సృష్టికర్త. సిఇఒగా ఆపిల్ సంస్థను ఎక్కడికో తీసుకు వెళ్లిన వ్యక్తి. అటువంటి స్టీవ్ జాబ్స్ ఒక ఉద్యోగం కోసం 45 ఏళ్ల క్రితం తయారు చేసిన సివి ఒకటి ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నది. అప్పట్లోనే టెక్నాలజీలో పని చేయాలన్న ఆయన బలమైన ఆకాంక్షకు ఆ సివి అద్దం పడుతున్నది. అందులో కొన్ని అక్షర దోషాలు కూడా ఉండడం విశేషం. ఇప్పుడు ఈ సివిని వేలం వేస్తున్నారు. దీనికి సుమారు 50 వేల డాలర్లు (రూ. 32 లక్షలు) రావచ్చని అంచనా వేస్తున్నారు. ఆ సివిలో తన పేరు స్టీవ్ జాబ్స్ అని, అడ్రెస్ రీడ్ కాలేజీ అని ఉంది. ఆయన ఏ ఉద్యోగం కోసం దరఖాస్తు చేస్తున్నారన్నది అందులో లేదు. ఇప్పుడు ఆ సివిని బోస్టన్‌కు చెందిన ఆర్ఆర్ ఆక్షన్ హౌస్ వేలం వేస్తున్నది. ఎలక్ట్రానిక్స్ టెక్ లేదా డిజైన్ ఇంజనీర్‌లో తనకు నైపుణ్యం ఉన్నట్లు ఆ సివిలో స్టీవ్ జాబ్స్ తెలియజేశారు. తనకు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆ సివిని రూపొందించిన సరిగ్గా మూడు సంవత్సరాల తరువాత స్టీవ్ వోజ్నియాక్‌తో కలసి ఆయన ఆపిల్ సంస్థను స్థాపించారు. ఆ తరువాత ఏమి జరిగిందో అందరికీ తెలిసిందే. ఆర్ఆర్ వేలం సంస్థ మార్చి 8 నుంచి 15 వరకు ఆ సివితో పాటు మరికొన్ని వస్తువులను వేలం వేయనున్నది. వాటిలో జాబ్స్ సంతకం చేసిన ఆపిల్ మాక్ ఓఎస్ మాన్యువల్, ఒక వార్తాపత్రిక వ్యాసం కూడా ఉన్నాయి.

# ఎఫెర్పి కొనుగోలుకు జెఎస్‌డబ్ల్యు యత్నాలు




న్యూఢిల్లీ : ఇటలీకి చెందిన ఎఫెర్పి స్టీల్ సంస్థ కొనుగోలుకు భారత్‌కు చెందిన ప్రైవేట్ రంగ సంస్థ జెఎస్‌డబ్ల్యు స్టీల్ యత్నాలు ప్రయత్నాలు చేస్తోంది. ఈ డీల్ విలువ సుమారు రూ. 600 కోట్లు ఉండవచ్చని అంచనా. ఇప్పటికే చర్చలు తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో దీనిపై ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఎఫెర్పి సంస్థ రైల్వేలకు సంబంధించిన పరికరాలు, ఆటోమొబైల్స్‌లో వినియోగించే బార్లు, ఎర్త్ మూవింగ్ వాహనాలు తయారు చేస్తుంది. ఈ సంస్థ ఇటలీలో రెండవ అతిపెద్ద స్టీల్ ఉత్పత్తిదారు. ఈ సమాచారంపై జెఎస్‌డబ్ల్యు మాత్రం స్పందించలేదు. యూరప్‌లోని జెఎస్‌డబ్ల్యు సంస్థకు ఆటోమొబైల్ కస్టమర్లు ఉన్నారు. వారి అవసరాలు తీర్చేందుకు భారత్ నుంచి రోల్డ్ కాయిల్స్‌ను ఇటలీ తరలించి అక్కడ వాటిని ఆటోమొబైల్ పరిశ్రమ అవసరాలకు తగినట్లు మార్చి విక్రయించాలని భావిస్తోంది. యూరోప్‌లో ఒక కర్మాగారం ఏర్పాటుకు జెఎస్‌డబ్ల్యు ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. 2014లో ఇటలీలోని లుచ్చిని సంస్థను కొనుగోలు చేయాలని భావించింది. కానీ అల్జీరియాకు చెందిన సివిటాల్ దీనిని కొనుగోలు చేయడంతో ప్రయత్నాలు ఫలించలేదు.

# ఆదాయం కోసం పరుగులు వద్దు



న్యూయార్క్ : ఆదాయం కోసం పరుగులు తీయకుండా సరళమైన పెట్టుబడి వ్యూహాలను పాటించాలని బిలియనీర్, బెర్క్‌షైర్ హత్వే అధిపతి వారెన్ బఫెట్ సూచించారు. ఆయన ఏటా వినియో గదారులకు సూచనలతో అందజేసే వార్షిక లేఖలో ఈ సూచన చేశారు. ఆయన బాండ్స్‌లో పెట్టు బడుల వల్ల ఉన్న ముప్పును బలంగా పేర్కొ న్నారు. 'అన్ని సందర్భాల్లోను అనుకూల ఫలితాలు రాకపో వచ్చు. ఆదాయమే కొలమానం కాదు' అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. దీనికి ఆయన హెడ్జ్ ఫండ్స్ పది సంవత్సరాల ఆదా యాన్ని, ఎస్ అండ్ పి 500 ఇండెక్స్ ఫండ్ ఆదా యాన్ని పోల్చి చూశారు. పెట్టుబడిదారులు స్వల్ప కాలంలో వచ్చి ఎగుడు దిగుడులకు భయపడకుండా వాటాల్లోనే పెట్టు బడులు పెట్టాలని బఫెట్ కోరారు. హెడ్జ్ ఫండ్స్‌లో పెన్షన్ ఫండ్స్, కొలేజ్ ఎండోమెంట్స్ ఫండ్స్‌లో పెట్టే పెట్టుబడి మొత్తాలు, స్టాక్స్‌లో పెట్టే పెట్టబడి మొత్తాలను బట్టి రిస్క్ ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. అత్యుత్తమ ఫండ్స్ పోర్ట్‌ఫోలి యోలో రిస్క్ కూడా ఎక్కువగానే ఉంటుందని బఫెట్ సూచించారు. ఇక 2017లో కంపెనీ పని తీరును ఈ లేఖలో వాటాదా రులకు బఫెట్ వివరించారు. అమెరికా పన్ను సంస్కరణలు కంపె నీకి మేలు చేసినట్లు ఆయన తెలియజేశారు. సంస్థ వద్ద భారీగా నగదు నిల్వలు ఉన్నట్లు ఆయన ప్రకటించారు. కానీ కొత్త కొను గోళ్లలో అడ్డంకులు తలెత్తుతున్నట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కొనుగోలు చేద్దామనుకున్న చాలా కంపెనీలు అనుకున్న విలువ కంటే ఖరీదుగా ఉన్నాయని ఆయన తెలియజేశారు. బెర్క్‌షైర్ హత్వే సంస్థకు చెందిన బీమా వ్యాపారం నష్టాలను నమోదు చేయడం విశేషం. తన స్థానాన్ని భర్తీ చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని బఫెట్ తెలిపారు. తన సూచనలు ఏమిటో డైరెక్టర్లకు బాగా తెలుసని ఆయన అన్నారు. 'బెర్క్‌షైర్ కోసం కష్టపడే వారు ఉన్నారు.

# చైనా అధ్యక్షుడిగా మళ్లీ జీ జిన్‌పింగ్!

బీజింగ్: చైనా అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్ నిరవధికంగా కొనసాగేలా తమ రాజ్యాంగంలో కీలకమైన మార్పునకు అధికార కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధమవుతోంది. ఈ మేరకు రెండుసార్లే అధ్యక్షుడవ్వాలన్న నిబంధనను సవరించాలని ఆ పార్టీ ప్రతిపాదించింది. కొద్ది రోజుల్లోనే జిన్‌పింగ్ తన తొలి విడత అధ్యక్ష పదవి నుంచి దిగిపోనున్నారు. ఆయనను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి మార్చి 5న పార్లమెంట్ సమావేశం కానున్నది. ఇప్పటికే పార్టీ, మిలిటరీ చీఫ్‌గా ఆయన నిరవధికంగా కొనసాగుతున్నారు. గతేడాది అక్టోబర్‌లోనే ఈ మేరకు పార్టీ కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను ఆమోదించింది. దేశ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నిరవధికంగా కొనసాగేలా పార్టీ కేంద్ర కమిటీ ఓ కీలక ప్రతిపాదన చేసింది. ఈ విషయాన్ని చైనా అధికార మీడియా జినువా న్యూస్ వెల్లడించింది. అంతేకాదు చైనా ఆదర్శాలతో కూడిన సోషలిజంపై జీ జిన్‌పింగ్ ఆలోచనలను రాజ్యాంగంలో చేర్చాలనీ పార్టీ కేంద్ర కమిటీ ప్రతిపాదించింది. అయితే రాజ్యాంగ సవరణను పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఆ పార్లమెంట్‌లో ఎలాగూ పార్టీ విధేయులే ఉంటారు కాబట్టి.. ఈ ప్రతిపాదనకు ఆమోదం దక్కినట్లే. నిజానికి జీ జిన్‌పింగ్ తన పదేళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత కూడా అధ్యక్షుడిగా కొనసాగాలని అనుకుంటున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి.




## అవినీతి నిర్మూలనలో మోడీ విఫలం



బాగల్‌కోట్: అవినీతిని కట్టడి చేయడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విఫలమయ్యారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బాగల్‌కోట్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అవినీతిని సహించేది లేదని మోడీ చెప్తున్న మాటలు కేవలం ఎన్నికల వాగ్దానాలేనన్నారు. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోడీ వాగ్దానాలను గుర్తు చేస్తూ తాను దేశానికి కాపలాదారుగా ఉంటానని అనేవారని రాహుల్ చెప్పారు. మాజీ ముఖ్యమంత్రుల్లో ఒకరు, నలుగురు మంత్రులు జైలు శిక్ష అనుభవిస్తున్నా, ఇంకా అవినీతికి వ్యతిరేకంగా పోరాడతానని ఈ కాపలాదారు చెప్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. గుజరాత్ శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలు తనకు చాలా ఫిర్యాదులు చేశారన్నారు. తమ రాష్ట్రంలో విద్య నేర్చుకోవడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిందని తనకు చెప్పారన్నారు. ఆ రాష్ట్రంలోని ప్రధాన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ప్రైవేటు పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్నాయని ఆరోపించారు.

# దసరా నాటికి అమరావతికి హైకోర్టు

- నేలపాడులో సిటీ సివిల్ కోర్టు భవనాలు
- నిర్మాణానికి ఫుల్ కోర్టు పచ్చజెండా
- ఆగస్టు 31 లేదా దసరా సెలవుల్లోగా పూర్తి
- జస్టిస్ భవన్ పూర్తయ్యేవరకు హైకోర్టు కార్యకలాపాలు



అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దసరా సెలవుల్లో రాష్ట్రానికి తరలివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ఫుల్‌కోర్టు ఇటీవల హైకోర్టు సమావేశ మందిరంలో సమావేశమైంది. హైకోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలనకు బిల్డింగ్ కమిటీ గతవారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. తాను పరిశీలించిన భవనాలపై ఆ కమిటీ నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ భవనాలు హైకోర్టు ఏర్పాటుకు అనువుగా లేవని పేర్కొన్నట్లు సమాచారం. సిటీ సివిల్ కోర్టుకు అనుమతించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం రాసిన లేఖ సారాంశాన్ని జస్టిస్ రమేశ్ రంగనాథన్ న్యాయమూర్తులకు ఈ సందర్భంగా వివరించినట్లు తెలిసింది. అమరావతిలో నిర్మించ తలపెట్టిన జస్టిస్ సిటీ సమీపంలోనే నేలపాడు వద్ద సిటీ సివిల్ కోర్టు భవనాలు నిర్మిస్తామని, ఇది శాశ్వత హైకోర్టు నిర్మించే ప్రాంతానికి సమీపంలోనే ఉంటుందని సదరు లేఖలో ప్రభుత్వం తెలియజేసింది. మార్చి 15 నుంచి సిటీ సివిల్ కోర్టు నిర్మాణాలు ప్రారంభించి ఆగస్టు చివరకు లేదా వచ్చే దసరా సెలవులకల్లా పూర్తి చేస్తామని, ఆ భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిసింది. హైకోర్టు శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యాక అందులోకి మారవచ్చని, తాత్కాలికంగా సిటీ సివిల్ కోర్టు భవనం నిర్మాణానికి అనుమతించాలని అభ్యర్థించింది. ఈ ప్రతిపాదనలకు ఫుల్‌కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

మొదటి పేజీ తరువాయి

# బీసీలకు ఏదీ న్యాయం?



బడుగుల బతుకులు వెలిగిపోతాయని ఊకదంపుడు ఉపన్యాసాలతో జనాలను మభ్యపెడుతూనే ఉన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఒక పార్టీ, నిరుద్యోగ భృతిని ఇస్తామని మరో పార్టీ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. కాగా.. జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లు పెంచుకోవచ్చని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సైతం అగ్రవర్ణ పాలకులు పట్టించుకోవడం లేదు. బీసీల సంక్షేమంపై గత ప్రభుత్వాల పాలనకంటే టీఆర్‌ఎస్ పాలనలో కొంత మెరుగైనప్పటికీ..పూర్తి స్థాయిలో ఆశించిన ఫలితాలు దక్కడం లేదనేది నగ్నసత్యం. జనాభా దామాషా ప్రకారం చట్ట సభలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీలు చేస్తున్న ప్రధాన డిమాండ్‌ను అధికార టీఆర్‌ఎస్‌తో పాటు విపక్షాలు సైతం పట్టించుకోవడం లేదు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుకోవచ్చని ఓ తీర్పులో సుప్రీం కోర్టు వెల్లడించిన నేపథ్యంలో..బడుగులు తమ రిజర్వేషన్లపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనగణను చేపట్టేందుకు వేసిన కమిటీ సైతం.. ఇంత వరకు ఆ వివరాలను వెల్లడించక పోవడంపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని శంఖించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని చూస్తున్న సీఎం కేసీఆర్.. బీసీలలో అత్యధిక జనభా ఉన్న కొన్ని సామాజిక వర్గాలకే పట్టం గడుతున్నారని టీపీసీసీ కాంగ్రెస్ బీసీ నేత చిత్తరంజన్ దాస్ ఆరోపిస్తున్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారని, అందుకు బి.సి జనాభా ప్రకారం పెంచాలి. ఈ మేరకు రాజ్యాంగ సవరణకు ప్రయత్నం చేయాలని కోరుతున్నారు. వచ్చే ఎన్నికలలో బి.సి లకు 59 శాతం అసెంబ్లీ-పార్లమెంటు టికెట్లు ఇవ్వాలని, చట్ట సభలలో 59 శాతం రిజర్వేషన్లు పెట్టాలని అసెంబ్లీ చేసిన తీర్మాణం పై ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిల పక్షాన్ని డిల్లీకి తీసుకవెళ్ళి ప్రధానమంత్రితో చర్చలు జరుపాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీరాజ్/స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతం నుంచి జనాభా ప్రకారం పెంచాలి. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్దత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు జనాభా ప్రకారం 25శాతం నుంచి 59 శాతంకు పెంచాలి. బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ ను తొలగించాలి. ఏ వర్గాలకు లేని క్రిమిలేయర్ బి.సి.లకెందుకు? తమిళనాడు రాష్ట్ర క్రిమిలేయర్ తొలగించిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రూ.10 వేల కోట్లతో బి.సి. సబ్-ప్లాన్ ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక పాలసీలో బి.సి లకు జనాభా ప్రకారం కోటా ఇచ్చి, బి.సి పారిశ్రామిక పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. భూములు లేని బి.సి. రైతులకు మూడు ఎకరాల భూమి ప్రభుత్వం మంజూరు చేయాలని, నామినేటెడ్ పోస్టులలో చైర్మన్లు, డైరెక్టర్లు, -ఇతర, పోస్టులలో బి.సి.లకు 59 శాతం పోస్టులు ఇచ్చే విధంగా విధాన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్ని కుల సంఘాలకు-ఒక్కొక్క కుల సంఘంనకు 10 ఎకరాల భూమి- 10 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరుతున్నారు. కులాంతర వివాహాలు చేసుకొనే దంపతులకు ఇచ్చే ప్రోత్సాహక పారితోషికం 10 వేల నుంచి రెండు లక్షలకు పెంచాలని, జూనియర్ అడ్వకేట్లకిచ్చే స్టైఫండును ఒక వెయ్యి నుంచి 10 వేలకు పెంచి, అర్హులందరికీ ఇవ్వాలని కోరుతున్నారు. డబుల్ బెడ్ రూమ్ స్కీం లో బి.సి.లకు జనాభా ప్రకారం 52 శాతం కోటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



# కదం తొక్కుతూ జనాన్ని పలకరిస్తూ

చల్ల గిరిగేల, గద్దమీదపల్లి క్రాస్, నదంమారెళ్ల, పెద్దరకట్ల వరకు కొనసాగనుంది. దీంతో వైఎస్ జగన్ తన 97వ రోజు పాదయాత్రను ముగించారు. ఆదివారంనాటికి 15.3 కిలోమీటర్లు నడిచిన ఆయన మొత్తం 1310.3 కిలోమీటర్లు నడిచారు. చల్లగిరిగిల, గద్దమీదపల్లి క్రాస్, నందమారెళ్ల, యడవల్లి క్రాస్ మీదుగా పెదారికట్ల వరకూ పాదయాత్ర సాగింది.

ప్రజాసంకల్పయాత్ర 1300 కి.మీ...మొక్క నాటిన జగన్ :

ప్రజాసంకల్పయాత్ర పేరిట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర మరో మైలు రాయి దాటింది. ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలోని నందనమారెళ్ల వద్ద ఆయన 1300 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు జననేతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మొక్కను నాటిన వైఎస్ జగన్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. అటుపై తన పాదయాత్రను ఆయన ముందుకు కొనసాగించారు. ఆదివారం సాయంత్రానికి మార్కాపురం నియోజకవర్గంలోకి ఆయన అడుగుపెట్టారు.

ప్రజాసంకల్పయాత్ర 98వ రోజు షెడ్యూల్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర 98వ రోజు షెడ్యూల్ ఖరారు అయింది. ఈమేరకు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం పాదయాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. సోమవారం ఉదయం కొనకనమిట్ల మండలం పెద్దారికట్ల శివారు నుంచి వైఎస్ జగన్ పాదయాత్రను ప్రారంభిస్తారు. అక్కడ నుంచి చిన్నారికట్ల, చిన్నారికట్ల జంక్షన్, కంభాలపాడు మీదుగా పోతవరం చేరుకొని పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజన విరామం తీసుకుంటారు. అనంతరం 2.45 గంటలకు వైఎస్ జగన్ తిరిగి పాదయాత్ర ప్రారంభిస్తారు. మూడు గంటలకు పొదిలి మండల కేంద్రం చేరుకొని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఆతరువాత సాయంత్రం 5.30 గంటలకు పాదయాత్రను ముగించి రాత్రికి అక్కడే బస చేస్తారు.

# రైతే రాజు



విధానం. రైతు సమన్వయ సభ్యుల బాధ్యత చాలా పెద్దది. గ్రామాల సమన్వయ సమితి ఆ గ్రామానికి కథా నాయకులు కావాలి. రైతు పండించే రాశి చుట్టే కుల వృాఎత్తులు ఆధారపడి ఉంటాయి. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్రెడ్డిని నియమిస్తున్నం. అనుభవం కలిగిన ఆయన సేవలు రైతు సంఘానికి ఉపయోగపడతాయి. సభ్యులను దఫదఫాలుగా ఇజ్రాయెల్ పంపిస్తాం. పోచారానికి లక్ష్మీపుత్రుడని నేనే బిరుదు ఇచ్చిన. రైతులకు ప్రి పెయిడ్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించినం. ప్రిపెయిడ్ కార్డుల్లో ఎప్పటికప్పుడు నగదు క్రెడిట్ అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నం. కోటి ఎకరాలు ప్రాజెక్టుల ద్వారానే పారే విధంగా అహోరాత్రులు శ్రమిస్తున్నమని సీఎం తెలిపారు. ఆదివారంనాడు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సును ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

అన్నదాతకు అన్ని విధాలా సహకారం అందించాలన్న ఉద్దేశంతోనే 'రైతు సమన్వయ సమితి'లు ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ సర్కారు లక్ష్యమని ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసా ఇచ్చారు. భూ ప్రక్షాళన నేపథ్యంలో రాష్ట్రంలో కోటి 62 లక్షల ఎకరాల భూమి ఉన్నట్లు లెక్కలు తేలాయని వెల్లడించారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించబోతున్న దృష్ట్యా చెక్కుల రూపంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, రసాయన ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు, దేవాదుల, పాలమూరు ఎత్తిపోతల పథకాలు పూర్తయితే రెండు పంటలు పండుతాయని అన్నారు. రైతాంగం ధనికులుగా మారడమే ప్రభుత్వ ధ్యేయమని కేసీఆర్ స్పష్టం చేశారు. వ్యవసాయం వ్యాపారం కాదని.. జీవన విధానమని చెప్పారు. మనం అనుకుంటే బంగారు తెలంగాణ సాధ్యమన్నారు. పంటను క్రమపద్ధతిలో మార్కెటుకు తరలించేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అడవి పందుల నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోతుల బెడద నివారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వనాలు పెంచినప్పుడే కోతుల సమస్య తగ్గుతుందని.. వనాల్లో జంతువులు, పక్షులు, పక్షులు తినే పండ్ల వృక్షాలను పెంచాలని ఈ సందర్భంగా సూచించారు.

**కేంద్రంపై సీఎం తీవ్ర అసంతృప్తి :** రైతుల కోసం పనిచేసే ప్రభుత్వం భారత దేశంలో ఇప్పటివరకూ ఏదీలేదని.. రైతులకు మేలు చేసే పనులు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీని పదేపదే కోరానని సీఎం వెల్లడించారు. అయితే కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లభించట్లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ మొత్తాన్ని అంకాపూర్‌కు మించి తీర్చిద్దాలని అప్పుడే రైతు సమన్వయ సమితులు విజయం సాధించినట్లని వ్యాఖ్యానించారు. మరోవైపు రైతు సమన్వయ సమితి సభ్యులు అంకాపూర్ గ్రామాన్ని సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రికి సూచించారు. రైతు సమన్వయ సమితికి ఎకరం భూమి విరాళంగా ఇచ్చిన మక్తల్ నియోజకవర్గ రైతు వెంకటరెడ్డిని ముఖ్యమంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి పేరును ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.

రైతులందరికీ చెక్కుల ద్వారానే పంట సాయం : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని సీఎం కేసీఆర్ అన్నారు. దీనిపై ఇప్పటికే ప్రధానికి లేఖలు కూడా రాశానని తెలిపారు. దక్షిణ తెలంగాణ రైతు సమన్వయ సమితుల సదస్సులో ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్ తరాల కోసం మనం ఆలోచించాలి. హరితహారంలో భాగంగా చెట్లను పెంచుతున్నం. మీకెలాంటి సమస్య ఉన్నా రైతు సమన్వయ సమితికి తెలియజేయండి. మార్కెట్ తెచ్చే ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రైతులంతా ఐక్యంగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు. పంటను ఒకే సారి మార్కెట్‌కు తరలించకుండా చూసుకోవాలి. ప్రతి గ్రామ రైతులకు ఒక నిర్ణీత రోజు, సమయం కేటాయించాలి. వచ్చే వర్షాకాలపు పంట ఒక్క గింజ కూడా కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మనివొద్దు. గిట్టుబాటు ధర రావాలంటే అది రైతుల చేతిలోనే ఉంది. నిమిషాల మీద కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. చెక్కుల పంపిణీలో క్రమశిక్షణ పాటించిన గ్రామాల రైతులను ఇజ్రాయెల్ పంపేందుకు ఏర్పాట్లు చేస్తం. స్థానికంగా ఎక్కడ ఏ పంటలు పండుతాయో అక్కడ వాటికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తం. రైతులకు 75శాతం సబ్సిడీతో టార్పాలిన్లను ఇస్తం. తెలంగాణ రైతులను దేశంలోనే అత్యుత్తమ రైతులుగా తీర్చిదిద్దుతం.

**రైతు సమన్వయ సమితి రాజకీయ పోస్టు కాదు :** భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో రావాల్సిన సాంకేతిక మార్పులపై సీఎం తెలిపారు. నాలుగైదు ఏళ్ల తర్వాత నాట్లు వేసే వాళ్లు దొరకరు. ప్రతి 5 ఎకరాలకు వ్యవసాయ పనిముట్లు, యంత్రాల లెక్క తెలియాలి. నాట్లు వేసే యంత్రాలను 50శాతం సబ్సిడీతో ఇస్తం. వ్యవసాయ యాంత్రీకరణ జరిగితే తప్ప అనుకున్నది సాధించలేం. ఎక్కడ ఏ యంత్రాలు సమకూర్చాలో ప్రభుత్వం నిర్ణయిస్తది. అందరూ ఒకటే పంట వేస్తే అందరికీ నష్టం. తెలంగాణలో 60 లక్షల కొత్త గొర్రెలు వచ్చినయి. అధికారులు సూచించిన ప్రకారం పంటలు పండిస్తే రైతులకు లాభం చేకూరుతుంది. ప్రతి నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తున్నం. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లే రైతు సమన్వయ సమితిలో ఉన్నారు. రైతు సమన్వయ సమితీ రాజకీయ పోస్టు కాదని, రైతులకు మేలు చేసేందుకు ఏర్పాటు చేసిందని సీఎం తెలిపారు.

**కందిలి వచ్చింది...కానీ కరెంటు రాలేదు :** రైతులకు నీళ్లొస్తే ప్రతిపక్షాలకు కడుపు మంట. అధికారంలో కాంగ్రెస్ ఉన్నా.. టీడీపీ ఉన్నా అసెంబ్లీకి కందిలి వచ్చింది కానీ.. రాష్ట్రానికి కరెంట్ రాలేదు. రైతు సమన్వయ సమితిలో పైరవీలకు ఆస్కారం ఉండొద్దు. రైతు సమన్వయ సమితి గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో కూర్చోదు. వీటి వల్ల స్థానిక సంస్థలకు వచ్చిన నష్టం లేదు. స్థానిక సంస్థలు నిర్వీర్యం అవుతాయని కొందరు మాట్లాడుతున్నరు. ఈ సారి రైతుల కోసం ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెడుతున్నం. రైతు బాగుపడే వరకు చిత్తశుద్ధితో పని చేస్తం. ఈ యాసంగి నుంచే రైతు సమన్వయ సమితులు యాక్టివ్‌గా పనిచేయాలని సీఎం అన్నారు.

రైతుల పెట్టుబడి పథకం కోసం రూ.12వేల కోట్లు...

ఏ ఎకరంలో ఏ పంట పండుతుందో సమన్వయ సమితికి తెలియాలి. మనం అనుకుంటే తెలంగాణలో బంగారు పంటలు పండవా?. రూ.12వేల కోట్లు రైతుల పెట్టుబడి కోసం వచ్చే బడ్జెట్లో కేటాయించబోతున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. మన రైతులు పండించే విలువ రూ.లక్షా 25వేల కోట్లు ఉండబోతోంది. సాక్షాత్తు ప్రధాని, కేంద్ర హోంమంత్రి తెలంగాణను చూసి ఆశ్చర్యపోయారు. రైతులకు ఏం కావాలన్నా సమకూరుస్తం. రైతులను సంఘటితం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. సృష్టించబోయే సంపదకు ఆయుపట్టు. కల్తీ విత్తనాలపై ఉక్కుపాదం మోపినం. సమన్వయ సమితి సరిగా ఉంటే కల్తీ చీడ పురుగులుండవు.

ఆంధ్రపాలకుల హయంలో చిన్ననీటిపారుదల ధ్వంసం అయ్యింది.....

ఆంధ్రా పాలకుల హయంలో మైనర్ ఇరిగేషన్ ధ్వంసమైంది. మిషన్ కాకతీయకు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నయి. రాష్ట్రంలో కోటి 65 లక్షల ఎకరాల వ్యవసాయ నికర భూమి తేలింది. కోటి 32 లక్షల భూమి ఏ పంచాయతీ లేకుండా ఉన్నది. రైతులు వ్యవస్థీకృతమే పంట కాలనీలు కూడా సాధ్యమే. ప్రతి రైతు వేదికకు రూ.12లక్షలు మంజూరు చేస్తమని సీఎం తెలిపారు. ప్రతి రైతు వేదిక 5 వేల ఎకరాల పంట లెక్క తీయాలి.

లంచాలు బంద్....

ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్లు అలాగా ఉంటారు. ఎమ్మార్వోలు కూడా సబ్ రిజిస్ట్రార్లుగా ఉంటారు. ఏ మండలానికి ఆ మండల ఎమ్మార్వోనే రిజిస్ట్రార్‌గా ఉంటారు. ఇక నుంచి రిజిస్ట్రేషన్ గురించి లంచాలు ఇచ్చుడు బంద్. పాస్ బుక్ ఇవ్వడంలో సబ్ రిజిస్ట్రార్ ఆలస్యం చేస్తే రోజుకు రూ.వెయ్యి చొప్పున ఫైన్ విధిస్తం. అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ అందుబాటులో ఉంటుంది. పాస్ పోర్టు వచ్చినట్టే పాస్ బుక్కులు కూడా పోస్టులో ఇంటికి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, నాయిని నరసింహారెడ్డి, జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్ రెడ్డి, హరీశ్‌రావు, 13 జిల్లాల నుంచి తరలివచ్చిన మండల, జిల్లా, రాష్ట్ర సమన్వయ సమితుల సభ్యులు, సమన్వయకర్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు

ప్రతి మండల కేంద్రంలో ఒక గోదాం:హరీశ్‌రావు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏడాదిలో గోదాముల సామర్థ్యం పెంచామని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ రూ.1000 కోట్లతో గోదాంలు నిర్మించామని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# మహిళా సాధికారతే నా కల

అప్రమత్తతో ఉండి, నిబంధనలను పాటించడం ద్వారా వీటిని అరికట్టవచ్చు అని ప్రధాని పేర్కొన్నారు. ఏదైనా విపత్తు సంభవిస్తే.. సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం అక్కడికి చేరుకునే వారే నిజమైన హీరోలని కొనియాడారు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి శకానికి భారతదేశం నడుస్తోందని మోడీ అభిప్రాయపడ్డారు. సామాజిక, ఆర్థిక జీవితంలో మహిళలందరికీ సమాన భాగస్వామ్యం ఉందని చెప్పారు. దేశ ప్రజలకు ఈ సందర్భంగా ప్రధాని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి సాధించే దిశగా భారతదేశం పయనిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మనం మహిళల నాయకత్వంలో అభివృద్ధి గురించి చర్చించుకుంటున్నాం. భారతదేశం కేవలం మహిళల అభివృద్ధి నుంచి మహిళల నాయకత్వంలో అభివృద్ధి దిశగా పయనిస్తోంది అన్నారు. జీవితంలోని అన్ని దశల్లోనూ మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించవలసిన బాధ్యత అందరికీ ఉందన్నారు. నవ భారతం సిద్ధాంతం భారతదేశ అభివృద్ధిలో మహిళలను సమాన భాగస్వాములుగా పరిగణిస్తుందన్నారు. కృత్రిమ మేధాశక్తిని దివ్యాంగులకు ప్రయోజనకరంగా ఉపయోగించడంపై పరిశోధన చేయాలని శాస్త్రవేత్తలను కోరారు.

# దివికెగిసిన అతిలోక సుందరి

తెలుసుకున్న శ్రీదేవి బంధువులు, సన్నిహితులు, మిత్రులు, సినీ, వ్యాపార రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఆమె ఇంటికి చేరుకున్నారు. 1963 ఆగష్టు 13న పుట్టిన శ్రీదేవి అసలు పేరు శ్రీ అమ్మా యాంగేర్ అయ్యపాన్. తమిళనాడులోని శివకాశి సొంతూరు. 1975 లో బాలనటిగా సినిమాల్లో ప్రవేశించి.. తెలుగులో 85, హిందీలో 71, తమిళంలో 72, మళయాళంలో 26, కన్నడంలో 6 చిత్రాల్లో నటించి అతిలోకసుందరిగా గుర్తింపు తెచ్చుకుంది. అన్ని వయసుల వారికీ అత్యంత ఇష్టమైన నటిగా పేరు తెచ్చుకున్న శ్రీదేవికి అనేక అవార్డులు, రివార్డులు. 2013లో ఆమెను భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. కెరీర్‌లో 14 సార్లు ఫిలింఫేర్‌కు నామినేట్ అయిన శ్రీదేవికి నాలుగు సార్లు ఉత్తమనటిగా, రెండుసార్లు స్పెషల్ జ్యూరీ లభించాయి. తెలుగులో క్షణ క్షణం సినిమాలో నటనకు గాను ఉత్తమ నటిగా నంది పురస్కారం అందుకున్నారు. బాలనటిగా పరిచయమై యవ్వన, ప్రౌఢ వయస్సులో సైతం సినీ ప్రేక్షక లోకాన్ని అలరించిన లెజెండరీ యాక్ట్రెస్ శ్రీదేవి. కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో గూడు కట్టుకున్న శ్రీదేవి.. ఇప్పుడు స్మృతులు మాత్రమే మిగిల్చి గతంలోకెళ్ళిపోయింది. చాలా రోజుల తర్వాత బంధువుల ఇంట్లో శుభ కార్యానికి హాజరుకావటంతో.. అందర్నీ పేరు పేరున పలకరించారు. బాబాయ్ ఎలా ఉన్నారు.. పిన్ని ఆరోగ్యం ఎలా ఉంది.. తమ్ముడు ఏం చేస్తున్నావ్.. అక్క బావ ఆరోగ్యం ఎలా ఉంది.. ఇలా ప్రతి ఒక్కరినీ వరసలతో కలిపి మరీ కుశల ప్రశ్నలు వేశారు. అందరి దగ్గరకి వెళ్లి మరీ మరీ పలకరించారు. మేనల్లుడి పెళ్లిలో తనదే సందడి అయ్యింది. అంబానీకి చెందిన 13 సీటర్ ప్రయివేట్ జెట్‌లో అతిలోక సుందరి పార్థీవ దేహాన్ని ఇండియాకు తీసుకు రానున్నారు. ఇప్పటికే ఆ ఎయిర్‌క్రాఫ్ట్ ముంబై నుంచి దుబాయ్ చేరుకుందని తెలుస్తోంది. ఆదివారం సాయంత్రానికే పోస్ట్ మార్టమ్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ పూర్తయ్యాయి. కానీ తుది రిపోర్టులు బయటకు రాలేదని, అందుకు టైం పడుతుందని సాయంత్రం 4 గంటల 15 నిమిషాల సమయంలో అధికార వర్గాలు వెల్లడించాయి. పార్థీవ దేహం రాక ఆలస్యమైతే అంత్యక్రియలు కూడా ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి.

శ్రీదేవి మృతి కలచివేసింది: ప్రధాని మోడీ

శ్రీదేవి మరణించిందన్న వార్త తనను ఎంతో కలచివేసిందని మోడీ తెలిపారు. భారతీయ సినీ చరిత్రలోనే గొప్ప నటిగా ఆమె పేరు సంపాదించారని కొనియాడారు. చిత్రపరిశ్రమకు శ్రేదేవీ లేని లోటు భర్తీ చేయలేనిదన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మోడీ ఆకాంక్షించారు.

షాక్‌నకు గురయ్యా: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

శ్రీదేవి మరణ వార్త విని తాను షాక్‌నకు గురయ్యానని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఆమె మరణం లక్షల మంది అభిమానుల గుండెలు పిండేసిందన్నారు. ఆమె చేసిన నటన మరెవ్వరికీ సాధ్యం కాదన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానని, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ట్వీట్ చేశారు.

దేశం గర్వించదగ్గ నటి: చంద్రబాబు

శ్రీదేవి మృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బహుభాషా నటిగా, ముఖ్యంగా తెలుగువారికి అత్యంత ఇష్టమైన కథానాయకగా ఎదిగారని కొనియాడారు. అసమానమైన తన అభినయంతో దేశం గర్వించదగ్గ నటిగా నిలిచిపోయారని చంద్రబాబు పేర్కొన్నారు.

శ్రీదేవి మరణం తీరనిలోటు: కేసీఆర్

నటి శ్రీదేవి మరణంపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.శ్రీదేవి మరణం భారతీయ సినీ పరిశ్రమకు, తెలుగు సినిమా అభిమానులకు ఎంతో వెలితిని మిగిలిస్తుందని అన్నారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల సినిమాల్లో నటించిన శ్రీదేవి ఎందరో అభిమానులను సంపాదించుకున్నారని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# నేటి నుంచి బస్సుయాత్ర

తెలుస్తోంది. ప్రజాచైతన్యబస్సుయాత్ర కోసం కాంగ్రెస్‌నేతలు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బస్సుయాత్ర కోసం 40 సీట్ల వోల్వో బస్సును సిద్దం చేశారు. బస్సు నాలుగు వైపుల సోనియా, రాహుల్, కుంతియా, ఉత్తమ్ బొమ్మలతో బస్సును అందంగా ముస్తాబు చేశారు. చేవెళ్ల నుంచి ప్రారంభం కానున్న ప్రజాచైతన్యబస్సుయాత్ర తొలిరోజు వికారాబాద్‌లో ముగియనుంది. ప్రజల్లోకి ఐక్యంగా వెళ్లాలని నిర్ణయం బస్సుయాత్ర ద్వారా ఐక్యంగా ప్రజల్లోకి వెళ్లాలని టీ-కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈమేరకు సీనియర్లతో టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమై, బస్సుయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనేవిధంగా చొరవ తీసుకుంటున్నారు. బస్సుయాత్ర ద్వారా ఐక్యంగా ముందుకువెళ్లడం ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపవచ్చునని ఆయన భావిస్తున్నారు. పార్టీ సీనియర్లు బస్సుయాత్రలో కలిసిరాకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావిస్తున్న ఉత్తమ్ పార్టీ అగ్రనేతలందరూ పాల్గొనే విధంగా ఇప్పటికే ఒప్పించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ శాసనస భాపక్షనేత జానారెడ్డి, మండలి విపక్షనేత షబ్బీర్‌అలీ, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మాజీమంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీకె అరుణలతో ఇప్పటికే ప్రత్యేకంగా సమావేశమైన ఉత్తమ్, యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరినట్లు సమాచారం. పార్టీ నేతల మధ్య చిన్నచిన్న అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, వాటిని పక్కనపెట్టి ఐక్యంగా కలిసి వెళ్లడం ద్వారా సత్తా చాటవచ్చునని కాంగ్రెస్ అగ్రనేతలు భావిస్తున్నారు. పార్టీ నేతలంతా ఐక్యంగా ముందుకు వెళితే రానున్నా ఎన్నికల్లో విజయావకాశాలు మెరుగుపడుతాయంటున్నారు. పార్టీ నేతలు కూడా తమ మధ్య నున్న విభేదాలను పక్కనపెట్టి, బస్సుయాత్రలో పాల్గొనాలని భావి స్తున్నారు. తాము తలపెట్టిన బస్సుయాత్ర ద్వారా అధికారపార్టీ వైఫల్యాల్ని ప్రజల్లో ఎండగట్టి, ఆపార్టీ నాయకత్వానికి గట్టి ఝలక్ ఇవ్వాలన్నది కాంగ్రెస్ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు టీ-పీసీసీ నాయకత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. యాత్ర కోసం ప్రత్యేక అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. రానున్నా ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ బస్సు, రథ, పాదయాత్రలతో ఈనెల 26వతేదీ నుంచి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎన్నికలకు అట్టే పెద్దగా సమయం లేకపోవడంతో, ప్రజల్లోకి వెళ్లి, టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని భావిస్తోన్న కాంగ్రెస్ నాయకత్వం, దీంతో తెలంగాణలో అప్పుడే మెల్లగా ఎన్నికల వేడి రాజుకున్నట్లు కనిపి స్తోంది.

## 26న కాగడాల నిరసన ర్యాలీ : రఘువీరా



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా, ఏపి పునర్ వ్యవస్థీకరణ చట్టం2014 లోని అంశాలన్నీ రాజీ లేకుండా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6.00 గంటల నుంచి 7.00 గంటల వరకు ఏపిసిసి రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్నభవన్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ మీదుగా లెనిన్ సెంటర్ వరకు "కాగడాలతో నిరసన ప్రదర్శన" జరుగు తుం దని ఎపిసిసి కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిధిగా ఏపిసిసి అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి, ఏపిసిసి సీనియర్ నాయకులు పాల్గొంటారు. కాగడాల నిరసన ప్రదర్శను విజయవంతం చేయాలని ప్రజలకు కార్యకర్తలకు రఘువీరా పిలుపు నిచ్చారు.

## గిరిజనుల వైద్యం సమస్యలపై దృష్టి సారించాలి

### మంత్రి ఆనందబాబు

విశాఖపట్నం,సూర్యబ్యూరో: గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల్లో కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గిరిజనులు ఎదుర్కొంటున్న తాగునీరు, వైద్యం సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి ఆనంద్‌బాబు ఆదేశించారు. ఐటీడీఏ పీవోలతో ఆనంద్‌బాబు సమీక్ష నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్నవారికి దీపం పథకం కింద గ్యాస్, కిరోసిన్ అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేల కనీస ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి తెలిపారు.



# మంత్రి తుమ్మల గ్రాఫ్ పడిపోతోందా?

- రానున్న ఎన్నికల్లో ఎదురీతేనా?
- సర్వేల సారం ఏమిటి?
- 10 మంది మంత్రులకు ఓటమి భయం పట్టుకుందా?
- తుమ్మలను పార్లమెంట్‌కు పంపించాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారా?
- పాలేరు నీటి కేటాయింపుల్లో చట్టప్రకారం నడుచుకోలేదా?
- పాలేరు సామర్థ్యం 2.5 టిఎంసి అయితే 12.5 టిఎంసిలు కేటాయింపులు చేశారా?
- అభివృద్ధి ప్రదాతకు అడ్డంకులు ఏమిటి?



(ఖమ్మం–సూర్యబ్యూరో) : ఎన్నికలు నెత్తిమీదికి వస్తున్నాయి. తెలంగాణలో తిరిగి అధికారంలోకి రావటం కోసం టిఆర్‌యస్ సర్వశక్తులు వడ్డేందుకు సిద్ధమౌతుంది. రాజకీయాలు అనువ్యంగా మారుతున్న వేళ అధికార పార్టీ మరో సర్వే చేయించినట్లు వార్తలు వెలువడ్డాయి. అందులో సుమారు 10 మంది మంత్రుల, 30 మంది ఎమ్మెల్యేల గ్రాఫ్ పడిపోతున్నట్లు వచ్చిన వార్తలు ఇటు మంత్రులను అటు ఎమ్మెల్యేలను కంగు తినిపిస్తున్నాయి. నియోజకవర్గాల్లో అభివృద్ధికోసం నిరంతరం పనిచేస్తున్నా తమకు వ్యతిరేకంగా ప్రజల మూడ్ ఎందుకు ఉంటుందనే దానిపై తర్జన భర్జన పడుతున్నారు. అయితే ఇందులో ఏవరి కారణాలు వారికి ఉన్నాయి. ఖమ్మంజిల్లాకు చెందిన సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గ్రాఫ్ పడిపోతున్నట్లు ఆ పది మంది మంత్రుల్లో ఆయన కూడా ఉన్నట్లు ఆ సర్వేసారంశం. సర్వేలో తుమ్మల పాలేరులో గెలుపు 37 శాతం ఉండగా ఓటమి 56శాతం ఉంది. గెలుపు ఓటములను గురించి చెప్పలేమనే వారి శాతం 7శాతంగా ఉంది. నిత్యం నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని తిరుగుతున్న తుమ్మల లాంటి సీనియర్ నేతకు సర్వేలో ఇంత తక్కువ మార్కులు రావటంపై పలు రకాల వాదనలు ఉన్నాయి. ఇది సరైన సర్వే కాదని తుమ్మల అభిమానాలు కొట్టి పారేస్తుండగా లేదు ఇది నూటికి నూరు శాతం నిజమేనని టిఆర్‌యస్ పార్టీలోనే కొందరి వాదన . ఇందులో వాస్తవమెంత నిజంగానే ఆయన గ్రాఫ్ పడిపోతుందా? కారణాలు ఏమిటి? తుమ్మలను పార్లమెంట్‌కు పంపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారా? సీనియర్ మంత్రి అభివృద్ధిప్రధాతకు అడ్డుంకులేమిటి? తుమ్మల రాజకీయరంగ ప్రవేశ దగ్గర నుంచి ఆయన ప్రస్తానం పరిశీలించినట్లైతే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఎన్టీర్ పిలపు మేరకు ఆ ఆపార్టీలో చేరిన తుమ్మల 1983 ఎన్నికల్లో పోటిచేసి కాంగ్రెస్ అభ్యర్ధి జలగం ప్రసాద్ చేతిలో ఓడిపోయారు. అయితే నాదెండ్ల బాస్కర్‌రావు ఎన్టీఆర్‌కు వెన్ను పోడవంటం దానిపై పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం జరిగి రద్దుచేసిన ప్రభుత్వాన్ని పునరిద్ధరించటం తిరిగి ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టటం జరిగింది. అయితే అందుకు సమ్మతించని ఎన్టీఆర్ మంత్రి వర్గం రాజీనామాచేసి ప్రజాతీర్పు కోరింది. దీంతో 1985లో తిరిగి ఎన్నికలు వచ్చాయి. తుమ్మల తిరిగి సత్తుపల్లి నుంచి పోటిచేసి విజయం సాధించారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రిగా మంత్రి వర్గంలో చోటు సంపాదించారు. 1989 జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందారు. తిరిగి 1994 , 1999లలో సత్తుపల్లి నుంచి ఆయన విజయం సాధించారు. ఆయన విజయం సాధించిన ప్రతిసారి తెలుగుదేశం అదికారంలోకి రావటం గమనార్హం. 2004లో సత్తుపల్లి నుంచి జలగం వెంకట్రావు చేతిలో ఓటమి పాలైన తుమ్మల నియోజకవర్గాల పునర్విభజనతో సత్తుపల్లి ఎస్సీ నియోజకవర్గం కావటంతో 2009లో ఖమ్మం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటిచేసిన జలగం వెంకట్రావుపై విజయం సాధించారు. 2014లో తిరిగి తెలుగుదేశం ఖమ్మం నుంచి పోటిచేయని చెబితే అయిష్టంగానే రంగలోకి దిగిన తుమ్మల కాంగ్రెస్ నుంచి మొదటి సారిగా పోటిచేసిన పువ్వాడ అజయ్‌కుమార్ చేతిలో ఓటమి పాలైయ్యారు. ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ విడిపోవటంతో ఆయన తెలుగుదేశంకు గుడ్‌బై చెప్పి పెద్ద ఎత్తున తన అనుచరులతో కలిసి అధికార టిఆర్‌యస్ పార్టీలో చేరారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తుమ్మలకు ఉన్న స్నేహంతో మంత్రి వర్గంలోకి తీసుకుని అత్యంత కీలకమైన రోడ్లభవనాలు , ,స్త్రీశిశుసంక్షేమం శాఖలను అప్పగించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత ఆరునెలల లోపు ఎదో ఒక సభలో సభ్యుడుగా ఉండాల్సిన తప్పనిసరి పరిస్దితి రావటంతో ఎమ్మెల్యేల కోటానుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైయ్యారు. ఎమ్మెల్సీగా ఉండటం ఇష్టలేని తుమ్మలకు పాలేరు నుంచి గెలుపొందిన మాజీమంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి మరణంతో జరిగిన ఉప ఎన్నిక కలిసొచ్చింది. పాలేరు ఉప ఎన్నికల్లో పోటిచేసిన తుమ్మల ప్రచారంలో డజను మంది మంత్రులు , రెండు డజన్ల మంది ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు ,ఎంపిలు జడ్పీచైర్మన్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఒక రకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి మినహ రాష్ట్ర క్యాబినెట్ అంతా ఎన్నికల రంగంలోకి దిగింది. విచ్చలవిడిగా నియోజకవర్గంలో డబ్బు, మద్యం ఏరులైపారిందనే విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ నుంచి రాంరెడ్డి వెంకటరెడ్డి సతీమణిని బరిలో దించారు. రాజకీయ అనుభంలేని మహిళపై మంత్రి పదవికి రాజీనామా చేయకుండానే బరిలోకి దిగిన తుమ్మల విజయం సాధించారు. 2009లో ఖమ్మంలో గెలిచినప్పుడు మినహ ఆయన గెలిచినప్పుడల్లా తన పార్టీ అదికారంలోకి వచ్చింది. ఆయనకు మంచి ఆవకాశాలు వచ్చాయి తెలుగుదేశం హాయంలో గాని అనంతరం తెలంగాణ ఎర్పడిన తరువాత కేసీఆర్ మంత్రి వర్గంలోగాని మంచి ఆవకాశాలు వచ్చాయి. జిల్లాలో 14 సంవత్సరాలు సుదీర్ఘకాలం మంత్రిగా చేసిన గౌరవం ఆయనకు దక్కింది. ఇది ఒక రికార్డు. తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పటికి ఆయన తెలంగాణ ఎర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ మంత్రివర్గంలోనే తన సత్తాచాటుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. తనకు వచ్చిన ఆవకాశంతో పాలేరు నియోజకవర్గంలో నిధులు వరదలా పారిస్తున్నారు. తనదైన శైలిలో అభివృద్దిని పరుగులు పెట్టిస్తున్నారు. పెద్దరోడ్లతో నియోజకవర్గ రూపురేఖలనే మార్చుతున్నారు. ప్రతి గ్రామానికి లింకు రోడ్డు వేయించటంతో పాటు వాటిని వెడల్పుగా చేసేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగి పరిశీలిస్తున్నారు. దశబ్దాలుగా కరువు పిడిత మండలంగా ఉన్న తిర్మలాయపాలెంను సశ్యశ్యామలం చేసేందుకు నడంబిగించారు. అందులో భాగంగానే పాలేరు నీటిని భక్తరామదాసు ద్వారా తిర్మలాయపాలెంకు మళ్ళించారు. అయితే దీనిపై విమర్శలు కూడా ఉన్నాయి. పాలేరు చెరువు నుంచి పాత కాలవ ద్వారా కూసుమంచి నేలకొండపల్లి మండలాల్లోని రైతులకు సాగునీరు అందాల్సి ఉండగా భక్తరామదాసు వల్ల పాలేరు నీటిని తిర్మలాయపాలెంకు తరలించటం వల్ల తమకు నష్టకలుగుతుందనే అభిప్రాయంతో రైతులు ఉన్నారు. 2.5 టియంసిల క్యాపాసిటి ఉన్న పాలేరు రిజర్వ్యయర్‌నుంచి 12.5 టియంసిల నీరు వాడుకునేలా పథకాలు రూపొందిచారనే విమర్శలు ఉన్నాయి. గతంలో సత్తుపల్లి నియోజకవర్గంలో ఎన్టీఆర్ కాలువను ఎన్నికలకు ముందు ఇదే విధంగా తవ్వినీరు కూడా పారించారు. మర్లకుంట విందు వివాదం ఈ కాలువ ప్రారంభం సందర్బంగానే జరిగింది. తెలుగురాష్ట్రాల్లో నీటిరంగం మీద పూర్తి అవగాహన ఉన్న కొద్దిమందిలో ఆయన ఒకరు. అయితే నీటి సోర్సు పెరగాల్సిన మాట వాస్తవమే అయినప్పటికి రేపు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని పాలేరు రిజర్వయర్‌ను నింపి అక్కడ నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని రైతులకు రెండు పంటలకు సమృద్దిగా నీరు ఖమ్మం నగరానికి మంచినీరు అందించే ఏర్పాటు చేసినట్లు మంత్రి చెబుతున్నారు. పాలేరు రిజర్వయర్ సామర్ధ్యం పెరగాల్సి ఉంది. సీతారామ నీరు రాకుండానే తిర్మలాయపాలెంకు నీటి కేటాయింపులు ఏలా చేశారనే ప్రశ్నలకు జవాబు దొరకాల్సి ఉంది. ఎన్నికల కోసం లేదా ప్రజల మెప్పుకోసం తాత్కాలికంగా చేసినపనుల వల్ల దీర్ఘకాలిక నష్టాలు ఉంటాయనే సంగతి మంత్రికి తెలియంది కాదు. ఇప్పటికే సత్తుపల్లి నియోజకవర్గంలో బేతుపల్లి చెరువు ద్వారా వేంసూరు మండలం వరకు నీరు తరలించేందుకు తుమ్మల హయంలో తీసిన కాలువ గత చరిత్రకు ఆనవాళ్ళుగా మిగిలింది. కోట్లాది రూపాయాలు ప్రజాధనం దుర్వినియోగం అయింది. చేసే పనులు నాలుగు కాలాల పాటు శాశ్వితంగా ఉండేందుకు ప్రజాధనంతో చేస్తున్నందున తమ ఇంట్లో డబ్బులు పెట్టడంలేదని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఒక వేళ ఎవరైనా ప్రశ్నిస్తే బుకాయించటం, దాన్ని బైపాస్ చేయటం కాకుండా బాధ్యతగా వ్యవహరిస్తే ప్రజల మనస్సుల్లో కలకాలం గుర్తిండిపోతారు. లేకపోతే ఎన్నిచేసినా ప్రజల మనుస్సుల్లో గ్రాఫ్ పడిపోవటం ఖాయం.

## ఉమ్మడి రాష్ట్రంలో దేవాలయాలను పట్టించుకోలేదు : మంత్రి ఐకె రెడ్డి



జగిత్యాల, మేజర్‌న్యూస్: ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధి జరగలేదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ చొరవతో దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఆదివారం ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... యాదాద్రి, భద్రాచలం, వేములవాడ దేవాలయాలతో పాటు కొండగట్టులోని ఆంజనేయస్వామి దేవాలయానికి కొత్త శోభను తీసుకొస్తామని ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. గత పాలకులు దేవాలయాలను పట్టించుకోలేదన్నారు. మంత్రి వెంట కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బొడిగ శోభ తదితరులున్నారు.

## ప్రత్యేక హెూదాకోసం పోరాడేది వైసీపీయే


### ఎంపీ వరప్రసాద్



చిత్తూరు, మేజర్‌న్యూస్: వైసీపీ ఒక్కటే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా కోసం అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ ఎంపీ వరప్రసాద్ అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకహోదా కోసం పోరాడుతామని, కేంద్రం నుంచి ప్రకటన రాకుంటే ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ప్రత్యేక హోదా ఒక్కటే మార్గం అని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ ప్రయోజనాలపై తెలుగుదేశానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే తమతోపాటు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలుగుదేశం ఎంపీలు ఏపీ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు ఊసరవెల్లిలా రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, ప్రస్తుతం బాబు మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని వరప్రసాద్ పేర్కొన్నారు.

## హామీలన్నీ బూటకమని తెలిసిపోయింది

### వైసీపీ నేత సురేష్‌బాబు



కడప, మేజర్‌న్యూస్: నువ్వు ఇచ్చిన హామీలన్నీ పచ్చి బూటకమని ప్రజలకు తెలిసిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి వైసీపీ కడప పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్ బాబు విమర్శించారు. కడపలో విలేకరులతో మాట్లాడుతూ అందరికి భరోసా ఇస్తూ జగన్ ముందుకు వెళ్తున్నాడని అన్నారు. కేవలం పత్రికల్లో చంద్రబాబు ప్రచారం తప్ప రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని అభిప్రాయపడ్డాడు. నిధులపై బీజేపీ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సినీ నటుడు పవన్ కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని హోదా నాటకం ఆడుతున్నాడని ధ్వజమెత్తారు. హోదా కోసం పోరాడిన, పోరాడుతున్న ఏకైక నాయకుడు జగన్ అని అన్నారు. ఎందాకైనా హోదా కోసం జగన్ వెన్నంటి నడుస్తామని చెప్పారు. నలభై ఏళ్ల అనుభవశాలి అంటూ పొగడ్తల వర్షం తనపై కురుపించుకుంటూ మరో పక్క జగన్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నాడని చంద్రబాబుపై మండిపడ్డారు.

నిన్నటి వరకు కేంద్రం మనకు ఎక్కువ నిధులు ఇస్తుందంటూ ప్రచారం చేసిన బాబు ఇప్పుడు యూటర్న్ తీసుకుని ప్రత్యేక హోదా కావాలంటూ ప్లేట్ ఫిరాయించాడని ఆరోపించారు.

# ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానీకరించాలి

**ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు**



రాజేంద్రనగర్, మేజర్‌న్యూస్ : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానీకరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన దక్షిణ తెలంగాణ రైతు సమన్వయ సమితుల సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానించాలని ప్రధానికి లేఖ సైతం రాసినట్లు గుర్తు చేశారు. వైల్డ్‌ఫ్రూట్స్ చెట్లను పెంచుతున్నామన్నారు. భవిష్యత్తు తరాల కోసం ఆలోచించి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీశాఖ సహకారంతో కోతులు, అడవి పందుల బెడద తగ్గిస్తామన్నారు. సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా రైతు సమన్వయ సమితికి తెలియజేయాలన్నారు. మార్కెట్ తెచ్చే ధాన్యంలో తేమశాతం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులంతా ఐక్యంగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్నారు. పంటను ఒకే సారి మార్కెట్‌కు తరలించకుండా చూసుకోవాలన్నారు. ప్రతిగ్రామ రైతులకు ఒక నిర్ణీత రోజు సమయం కేటాయించాలన్నారు. వచ్చే వర్షాకాలపు పంట ఒక్క గింజ కూడా కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మనివ్వొద్దన్నారు. గిట్టుబాటు ధర రావాలంటే రైతుల చేతుల్లోనే ఉంటుందన్నారు. నిమిషాలలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెక్కుల పంపిణీలో క్రమశిక్షణ పాటించిన గ్రామాల రైతులను ఇజ్రాయెల్ పంపేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. స్థానికంగా ఎక్కడ ఏ పంటలు పండుతాయో అక్కడ వాటికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు 75 శాతం సబ్సిడీ తో టార్పాలిన్లను ఇస్తామన్నారు. అంకాపూర్ గ్రామాన్ని సమన్వయ సమితి సభ్యులంతా సందర్శించారు. అనంతరం మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏడాదిలో గోదాముల సామర్థ్యం పెంచామని రాష్ట్ర మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ రూ.వెయ్యి కోట్లతో గోదాంలు నిర్మించామని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 4 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో ఒక గోదాం నిర్మించామన్నారు. కొన్ని చోట్ల పట్టణానికి మధ్యలో కొన్ని గోదాంలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం స్థలం చూపిస్తే వాటి స్థానంలో మరింత విశాలంగా కొత్త వసతులతో కొత్త సాంకేతికతతో నూతన గోదాంలను నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. అనంతరం సమితుల కోసం ఎకరం స్థలం, నగదును విరాళంగా ఇచ్చిన రైతులను వేదికపై సీఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చీఫ్ విప్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌కు విచ్చేసిన అగా ఖాన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: షియా ఇమామీ ఇస్మాయిలీ ముస్లింల 49వ వారసత్వ ఇమామ్‌గా బాధ్యతలు చేపట్టి 60ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ వేడుకలల్లో పాల్గొనేందుకు తమ ఇమామత్‌తో సుదీర్ఘ కాలంగా సన్నిహిత సంబంధాలున్న దేశాధినేతల ఆహ్వానాన్ని మన్నించి అగా ఖాన్ వివిధ దేశాలు పర్యటిస్తున్నారు. అందులో భాగంగా నేటి నుంచి ఫిబ్రవరి 28వరకు హైదరాబాద్ నగరంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీతో సమావేశం కానున్నారు.


# భూ అక్రమణలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయం నుంచి తప్పుకుంటా



విజయవాడ,సూర్యబ్యూరో: తన అనుచరుడైన మాగంటి బాబును పార్టీకి దూరంగా పెట్టామని, అవసరమైతే పార్టీ సభ్యత్వం రద్దు చేస్తామని ఎమ్మెల్యే బోండా ఉమా చెప్పారు. ఉమాపై వచ్చిన భూ కబ్జా ఆరోపణలను ఆయన ఖండించారు. భూ ఆక్రమణలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక తనపై కక్షపూరితంగా కుట్ర పన్నా రని, పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్‌కు లేఖ రాశానని తెలిపారు. భూ కబ్జాలపై బహిరంగ చర్చకు సిద్ధమని, అనుచరులు తప్పు చేస్తే ఆ బాధ్యత తనది కాదన్నారు. విజయవాడ మధ్య నియోజకవర్గం పరిధిలో తాను ఒక్క గజం స్థలం ఆక్రమించుకున్నట్లు నిరూపించినా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అధికార పార్టీ ఎమ్మెల్యే బోండా ఉమ స్పష్టం చేశారు. స్వాత ంత్ర సమరయోధులకు చెందిన భూమితో పాటు పలుచోట్ల తాను భూ కబ్జాల కు పాల్పడినట్లు వస్తోన్న ఆరోపణలు అవాస్తవమని అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకే కొందరు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యే, అతని అనుచరులు తమ భూములు ఆక్రమించారంటూ– పలువురు బాధితులు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న తరుణంలో బోండా ఉమ మీడియా ముందుకొచ్చి వివరణ ఇచ్చారు

## శ్రీవారి సేవలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి



తిరుమల,సూర్యబ్యూరో: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి న్యాయమూర్తి ఆలయానికి చేరుకున్నారు. న్యాయమూర్తికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శ నానంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అధికారులు ఆయనకు అందజేశారు.


# జీఎస్టీ ఎఫెక్ట్... భారీగా పెరగిన ప్రవేశ పరీక్షల ఫీజులు

- స్కూల్, కాలేజీ విద్యార్థుల నుంచి జీఎస్టీ పేరిట అదనపు వసూళ్లు
- జీఎస్టీ పేరిట అదనపు ఫీజులు చెల్లించేందుకు నిరాకరిస్తున్న తల్లిదండ్రులు
- జీఎస్టీ మొత్తాన్ని చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల నిరాకరణ
- వచ్చే ఏడాది నుంచి కచ్చితంగా వసూలు చేస్తామంటున్న విద్యా సంస్థల నిర్వాహకులు




హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఉన్నత చదువుల కోసం విద్యార్థులు ప్రతి ఏటా రాసే ప్రవేశ పరీక్షల దరఖాస్తుల ఫీజులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది నుంచి అటు పాఠశాలల ఫీజులు, ఇటు పోటీ పరీక్షల ఫీజులు పెరుగనున్నాయని విద్యాసంస్థల నిర్వాహకులు చెబుతున్నారు. దానికి గతేడాది నుంచి అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కారణమని పేర్కొంటున్నారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు జీఎస్టీతో కలిపి ఫీజులు వసూలు చేస్తున్నాయి. జీఎస్టీ తామేందుకు చెల్లిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాసంస్థల నిర్వాహకులకు వాగ్వివాదానికి దిగిన సంఘటనలు లేకపోలేదు. దీంతో వచ్చే ఏడాది నుంచి స్కూల్, కాలేజీ ఫీజులతోపాటు జీఎస్టీ అదనంగా చెల్లించేవిధంగా నిబంధనలు తీసుకురావాలని విద్యాసంస్థల నిర్వాహకులు భావిస్తున్నారు. ఇక పోటీ పరీక్షలకు చెల్లించే ఫీజులకు ఇప్పటికే జీఎస్టీని వసూలు చేస్తున్నారు. గతంలో వసూలు చేసిన ఫీజులతో పోలిస్తే, ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు పరిశీలిస్తే ఇట్టే అర్ధమవుతుందంటున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయిలలో నిర్వహించే ప్రవేశ పరీక్షలకు తోడు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల దరఖాస్తుల ఫీజులు గతేడాదితో పోల్చితే ప్రస్తుతం భారీగా పెరిగినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. గతంలో ప్రవేశ పరీక్షల నిర్వహణను ప్రభుత్వమే ఆయా విశ్వవిద్యాలయాలకు అప్పగించేది. అవి పరీక్షలను రాత పూర్వకంగా నిర్వహించేవి. ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తరువాత అన్ని పోటీ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. ఈ నిర్వహణను ప్రభుత్వం వివిధ కోర్సులను నిర్వహించే ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తోంది. దీంతో వారు వారికి అనుకూలంగా ఫీజులను పెంచుతున్నారు. దానికి కారణం జీఎస్టీ అని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది పోటీ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి ఉన్నత విద్యామండలి టీసీఎస్ కంపెనీకి అప్పగించినట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ఆసంస్థ ఒక్కో విద్యార్థి నుంచి రూ.420ల చొప్పున అదనంగా వసూలు చేస్తోంది. దీనికి జీఎస్టీ 18 శాతం అంటే రూ.63 ప్రతి విద్యార్థి అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా ఉన్నత విద్యామండలి నిర్వహించే అన్ని పరీక్షలకు కనీస రుసుము రూ.400గా నిర్ణయించింది. ఇప్పటి వరకు కనీస పరీక్ష ఫీజు రూ.200గా ఉండేది. మరో వైపు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే(ఐసెట్)కు గత ఏడాది జనరల్ కేటగిరీలో ఫీజు రూ.350 ఉండగా, ఈసారి రూ.650కి, ఎస్సీ, ఎస్టీలకు రూ.250 ఉండగా రూ.450కి పెంచారు. ఇవే కాకుండా ఎంసెట్ , నీట్, ఎడ్‌సెట్, పీజీ సెట్, లా సెట్, ఈ సెట్‌లతో పాటు జాతీయ స్థాయిలో జరిగే అన్ని పోటీ పరీక్షల ఫీజులు భారీగా పెరుగను న్నట్లు తెలుస్తోంది. పెరిగిన ఫీజలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

## శ్రీదేవి మృతి : తిరుపతిలో విషాదఛాయలు



తిరుపతి,సూర్యబ్యూరో: అందాల నటి శ్రీదేవి హఠాన్మరణం అందరినీ విషాదంలోకి నెట్టేసింది. చిన్నతనం నుంచే సినిమాలే లోకంగా బతికిన శ్రీదేవి ఇక లేరన్న వార్త కోట్లాది అభిమానులు సహా అందరినీ కలచివేస్తోంది. తిరుపతి నగరంతో ఆమెకు మంచి అనుబంధముంది. శ్రీదేవి పూర్వీకులు ఇక్కడి నుంచే తమిళనాడుకు వలస వెళ్లారు. శ్రీదేవి దగ్గరి బంధువులు ఇప్పటికీ తిరుపతి నగరంలో నివసిస్తున్నారు. శ్రీదేవి హఠాన్మరణం చెందారన్న వార్త తెలియటంతో పద్మావతిపురంలో నివాసమంటున్న ఆమె కుటుంబసభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. శ్రీదేవి తల్లి రాజేశ్వరి మరణించిన తర్వాత ఆమె ఆలనా పాలనా చూసిన పినతల్లులు అనసూయమ్మ, మునిసుబ్బమ్మ విషాదంలో మునిగిపోయారు. శ్రీదేవి తిరుపతి వచ్చినప్పుడల్లా తమ ఇంటికి వచ్చి పలకరించేదని ఈ సంవత్సరం వచ్చినప్పుడు కలుస్తానని మాటిచ్చి కానరాని లోకాలకు వెళ్లిపోయిందంటూ వారు కన్నీరుమున్నీరవుతున్నారు. సినిమాల మీద ప్రేమ తప్ప మరో వ్యాపకం లేకుండా శ్రీదేవి కష్టపడేదని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు.

## ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం సమరశీల పోరాటం : సిపిఐ

విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకోసం సమరశీల పోరాటాలు కొనసాగిస్తామని, ఈ క్రమంలో ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు బందరు రోడ్డులోని రేడియో స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టి ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తామని సిపిఐ నగర కార్యదర్శి, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి నగర కన్వీనర్ దోనేపూడి శంకర్ వెల్లడించారు. ఈ మేరకు నేడొక ప్రకటన చేస్తూ రాష్ట్రానికి హోదా కల్పిస్తే పరిశ్రమలు ఏర్పడి తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విభజన హామీల చట్టంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని, ఎ.పి.కి రైల్వే జోన్ ఇస్తామని ప్రకటించిన బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో ఏఒక్క అంశాన్ని ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. జాతీయ హోదా కల్పించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించక పోవడం అన్యాయమన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి నయా పైసా రాల్చక పోవడాన్ని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ఆరంభించింది కమ్యూనిస్టు పార్టీయేనని, నేడు ఈఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి రావటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. హోదా విషయంలో మాటమార్చి రాష్ట్ర ప్రజలను నిట్టనిలువునా దగాచేసిన మోడీ దిష్టి బొమ్మ దహనం చేయటం ద్వారా బిజెపికి హెచ్చరిక జారీ చేయనున్నామని తెలిపారు.



### అమరజీవి సాక్షిగా

# చెన్నైలో ప్రత్యేక హోదా నినాదం

- తెలుగు, తమిళుల మద్దతు కోరిన ఎపిజెఎఫ్
- చెన్నైలో తెలుగువారు, తమిళులతో ప్రత్యేక సమావేశం
- 'హోదా' ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి

చెన్నై, మేజర్‌న్యూస్: అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షతో ఆత్మార్పణ చేసిన పవిత్ర స్థలంలో (ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టల ఫోరం) కీలక సమావేశం ఆదివారం నిర్వహించింది. చెన్నైలో తెలుగువారు తమిళులు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఎపిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెవుల కృష్ణాంజనేయులు కోరారు. చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెన్నై ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో క ష్ణాంజనేయులు మాట్లాడారు. ఎపిజెఎఫ్‌కు మద్దతుగా ఆమ్ ఆద్మీ పార్టీ తమిళనాడు రాష్ట్ర కన్వీనర్ వశీకరణ్, అన్న హజారే బ ంద సభ్యులు శివరామ్, తమిళ చిన్న పత్రికల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రాజా, ఆంధ్రప్రదేశ్ అభివ ద్ధి పోరాట సమితి నాయకులు రాజిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టల ఫోరం చిత్తూరు జిల్లా అధ్యక్షులు హరిబాబు, గుంటూరు జిల్లా ఎపిజెఎఫ్ నాయకులు మారుతిరావు, సూర్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని, ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్టును యదాతథంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం (ఏపీజేఎఫ్) డిమాండ్ చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల న్యాయమైన ఈ డిమాండ్లలకు తమిళనాడులోని తెలుగువారు, తమిళుల మద్దతు కోరుతున్నాము. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాల విషయంలో కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ పాలకులు వివక్ష చూపుతున్నారనే విమర్శలున్నాయి. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు తమిళనాడు ప్రజల సహకారం కోరుతున్నాము. ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీల అమలు, కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ఎపి జర్నలిస్టుల ఫోరం సుదీర్ఘ పోరాటం చేస్తోంది. మా పోరాటానికి సంఘీభావం కోరుతూ తమిళనాడు ప్రజలను విజ్ఞప్తి చేస్తున్నాం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని యుపిఎ ప్రభుత్వం రాజకీయ కారణాలతో విభజించింది. రాజధాని లేని రాష్ట్రం, 16,500 కోట్ల రూపాయల లోటు బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్ అవశేష రాష్ట్రంగా మిగిలింది. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టాన్ని పూడ్చాలి అంటే ప్రత్యేక తరగతి హోదా ఒక్కటే మార్గమని గత యుపిఎ పాలకులు భావించారు. అందుకు అనుగుణంగానే అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా ఎపికి ప్రత్యేక హోదా ప్రకటిస్తూ హామీ ఇచ్చారు. ప్రత్యేక హోదా ఐదేళ్ళు సరిపోదు.. పదేళ్ళు ఇవ్వాలని అప్పటి ప్రతిపక్ష పార్టీ బిజెపి డిమాండ్గ చేసింది. ప్రధాన మంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల సభల్లోనూ ప్రత్యేక హామీ ఇచ్చియున్నారు. బిజెపి మ్యానిఫెస్టోలో కూడా ప్రత్యేక హోదా అంశాన్ని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అనేక సాకులు చూపుతూ ప్రత్యేక హోదా ప్రకటించలేదు. దాని స్థానంలో అదనంగా నిధులు వచ్చేలా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని కేంద్రం ప్రకటించినా ఇంత వరకు ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించలేదు. ప్యాకేజీకి అనుగుణంగా నిధులు కూడా ఇవ్వలేదు. దీంతో సీమాంధ్ర ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇటీవలే ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కూడా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగింది. విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల ప్రస్తావన కేంద్ర బడ్జెట్‌లో లేదు. 2014-15వ సంవత్సరానికి రూ. 16,500 కోట్ల రెవెన్యూ లోటుకు గాను ఇప్పటి వరకు ఇచ్చింది రూ. 3,979 కోట్లు మ్రాత్రమే. రాజధాని అమరావతిలో పరిపాలనా భవనాల నిర్మాణానికి రూ. 11,500 కోట్లు అవసరం వుండగా,




కేవలం రూ. 2,500 కోట్లు మ్రాత్రమే ఇప్పటి వరకు ఇచ్చారు. రాజధానికి రైల్వేలైను సర్వే పూర్తయినా పైసా కూడా కేటాయించలేదు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. ఇప్పటి వరకు పోలవరం నిర్మాణానికి రూ. 7వేల కోట్లు ఖర్చయితే, కేంద్రం ఇచ్చింది మ్రాతం రూ. 5వేల కోట్లే. విశాఖ-విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుకు, రాయలసీమ - ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాలకు విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రత్యేక రైల్వేజోన్, దుగ్గరాజపట్నం పోర్టు, కడప ఉక్కు పరిశ్రమ తక్షణమే ప్రకటించాలని సీమాంధ్ర ప్రజలు కోరుతున్నారు. సీమాంధ్ర ప్రజలకు మద్దతు నివ్వాలని తమిళనాడు ప్రజలను సవినయంగా ఎపి జర్నలిస్టల ఫోరం విజ్ఞప్తి చేస్తోంది.

# చట్టం సవరణకు ఎందుకు ప్రయత్నించలేదు


### కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్

విజయవాడ, సూర్య బ్యూరో : విభజన చట్టం సరిగ్గాలేదని విమర్శలు చేసే ఏపి సీఎం చంద్రబాబు నాయుడు చట్టాన్ని సవరణ చేసేందుకు నాలుగేళ్లుగా ఎందుకు ప్రయత్నించలేదన్నారు కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ పిసి. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు ఏం చేశాయి? వేంకటేశ్వరుడి సన్నిధిలో మోడీ ఇచ్చిన హోదా హామీ ఏమయ్యిందన్నారు. విభజన చట్టంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని అప్పటి ప్రధాని మన్మోహన్ స్పష్టంగా చెప్పారు. మేం అధికారంలోకి వస్తే పదేళ్లు హోదా ఇస్తామని చెప్పిన వెంకయ్య ఇవుడు ఏం అంటారు? 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా వద్దు అని చెప్పిందని కేంద్రం చెబుతున్న మాట పచ్చి అబద్ధం, ఆర్థిక సంఘం అలా చెప్పలేదన్నారు. కేంద్రం అసత్యాలు చెబుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలలు చంద్రబాబు నిద్రపోయారా, కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లే హోదా లేదు అంటే చంద్రబాబు నిద్రలేచారు అన్నారు. 11 రాష్ట్రాలు ప్రత్యేక హోదా అనుభవిస్తుంటే ఏపీకి 12 రాష్ట్రంగా ఉండటానికి



మోదీ అభ్యంతరం ఏంటి? పోలవరం కేంద్రం కట్టాలని ఉంటే రాష్ట్రం ఎందుకు కడుతోంది...కేంద్రం ఎందుకు దీన్ని వదిలేసింది? పోలవరానికి విభజన చట్టంలో ప్రత్యేక స్థానం ఉంది దాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని ఆశాస్త్రీయంగా విభజన చేసారని చెబుతున్న బాబు ఎందుకు సవరణ చేయటం లేదన్నారు. సవరణకు ప్రయత్నిస్తే పార్లమెంట్ లో టీడీపీకి మేము సపోర్ట్ చేస్తాం? రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చంద్రబాబు లాలీపాప్ మాదిరి చూస్తున్నారన్నారు. మోడీ, చంద్రబాబు వల్ల ఏపీకి ఏలాంటి ప్రయోజనం జరగలేదు. నాలుగేళ్ళ వైఫల్యాలను కప్పి వుచ్చుటానికే టీడీపీ కొత్త డ్రామాలు ఆడుతోందన్నారు. 2019లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తాం. మొదటి సంతకం ఏపీకి హోదా పైనే అన్నారు. పార్లమెంట్లో చంద్రబాబు మోడీతో కలిసి మ్యాచ్ ఫిక్సింగ్‌కి పాల్పడ్డాడన్నారు. చంద్రబాబు దుబాయ్‌లో ఉండి పార్లమెంట్‌లో ఎంపీలను ఆడిస్తున్నాడన్నారు. పార్లమెంట్‌లో టీడీపీ చేసేది ముమ్మాటికి డ్రామానే అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జేడిశీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వల్లీ, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, పిసిసి ప్రధాన కార్యదర్శులు జంగాగౌతమ్, మీసాల రాజేశ్వరరావు, అధికార ప్రతినిధి కె.శివాజి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు సుంకర పద్మశ్రీ, కార్యదర్శులు తోట సాంభశివరావు, నాయకులు కిరణ్, కె.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పర్యాటక రేవును పరిశీలించిన మంత్రి దేవినేని



విజయవాడ, సూర్య బ్యూరో : స్థానికంగా పర్యాటక శాఖ ఏర్పాటుచేసిన పర్యాటక రేవును రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి దేవినేని ఉమ ఆదివారం సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చే పర్యాటకులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. పర్యాటకులతో కొద్దిసేవు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా త్వరలో ఇక్కడ బోట్లన్నింటినీ చెంగనపల్లి రేవుకు తరలిస్తున్నట్లు మంత్రికి అధికారులు తెలిపారు. పర్యాటకులకు కావల్సిన సదుపాయాలను కల్పించాలని జిల్లా అధికారులకు మంత్రి ఆదేశించారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్య చర్చల ద్వారా పరిష్కరిస్తాం

### మంత్రి కళా వెంకట్రావు



విజయవాడ, సూర్య బ్యూరో : ఈ నెల 20వ తేదీ నుండి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకై నిరవధిక సమ్మె చేపట్టారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈరోజు రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి కళా వెంకట్రావుతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను మంత్రి దృష్టికి రామకృష్ణ తీసుకువచ్చారు. రేవు అధికారులతో మాట్లాడి, కార్మికులతో చర్చలు జరపమని చెబుతానని, చర్చల ద్వారా కాంట్రాక్ట్ కార్మికుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి కళా వెంకట్రావు హామీ ఇవ్వడం జరిగింది.

## బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



విజయవాడ, సూర్య బ్యూరో : ప్రత్యేక హోదాపై బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు బుద్దా నాగేశ్వర రావు అధ్యక్షత వహించారు. అధ్యక్షులు బుద్దా నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి బాయిన శేఖర్‌బాబు, జనసేన నాయకులు పోతిన వెంకటమహేష్, పిసిసి కార్యదర్శి పణుకు శేషూ, సిపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, కాంగ్రెస్ నాయకులు పణుకు శేషూ, సిపిఐ కార్యదర్శి దోనేపూడి శంకర్, బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్.వి.రావులు ప్రసంగిస్తూ యువకులు, విద్యార్థులు విజృంభిస్తేనే ప్రత్యేక హోదా సాధ్యపడు తుందని, విశ్వవిద్యాలయాలు, కళాశాల విద్యార్దులు మౌనంగా వుండటం ఆంధ్ర జాతికి నష్టం అని, వారికి మంచి భవిష్యత్తు, ఉద్యోగాలు రావాలంటే, ప్రత్యేక హోదా సాధించుకోవాలన్నారు. బిసి సంఘాలన్నీ కలువుకుని ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తామన్నారు. సీఎం, పీఎంలు ఇద్దరూ కూడా ప్రత్యేక హోదా రాకపోవడానికి ప్రధాన ముద్దాయిలన్నారు. పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కూడా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. అనంతరం కులాల కురుక్షేత్రం వుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి నాగేశ్వర రావు, ఈది ఎల్ల రాజారావు, సామాన్య ప్రజా పార్టీ అధ్యక్షులు కె.ఆది బాబు, బిసి నాయకులు నమ్మి అప్పారావు, బెవర నాగేశ్వరరావు, టి.శేషూ గిరిరావు, బాయిన వెంకటరావు, బిసి నాయకురాలు ధనలక్ష్మీ, భవానీ, మైనార్టీ నాయకులు షేక్ రషీబ్‌నూర్ భాషా, భటర్‌రాజ్ సంఘం నాయకులు కోటం రాజు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు నైపుణ్యాభివృద్ధికై శిక్షణ



(విశాఖపట్నం నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్ర యువతకు పెద్దఎత్తున నైవుణ్యాభివద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు 19 సంస్థలు కుదుర్చుకున్నారు. లక్షమంది నిరుద్యోగ యువతకు నైవుణ్యాభివృద్ధిలో వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అపరెల్, టెక్స్‌టైల్స్, నిర్మాణరంగం, వ్యవసాయం, ఏవియేషన్, మీడియా అండ్ల ఎంటర్‌టైన్‌మెంట్, లాజిస్టిక్స్, లైఫ్ సైన్సెస్, సెక్యూరిటీ, రిటైల్, హెల్త్‌కేర్, ఐటీ అండ్ల ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్స్, టెలికాం, ఫిషరీస్, కెపాసిటీ బిల్డింగ్, ఫార్మా, బయోటెక్నాలజీ, గ్రీన్స్ జాబ్స్, హాస్పటాలిటీ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో టాటా ట్రస్ట్, యూరప్ ఇండియా ఫౌండేషన్ ఫర్ ఎక్సలెన్స్, లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఏఎం హెచ్ ఎస్ఎస్ఈ, గ్రామ్ తరంగ్, ఎన్ఎఫ్‌డీసీ, రిటైలర్స్ అసోసియేషన్స్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేర్, ఇండియన్ టెలికాం, టీఎస్ఎస్ఈ, బీఎంఆర్ ఫౌండేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్, ఎన్ఏసీ, నెడ్ క్యాప్, సీఐఐ-కేసీపీ సుగర్స్ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నారు.

# వైభవంగా తెప్పోత్సవాలు ప్రారంభం

### తెప్పపై భక్తులకు దర్శనమిచ్చిన సీతారామలక్ష్మణులు



తిరుపతి, మేజర్‌న్యూస్ : తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, వుష్పా లతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. వుష్కరిణిలో చల్లటి సాయంత్రం వేళ స్వామివారు తెప్పపై విహరిస్తుండగా భక్తులు దర్శించు కుని పరవశించి పోయారు. ఈ సందర్భంగా టిటిడి ఈవో శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలో తెప్పోత్సవాలు ప్రాచీనకాలం నుండి జరుగుతున్నాయని తెలుస్తోందన్నారు. విజయనగర రాజైన సాళువ నరసింహరాయలు క్రీ.శ.1468లో వుష్కరిణి మధ్యలో "నీరాళి మండపాన్ని" నిర్మించి తెప్పోత్సవాలకు అనువుగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. క్రీ.శ. 15వ శతాబ్దానికి చెందిన శ్రీవారి భక్తుడు, వాగ్గేయకారుడు అయిన శ్రీ తాళ్లపాక అన్నమయ్య కూడా తిరుమల తెప్పోత్సవాలను గొప్పగా కీర్తించారని వివరిం చారు. ముందుగా సాయంత్రం 6 గంటలకు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రుని ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా వుష్కరిణి వద్దరకు చేరుకుంది. తొలిరోజు శ్రీ సీతా రామలక్ష్మణ ఆంజనేయ స్వామి వారు వుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. ఫిబ్రవరి 26న రెండో రోజైన సోమవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామివారు మూడు సార్లు విహరిస్తారు. ఫిబ్రవరి 27న మూడో రోజు శ్రీభూ సమేతంగా మలయప్ప స్వామి వారు మూడు సార్లు, ఫిబ్రవరి 28న నాలుగో రోజు ఐదుసార్లు, చివరిరోజు మార్చి 1న ఏడుసార్లు తెప్పపై వుష్కరిణిలో విహరించి భక్తులను కటాక్షిస్తారు. తెప్పోత్సవాల నేపథ్యంలో ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవ, ఫిబ్రవరి 27, 28, మార్చి 1వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టిటిడి శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, తిరుమల జెఈవో శ్రీకె.ఎస్.శ్రీనివాసరాజు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల కృషితో ఎస్ఎస్ కాలేజీలో మంచి ఫలితాలు


విజయవాడ, సూర్యబ్యూరో : అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమిష్టికృషితో తమ కళాశాల విద్యారంగంలో మంచి ఫలితాలు సాధిస్తోందని సయ్యద్ అప్పల స్వామి కళాశాల కరస్పాండెంట్ రాంపిళ్ల జయప్రకాష్ అన్నారు. ఆదివారం కళాశాలలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న తమ్మిన లక్ష్మీ నారాయణ పదవీ విరమణ అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జయప్రకాష్ మాట్లాడుతు లక్ష్మీ నారాయణ తన ఉద్యోగ జీవితంలో కళాశాలకు ఎంతో విలువైన సేవలను అందచేసారని అన్నారు. ఆయన పదవీవిరమణ చేసినా తమ కాలేజీకి సేవలందించేలా తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అలాగే తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటుగా కళా రంగానికి సంబంధించి కూడా మంచి ప్రతిభ కనబరచడం తమకు గర్వ కారణమని అన్నారు. అతితక్కువ ఫీజులతో అత్యుత్తమ విద్యను అంద చేస్తున్నామని చెప్పారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నంబూరి త్యాగరాజు మాట్లాడుతు క్ష్మీనారాయణ తన ఉద్యోగబాధ్యతలను ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఎస్ఏఎస్ విద్యాసంస్థల డైరక్టర్ పి.దేవిడ్గరాజు మాట్లాడుతు కాలేజీలో పచ్చదనం పరిశుభ్రతకు లక్ష్మీనారాయణ కృషిచేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కమిటీ సభ్యులు రాంపిళ్ల గౌరీశంకర్,



తమ్మిన మారుతీ, రామ్‌కుమార్, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్ష్మీనారాయణను దుశ్శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

## గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

### ఏపీ అబ్కారీ శాఖ మంత్రి కె.ఎస్ జవహర్




కొవ్వూరు, సూర్య ప్రతినిధి : గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆంధ్రప్రదేశ్ అబ్కారీ శాఖ మంత్రి కె.ఎస్ జవహర్ అన్నారు. ఆదివారం ధర్మవరంలో ఎన్‌టిఆర్ సుజల పథకం తాగునీటి పథకాన్ని మంత్రి జవహర్ ప్రారంభించారు. కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామ పంచాయతీలో దాత ముళ్లపూడి రాజేంద్రప్రసాద్ సహకారంతో రూ.10లక్షల వ్యయంతో ఎన్‌టిఆర్ సుజల పథక తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జవహర్ మాట్లాడుతూ శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించేందుకు దాతలు ముందుకురావడం హర్షణీయమన్నారు. అనంతరం ప్లాంట్ ప్రారంభించి గ్రామస్థులకు శుద్ధ జలాలను అందించారు.

### ఆరోపణలు నిరూపిస్తే
## రాజకీయాల నుంచి తప్పుకుంటా : బోండా



విజయవాడ, సూర్య బ్యూరో : తన అనుచరుడైన మాగంటి బాబును పార్టీకి దూరంగా పెట్టామని, అవసరమైతే పార్టీ సభ్యత్వం రద్దు చేస్తామని ఎమ్మెల్యే బోండా ఉమా చెప్పారు. ఉమాపై వచ్చిన భూ కబ్జా ఆరోపణలను ఆయన ఖండించారు. భూ ఆక్రమణలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక తనపై కక్షపూరితంగా కుట్ర పన్నారని, పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్‌కు లేఖ రాశానని తెలిపారు. భూ కబ్జాలపై బహిరంగ చర్చకు సిద్ధమని, అనుచరులు తప్పు చేస్తే ఆ బాధ్యత తనది కాదన్నారు.

## శ్రీదేవి మృతిపై సీఎం చంద్రబాబు స్పందన




(విశాఖపట్నం నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : అందాల తార శ్రీదేవి (54) గుండెపోటుతో మరణించారు. దుబాయిలో ఓ వివాహ వేడుకకి హాజరైన ఆమె.. శనివారం రాత్రి అక్కడే తుది శ్వాస విడిచారు. శ్రీదేవి మృతితో సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె మరణవార్తను విన్న అభిమానులు, సినీ ప్రముఖులు షాక్‌కు గురవుతున్నారు. శ్రీదేవి మృతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం విశాఖపట్నంలో చంద్రబాబు నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బహుభాషా నటిగా, ముఖ్యంగా తెలుగు వారికి అత్యంత ఇష్టమైన కథానాయకగా ఎదిగారని అన్నారు. అసమానమైన తన అభినయంతో దేశం గర్వించదగ్గ నటిగా నిలిచిపోయారని చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏపీకి 25 సంస్థలు పెట్టుబడులకు సిద్ధం




(విశాఖపట్నం నుంచి సూర్య ప్రత్యేక ప్రతి నిధి) : సీఐఐ భాగస్వామ్య సదస్సులో పలు ఒప్పందాలు జరిగాయి. టెక్స్‌టైల్ రంగంలో రూ. 5,137 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 25 సంస్థలు ముందుకువచ్చాయి. దీంతో 32,442 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు.

## రెండో రోజు రూ. 1,74,568 కోట్ల ఒప్పందాలు



(విశాఖపట్నం నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు రూ. 1,74,568 కోట్ల విలువైన ఒప్పందాలు, 286 అవగాహన ఒప్పందాలు జరిగాయి. మొత్తం 2,86,371 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయి. మొత్తం 8 రంగాల్లో అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రూ. 9,406 కోట్ల విలువైన 10 ఎంవోయూలు, 6 వేల మందికి ఉద్యోగావకాశాలు, టెక్స్‌టైల్స్ రంగంలో రూ. 5,337 కోట్ల విలువైన 26 ఎంవోయూలు, 33,092 మందికి ఉద్యోగావకాశాలు, ఇంధన రంగంలో రూ. 80,435 కోట్ల విలువైన 20 ఒప్పందాలు, 25,011 మందికి ఉద్యోగావకాశాలు, ఆహార శుద్ధి రంగంలో రూ. 3,534 కోట్ల విలువైన 169 ఒప్పందాలు, 48,398 మందికి ఉద్యోగావకాశాలు, వైద్యారోగ్య రంగంలో రూ. 5,090 కోట్ల విలువైన 25 ఒప్పందాలు, 4,750 మందికి ఉద్యోగావకాశాలు, మౌలిక వసతులు రంగంలో రూ. 43,486 కోట్ల విలువైన 15 ఒప్పందాలు, 1,12,020 మందికి ఉద్యోగావకాశాలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ రంగంలో రూ. 18,220 కోట్ల విలువైన 2 ఒప్పందాలు, 38 వేల మందికి ఉద్యోగావకాశాలు, పరిశ్రమల రంగంలో రూ. 9,061 కోట్ల విలువైన 19 ఒప్పందాలు, 19,100 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.

## కొరగంజి ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం



విజయవాడ, సూర్య బ్యూరో : పేద ప్రజలకు కొర గంజి ట్రస్ట్ అందచేస్తున్న సేవలు ఇతరులకు స్ఫూర్తిదా యకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. కొరగంజి శేఖర్ బాబు 72వ జయంతి వేడు కల్లో భాగంగా ఆదివారం కొత్తపేటలోని కొరగంజి ఫంక్షన్ హాల్ వద్ద ఉచిత మినరల్‌వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బుద్దా వెంకన్న మాట్లాడుతు త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగ్గరకు జగన్‌ను తీసుకువెళ్ళి ట్రస్ట్ తరువున చేస్తున్న సేవలను సీఎంకు వివరిస్తామని చెప్పారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ ట్రస్ట్ తరవున ఉచిత మంచినీటి ట్యాంకర్, చెత్త తరలింపు వాహనం, మహారాజప్రస్థాన్ వాహనాలను నిర్వహిస్తున్నతీరు అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్సీ ఎ. ఎస్. రామకృష్ణ మాట్లాడుతు జగన్ సేవాకార్యక్రమాలకు తమ తరువున అండ దండగా వుంటామని చెప్పారు. కొరగంజి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ కొరగంజి జగన్ మాట్లాడుతు 20 లీటర్ల మినరల్ వాటర్‌ను పేదలకు కేవలం రెండు రూపాయల నామమాత్ర ధరకే అందచేస్తామని చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజల ఇళ్లలో జరిగే శుభ కార్యక్రమాలకు లేదా ఇతరత్రా ఫంక్షన్‌లకు కూడా ఈ వాటర్‌ను అందచేస్తామని చెప్పారు. ధర్నాచౌక్‌లో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేసేవారికి వారు ముందుగా సంప్రదిస్తే ఉచితంగా అరలీటర్ వాటర్ బాటిళ్లను అంద చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి కొరగంజి భాను, సి ఛానల్ ఎండి. టివి. రమేష్, గోదావరి బ్యాంక్ సౌత్ ఇండియా చీఫ్ మేనేజర్ మేడూరి జగన్, మాజీ ఎమ్మెల్సీ కొల్లి నాగేశ్వర రావు, ఎస్.ఎ.ఎస్. కాలేజీ కరస్పాండెంట్ రాంపిళ్ల జయప్రకాష్, ఎపి ఫోటో ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మాదల రమేష్, చిట్టినగర్ అమ్మవారిగుడి అధ్యక్షులు పోతిన బేసుకంతేశ్వ రుడు, సలహాదారులు చొక్కర శ్రీనివాసరావు, బెవర వెంకటరమణ పాల్గొన్నారు.




# ఆంధ్రప్రదేశ్ ప్రగతికి బాటలు
# భాగస్వామ్య సదస్సులు
## పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముందుకు

**విభజన చట్టంలోని లోటు పాట్లు కారణంగా ఆర్థికంగా నష్ట పోతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా ముందుంచాలన్న లక్ష్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ఫలితం క్రమక్రమంగా లాభిస్తోంది. ఇప్పటికే పలు దేశాలలో పర్యటన జరిపిన ఆయన అక్కడి వాణిజ్య వేత్తలతోను, పారిశ్రామికవేత్తలతో పాటుగా భారతీయ సంతతికి చెందిన వారితోనూ ప్రత్యేకంగా సమావేశాలు జరుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన రాష్ట్రంలోని సహజవనరులపై ప్రచారం చేస్తూ, పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఐఐ భాగస్వామ్య సదస్సులను నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు సిఐఐ *23 ఈవెంట్లను నిర్వహిస్తే అందులో 7సదస్సులను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం గర్వకారణమనే చెప్పాలి.***

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సీఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖలో జరుగుతోంది. భాగస్వామ్య సదస్సు ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు హాజరై తొలిరోజు ప్రారంభించగా సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు అశోక్‌గజపతిరాజు, సురేష్ ప్రభు, పలువురు ప్రముఖ పారిశ్రామిక దిగ్గజకంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో11 అంశాలపై ప్లీనరీ సెషన్లను నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో 40 దేశాలకు చెందిన 2వేల మందికి ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా గత రెండు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వంతో వివిధ సంస్థలు 400 అవగాహన ఒప్పందాలకు ప్రతిపాదనలు వచ్చాయి. నేడు భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమం జరగనుంది.

ఓడరేవుల వాణిజ్యపట్టణంగా భాసిల్లుతున్న విశాఖపట్నంలో భాగస్వామ్య సదస్సు ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఆధ్వర్యంలో ఏపీ ఐఐసీ మైదానంలో జరుగుతున్న ఈ సదస్సును.. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రారంభించగా. 50 దేశాలకు చెందిన సుమారు 2500 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దాదాపు 500 మంది ఫారిన్ బిజినెస్ డిలిగేట్స్ హాజరవ్వటం విశేషం.

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీని 2022 నాటికి దేశంలో మూడో స్థానంలో... 2029 నాటికి అగ్రస్థానంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. 2050 వరకు ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ గుర్తింపుపొందడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో విభజన అవాంతరాలను ఎదుర్కొంటూ గత మూడేళ్లుగారాష్ట్రం రెండంకెల వృద్ధిరేటు సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుత సదస్సులో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, రెన్యువబుల్ ఎనర్జీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ తదితర రంగాలకు సంబంధించిన పలు ఎంఒయులను రాష్ట్రప్రభుత్వం చేసుకుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభికులతో మాట్లాడుతూ వ్యవసాయరంగంలో అద్భుత ఫలితాలు సాధించామని నేడు పరిశ్రమలు, సేవల రంగంపై దృష్టి సారించామని ఇందుకు అందరి సహకారం అవసరమని అన్నా రు. ఇప్పటికే కేంద్రం సహకారంతో ఎపిలో రెండు పారిశ్రామిక కారిడార్లను (విసిఐసి, చెన్నరు బెంగళూరు) తీసుకొచ్చేందుకు ఏర్పాటు పూర్తి చేసామని. కోస్టల్ ఎంప్లారుమెంట్ జోన్ అభివృద్ధి పూర్తయితే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య దాదాపు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని, ఈ జోన్ ద్వారా కనీసంగా 31 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రియల్ టైం గవర్నన్స్ అమలు చేస్తుండటంతో పాలనా పారదృకతకు నెలవవుతుండ టంతో పాలన కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తోందని చెప్పారు.ఆదానీ గ్రూప్ ఆధ్వర్యాన రూ.5 వేల కోట్ల పెట్టుబడితో శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు బీచ్‌ని నౌకాశ్రయంగా అభి వృద్ధి పరిచేందుకు ఒప్పందాలు పూర్తయ్యాయని, ఇది పూర్తయితే, విశాఖతో సహా దేశంలోని పోర్టు లను తలదన్నే రీతిగా ఉత్తమ నౌకా శ్రయంగా భావనపాడు తయారవుతుందని చెప్పారు.

***13 లక్షల కోట్ల పెట్టుబడులు***

గత మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంస్థలతో 1946 ఎంవోయూలు కుదుర్చుకుంది తద్వారా 13 లక్షల 54 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వివరించారు. 31 లక్షల మందికి ఉపాధి లభించిందని చంద్రబాబు తెలిపారు. పెట్టుబడులు పెట్టే వారికి అన్ని రకాల మౌళిక వసతులు కల్పించడంతో పాటు పరిశ్రమలకు దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించడం సాధ్యమైందని, ఇందుకు ఎనలేని కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రంలోని పరిస్థితులును అర్థం చేసుకుని సహకరిస్తున్న ప్రజలు అభినందనీయులని అన్నారు చంద్రబాబు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకు పోవాలన్న తన తపనకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందని, అందువల్లే ఎన్ని అడ్డంకులు ఎదురవుతున్నా, ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర భవిష్యత్ కోసం అనేక నిర్ణయాలను తీసుకుని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.



### అవకాశాల వేదిక ఆంధ్రప్రదేశ్

ఈ సదస్సుని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సరుకుల ఉత్పత్తి పెరిగితే పెద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని, అభివృద్ధికి సానుకూల ఫలితాలు ఉంటాయని అన్నారు. దేశంలో అతిపెద్ద ఆర్థికసంస్కరణగా నోట్లరద్దును ఆయన అభివర్ణించారు. నల్లధనాన్ని బ్యాంకులకు చేర్చడమే దీని ఉద్దేశ్యమని, ఆ మేరకు ఆశించిన లక్ష్యాలు వచ్చాయని తెలిపారు. నోట్ల రద్దు కారణంగా ప్రస్తుతం దేశమంతటా బ్యాంకులు వడ్డీరేట్లు గణనీయంగా 8.2 శాతానికి తగ్గించాయని తెలిపారు. ప్రపంచంలోనే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ దూసుకు పోతోందంటూ కితాబిచ్చారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గ్లోబల్ మార్కెట్లో ఇండియా ముందుందని ఐఎంఎఫ్ తాజా నివేదిక తెలువుతోందన్నారు. దేశంలోని గుజరాత్, కర్నాటక, ఉత్తర్రపదేశ్ నేడు ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్ల మీట్లకు పోటీపడుతున్నాయన్నారు పారిశ్రామిక రంగంలో అవకాశాలకు ఆంధ్రప్రదేశ్ వేదిక గా మారుతోందని చెప్పారు.

**పెట్టుబడులకు అనుకూలం ఏపి**

పెట్టుబడులకు ఏపీ అన్నివిధాలా అనుకూలంగా ఉంటుందని ఐటీ శాఖ మంత్రి లోకేష్ అన్నారు. విశాఖతో పాటు అమరావతి, రాయలసీమ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఇప్పటికే ఎన్నో కంపెనీలు రాయలసీమకు వచ్చాయని గుర్తుచేశారు. విశాఖ సదస్సులో... గూగుల్ స్టేషన్ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చింది. 30 వేల గ్రామపంచాయితీలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించేందుకు గూగుల్ అంగీకరించి ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.

**కీలకం కానున్న లులూ కన్వెన్షన్ సెంటర్**

విశాఖ సాగరతీరానికి మరో అట్రాక్షన్ రాబోతోంది. ఏషియాలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు విశాఖలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రతిష్టాత్మక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 9 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకోనున్న కన్వెన్షన్ సెంటర్ ను యుఏఈ కి చెందిన లూలూ గ్రూప్ నిర్మిస్తోంది. హోటల్స్, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన యుఏఈకి చెందిన లులూ గ్రూప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ కన్వెన్షన్ సెంటర్ కు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేయటంతో వీలున్నంత త్వరగా దీనిని పూర్తి చేసే అవకాశాలున్నట్లు కనిపిస్తోంది.ఈ కన్వన్షన్ సెంటర్ కోసం విశాఖలో 9 ఎకరాల విస్తీర్ణం గల భూమిని ప్రభుత్వం అందించింది. 700 కోట్ల పెట్టుబడితో నిర్మించే కన్వెన్షన్ సెంటర్ ను అంతర్జాతీయ స్థాయిలో కనీవినీ ఎరుగని అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్నారు. 7వేల మందితో గ్లోబల్ ఈవెంట్స్ ను నిర్వహిం చుకునేలా భారీ కన్వెన్షన్ సెంటర్ తో పాటు అత్యాధునికమైన ఫంక్షన్ హాల్స్.. ఈ కన్వెన్షన్ సెంటర్ ప్రత్యేకత.. ఇక్కడ అన్ని ఫంక్షన్లకు అనువైన అత్యాధునిక ఇంటీరియ ర్ డెకరేషన్స్ కూడా అందుబాటులో ఉంటాయి. అత్యద్భుతమైన వాతావరణంలో ఏకంగా ఈ కన్వన్షన్ సెంటర్‌లో ఏర్పాటు కానున్న 5 స్టార్ హోటల్ అదనవు అట్రాక్షన్ కాబోతోంది. విశాఖలోని ప్రస్తుత హోటళ్లను తలదన్నేలా ఈ హోటల్ ఉంటుందని లులూ వర్గాలు మీడియాకు చెప్పారు. దీనికి తోడుగా 2 స్క్రీన్ మల్టిప్లెక్స్ థియేటర్లు, ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఫ్యామిలీ ఎంటర్ టైన్ మెంట్, అమ్యూజ్ మెంట్ సెంటర్లతో నభూతో నభవిష్యత్ అన్న రీతిలో లులూ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు జరుగుతుంది. అలాగే విశాఖ ప్రజలకు అన్ని వస్తువులను ఒకే గొడుగుకిందకు తీసుకువచ్చి, కారు చౌకగా అందించేందుకు వరల్డ్ క్లాస్ షాపింగ్ మాల్ సైతం ఇందులో ఉంటుంది. అంతే కాకుండా ఆహారప్రియుల కోసం 50కి పైగా ఫుడ్ కోర్టులను ఈ సెంటర్‌లో ర్పాటు చేయనుండటం విశేషం.

కేవలం ఎంటర్ టైన్ మెంట్ కోణంలోనే కాదు.. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పూర్తతే విశాఖ చుట్టుపక్కల పదివేల మంది వరకూ ఉపాధి దొరకనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ను తాము చేపట్టడం ఆనందంగా ఉందన్న లులు గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ.. మంచి అభిరుచి గల ముఖ్యమంత్రితో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఎలా ఉండాలో ఓ ఆర్కిటెక్ లా, ఇంజినీర్ లా చంద్రబాబు తమకు వివరించారని చెప్పారు. వీలైనంత త్వరగా ఈ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

విశాఖలోఏర్పాటు చేయనున్న కన్వెన్షన్ సెంటర్ కు సముద్రతీరం అదనవు ఆకర్షణగా నిలుస్తుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు.. 30నెలలలోపే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ను పూర్తిచేయాలని చంద్రబాబు లులు ప్రతినిధులను కోరారు. ప్రాజెక్ట్ ను వీలైనంత త్వరగా పూర్తిచేసేలా ప్రభుత్వం అన్నిరకాల సహకారం అందిస్తామన్న చంద్రబాబు.. వీలైతే వచ్చే సీఐఐ సదస్సు ఈ కన్వెన్షన్ సెంటర్ లోనే జరువుదామని ఆకాంక్షించారు.




విశాఖ పట్నంలో శనివారం ప్రారంభమైన ఐసిసి సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభించిన అనంతరం సావనీర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు



జోస్ లూయిస్ కైసర్
డైరెక్టర్ జనరల్,
ఐటి, స్పెయిన్



ఫిల్ షా,
ఛీఫ్ ఎగ్జిక్యుటివ్
ఇండియా లఖీడ్ మార్టిన్స్






మయాన్ బ్రిలియంట్
ఎగ్జిక్యుటివ్ వైస్ చైర్మన్
యుఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్



జవాన్ ఫైఫ్
జనరల్ సెక్రటరీ
ఐఐసి, యుఎఇ



సమీర్ గ్రేస్
ప్రెసిడెంట్ –
సార్క్ కాసికో సిస్టమ్స్





యుయాంగ్ హ్టో
కామర్స్ డిప్యూటీ మంత్రి,
మయన్మార్



సౌమిత్ర దత్తా, డీన్
జాన్సన్స్ కాలేజ్ ఆఫ్ బిజినెస్
యుఎస్ఏ




శ్రీమతి శోభనా కామినేని
గ్రూప్ ఆఫ్ కామినేని
ఇండియా







# ఓ అకాల మరణం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది!



పూల రెక్కలు..
కొన్ని తేనె చుక్కలు
రంగరిస్తివో..
ఇలా బొమ్మ చేస్తివో..

అసలు భూలోకం
ఇలాంటి సిరి చూసి
ఉంటదా..?
కనుక
ఈ చిత్రం
స్వర్గానికి చెంది
ఉంటదా..??

కోట్లాదిమంది గుండెల్లో కొలువై ఉన్న ఒక సౌందర్యజ్యోతి అకస్మాత్తుగా కొడిగట్టుకుపోయింది. అతిలోకసుందరి శ్రీదేవి (55) కన్ను మూశారు. ఆమెకు భర్త బోనీకపూర్, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. శనివారం రాత్రి ఒక పెళ్లి వేడుకలో పాల్గొనేందుకుగాను ఆమె కుటుంబంతో కలిసి దుబాయి వెళ్లారు. అక్కడ ఆమె చాలా హుషారుగా డాన్సులు కూడా చేశారు. అయితే అంతలోనే అక్కడే ఆమెకు తీవ్రమైన గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. రాత్రి పదకొండున్నర గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు శ్రీదేవి మరిది సంజయ్ కపూర్ తెలిపారు. ఆమె మరణించిన సమయంలో భర్త బోని కపూర్ సంఘటనా స్థలంలో ఉన్నారు.

శ్రీదేవి 1963 ఆగస్టు13న తమిళనాడులోని శివకాశిలో జన్మించారు. నాలుగేళ్ల ప్రాయంలోనే బాలనటిగా రంగ ప్రవేశం చేసి, వివిధ భాషల్లో నటించి దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. 'మా నాన్న నిర్దోషి' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన శ్రీదేవి దాదాపు రెండు దశాబ్దాలు భారతీయ చిత్రసీమను తిరుగు లేని రీతిలో పరిపాలించారు.

1996లో బోనీ కపూర్‌ను వివాహం చేసుకున్న శ్రీదేవి హిందీలో 71, తెలుగులో 85, తమిళంలో 71, కన్నడలో 6, మలయాళంలో 26 చిత్రాల్లో నటించారు. 'ఇంగ్లీష్ విగ్లీ ష్' చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చిన శ్రీదేవి.. ఆ చిత్రంలో తనదైన శైలిలో అసాధారణరీతిలో నటించి, యు ట్యూబ్‌లో మాత్రమే తనను చూడాడానికి అలవాటుపడిన ఈ తరానికి నటిగా తనేంటో చాటి చెప్పారు. 2017లో చివరిగా శ్రీదేవి 'మామ్' చిత్రంలో నటించారు. శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వి కపూర్ హీరోయిన్‌గా పరిచయమవుతూ నటిస్తున్న చిత్రం ప్రస్తుతం షూటింగ్‌లో ఉంది. అందంలోనే కాకుండా నటనలో, నాట్యంలో నిష్ణాతురాలైన శ్రీదేవి.. తన కుమార్తెలకు తనకు తెలిసిన విద్యలు నేర్పించకుండానే, తన ముద్దుల కూతురును తెరపై చూసుకోకుండానే కన్ను మూయడం విచారకరం.

శ్రీదేవి మృతి పట్ల యావద్భారతం దిగ్భ్రాంతి చెందింది. భారత ప్రధాన పౌరుడు మొదలుకొని రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన లబ్ధ ప్రతిష్టులెందరో శ్రీదేవి అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు!!




## ప్రేక్షకుల గుండెల్లో ఆమె ఎప్పటికీ చిరంజీవి



శ్రీదేవి గురించి ఇలాంటి ఒక సందర్భం వస్తుందని అనుకోలేదు. ఆమె గురించి ఇలా మాట్లాడాల్సి వస్తుందని నిజంగా నేనెప్పుడూ ఊహించలేదు. ఇది దురదృష్టం. అందం అభినయం కలబోసిన నటి శ్రీదేవి. అత్యద్భుత నటి. ఇలాంటి నటి ఇంతవరకు లేరు. ఇకమీద వస్తారని కూడా నేను అనుకోవటం లేదు. నిజంగా భగవంతుడు ఆమెకు చాలా అన్యాయం చేశాడు. శ్రీదేవి హఠాన్మరణాన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. చిన్నప్పట్నుంచీ శ్రీదేవికి నటన తప్ప మరో వృత్తి లేదు. మరో ధ్యాస లేదు, మరో వ్యాపకం లేదు. ఎంతసేపూ నటన.. నటన అంటూ నటనపై తన అంకితభావాన్ని తెరమీద చూపింది. ఆమె అంకితభావం చూసి నేనెంతో నేర్చుకున్నాను. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అత్యద్భుత దృశ్యకావ్యం 'జగదేక వీరుడు అతిలోక సుందరి'. ఆ సినిమాలో దేవత పాత్రలో ఎంతగా ఒదిగిపోయిందంటే.. ఆమెకోసమే ఆ పాత్ర సృష్టించబడిందా.. ఆ పాత్ర కోసమే ఆమె పుట్టిందా అన్నంతగా నటించింది. శ్రీదేవి పాత్ర చూసిన తర్వాత ఎంతగా మెస్మరైజ్ అయిపోయామంటే.. చెప్పలేనంత. ఆ తర్వాత శ్రీదేవితో చేసిన ఆఖరి సినిమా 'ఎస్పీ పరుశరాం'. సినిమాపరంగానే కాకుండా శ్రీదేవి నాకు ఎంతో ఆత్మీయ రాలు. వారింట్లో ఏదైనా వేడుక జరిగినా, లేదా మా ఇంట్లో ఏదైనా వేడుక జరిగినా ఆత్మీయంగా కలిసి మాట్లాడేవారు. ఆమె మరణవార్తని ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నాను. ఆమె మరణవార్త వినగానే ఒక షాక్‌కి గురయ్యాను. దిగ్భ్రాంతి చెందాను. ఒక గొప్ప నటిని పోగొట్టుకోవడం, మనకు దూరమవడం భారత ప్రజలు, సినీ ప్రజలందరి దురదృష్టమని నేను భావిస్తున్నాను. శ్రీదేవి ఆత్మకి శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆఖరిసారిగా ఒక మాట చెప్పాలని ఉంది. కోట్ల మంది ప్రేక్షకుల హృదయాలను తన నటనతో ఆకట్టుకున్న శ్రీదేవి చనిపోయిందని నేను అనుకోవట్లేదు. ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో శ్రీదేవి చిరస్థాయిగా జీవించే ఉంటారు. ఈ సినిమా ప్రపంచం ఉన్నంతవరకు శ్రీదేవి బ్రతికే ఉంటుంది!!

– మెగాస్టార్ చిరంజీవి


## ఆమె స్థానం భర్తీ చేయలేనిది!

–నూకారపు సూర్యప్రకాశరావు

అతిలోకసుందరి శ్రీదేవి అకాల మృతి పట్ల ప్రముఖ నిర్మాత, సూర్య పత్రికాధినేత నూకారపు సూర్యప్రకాశరావు తీవ్ర విచారం వెలిబుచ్చారు. శ్రీదేవి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని పేర్కొన్న నూకారపు.. శ్రీదేవి, ఆమె భర్త బోనీకపూర్‌లతో తనకు గల సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు!!



## అందానికి-అభినయానికి దేవత శ్రీదేవి



ఆమె ఒక భూలోక తార
ఆమెది చందమామని మించిన అందం
అందమైన అమ్మాయిని తనతో కాకుండా
ఆమెతో పోల్చుతుంటే చందమామ
అలిగేవాడు!
ఇప్పుడు ఆ తార ఎగిరిపోయింది–
చందమామకి కూడా కనపడనంత పైకి!
దేవుడు అస్సలు అర్థం కాడు...
54 ఏళ్లకే ఆగిపోయే గుండెని
ఆమెకు పెట్టాడు!
ప్రశాంతంగా నిద్రపోయిన
ఎందరినో నిద్రలేవగానే భయపెట్టాడు!
ఆమెకి సునాయాస మరణం ఇచ్చాడు
కోట్లాదిమందిని భయంతో కుదిపేశాడు!
ఎప్పుడో పాతికేళ్ల తర్వాత జరగాల్సినదాన్ని
అప్పుడే జరిపించేశాడు!
అయితేనేం?
బ్రతికుండగానే ఆమెకు
కోట్లాదిమంది తమ
హృదయాల్లో గుళ్లు కట్టారు!
కేవలం ఆమె అందానికే కాదు–
ఆమెలోని కళాదేవతకి..
ఆమెలోని అమాయకపు నవ్వుకి
ఆమెలోని హుందాతనానికి
ఆమెలోని అలౌకిక తేజస్సుకి..!!
ఆమె సశరీరంగా లేకపోతేనేం?
ఈ గడ్డ మీద
చదువుకి సరస్వతి
సంపదకి లక్ష్మి
శక్తికి పార్వతి లాగ
అందానికి, అభినయానికి దేవత–
శ్రీదేవి... !!!

– సిరాశ్రీ





## న్యూస్ రాంగ్ అవ్వాలనిపించింది



జర్నలిస్ట్‌గా ఏదైనా రాంగ్ న్యూస్ రాసినప్పుడు ఎంతో బాధపడతాం, కానీ మొదటిసారి శ్రీదేవి ఇక లేరనే న్యూసే రాంగ్ అవ్వాలనిపించింది.

'భోగభాగ్యాలు' నుండి 'మామ్' వరకు ఈ 37 ఏళ్ళ ప్రయాణంలో ఎన్నో మరపురాని సంఘటనలు కళ్ళ ముందు కదలాడుతున్నాయి. మొన్నటికి మొన్న 'మామ్' ప్రమోషన్ కోసం హైదరాబాద్ వచ్చినప్పుడు ఎంతో అభిమానంగా, ఆప్యాయంగా మాట్లాడుతూ చెదరని చిరునవ్వుతో కళకళలాడుతూ కనిపించిన శ్రీదేవి ఇక లేరంటే ఎలా నమ్మగలను? నేనే కాదు ఎవరూ నమ్మలేకపోతున్నారు!!

–బి.ఎ.రాజు,
సీనియర్ ఫిలిం జర్నలిస్ట్–నిర్మాత





## రాహుల్ అబద్ధాలకోరు : అమిత్‌షా

బీదర్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా నిప్పులు చెరిగారు. పారిశ్రామిక వేత్తల రుణాలను కేంద్రప్రభుత్వం మాఫీ చేసిందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడంపై ఆయన మండిపడ్డారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ... భాజపా ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఇందులో భాగంగానే వారి రుణాలన్నింటినీ మాఫీ చేసిందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ ఆధారం లేని మాటలు ప్రజలు నమ్మరు. భాజపా ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుంది. రాహుల్ అబద్ధాలు చెప్తున్నారు. వీటన్నింటినీ నిరూపించాలి. వీటికి సమాధానం చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రైతులంతా సమష్టిగా వారికి క్షమాపణలు కోరుతానుఅని అన్నారు. 11,400కోట్ల రుపాయలు ఎగవేతకు పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. భాజపా ప్రభుత్వం దొంగలకు రక్షణ కల్పించే బాధ్యత తీసుకుంటోందన్న రాహుల్ మాటల్లో ఎంత మాత్రం నిజంలేదు. పర్యవేక్షణ లోపించిందని విమర్శిస్తున్నారు. 10ఏళ్ల పాలనలో వారు చేసిందేమిటి? కర్నాటకలో భాజపా అధికారంలోకి వస్తే చెరకు రైతుల కష్టాలు తీరుతాయి. యూపీ తరహాలో చెరకు రైతుల రుణాలు మాఫీ చేస్తాం. ఇది నా మానిఫెస్టోలో ఉంది. బీదర్‌లో ఇన్నేళ్లు మూత పడిఉన్న చెరకు కర్మాగారాన్ని తిరిగి ప్రారంభిస్తాంఅని బీదర్‌లో రైతులతో జరిగిన బహిరంగ సమావేశంలో అమిత్ షా అన్నారు. కొద్దిరోజుల్లో కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, భాజపా పార్టీలు ప్రచారంలో దూకుడు పెంచాయి.

# శ్రీదేవి మృతికి సినీలోకం నివాళి

- అతిలోక సుందరి మరణంపై సినీ జగత్తు దిగ్భ్రాంతి
- ట్విట్టర్ వేదికగా నివాళులు అర్పించిన సినీ ప్రముఖులు
- తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాల్లో తిరుగులేని హీరోయిన్
- వివాదాస్పదంగా బోనీకపూర్‌తో వివాహం
- 2013లో పద్మశ్రీతో శ్రీదేవికి సత్కారం
- ఇండియాస్ గ్రేటెస్ట్ యాక్ట్రెస్ ఇన్ 100 ఇయర్స్‌గా ఖ్యాతి
- క్షణక్షణం చిత్రానికి ఉత్తమ నటిగా నంది అవార్డు
- ఇంగ్లీష్-వింగ్లీష్ చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్

ముంబై:అతిలోక సుందరి శ్రీదేవి మరణంతో సినీ జగత్తు శోకసంద్రంలో మునిగిపోయింది. ఆమె మృతికి సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సినీ ప్రముఖులు అమితాబ్, ఏఆర్ రెహమాన్, సుస్మితాసేన్, జాక్వలిన్ ఫెర్నాండెజ్, రితేష్ దేశ్‌ముఖ్, అనుష్క శర్మ, అను ఇమ్మాన్యూల్, ప్రీతీ జింతా, సిద్ధార్థ్ మల్హోత్రా, జానీ లివర్, జరీన్ ఖాన్, మధుర్ బండార్కర్, అద్నాన్ సమీ, గౌతమి, టాలీవుడ్ ప్రముఖులతో పాటు తదితరులు సోషల్ మీడియాలో స్పందించారు. శ్రీదేవి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాల్లో తిరుగులేని హీరోయిన్‌గా అగ్రస్థానం నిలబెట్టుకుంది. అయితే ఆమె వ్యక్తిగత జీవితం అంతసాఫీగా సాగలేదనే చెబుతుంటారు. సినీ అవకాశాలు తగ్గిపోతున్న సమయంలో ఆమె నిర్మాత బోనీకపూర్‌ను వివాహం చేసుకుంది. అప్పటికే పెళ్లయి పిల్లలున్న బోనీ కపూర్‌ను శ్రీదేవిని రెండో పెళ్లి చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై బోనీకపూర్ మొదటి భార్య మోనా కపూర్ అప్పట్లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందే సంబంధం అంతకుముందే సంబంధం వివాహానికి ముందే బోనీ కపూర్‌కు శ్రీదేవితో వివాహేతర సంబంధం ఉందని ఆమె ఆరోపించారు. బోనీకపూర్ కారణంగా శ్రీదేవి గర్భవతి అయ్యారని, అందుకే బోనీకపూర్... శ్రీదేవిని వివాహం చేసుకున్నారని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. బోన్కీపూర్‌ను పెళ్లి చేసుకున్న శ్రీదేవి ఇద్దరు పిల్లలకు తల్లిగా మారింది. శ్రీదేవి నాలుగు సినిమాల్లో పాటలు కూడా పాడారు తన నటనతో ఎన్నో ప్రశంసలు అందుకున్న శ్రీదేవిని పలు అవార్డులు కూడా అందుకున్నారు. నటనకు ఆమె చేసిన సేవను గుర్తించిన



భారత ప్రభుత్వం 2013లో అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీతో సత్కరించింది. అంగ్ల ఛానల్ జాతీయ అవార్డు అంగ్ల ఛానల్ జాతీయ అవార్డు శ్రీదేవి తన సినీ కెరీర్‌లో 14 సార్లు ఫిలింఫేర్‌కు నామినేట్ కాగా, నాలుగు సార్లు ఉత్తమనటిగా, రెండుసార్లు స్పెషల్ జ్యూరీ లభించాయి. ఇందులో తెలుగులో ఆమె నటించిన క్షణక్షణం చిత్రానికి ఉత్తమ నటిగా నంది అందుకున్నారు. అంతేకాకుండా ప్రముఖ ఆంగ్ల టీవీ ఛానెల్ సీఎన్ఎన్-ఐబీఎన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియాస్ గ్రేటెస్ట్ యాక్ట్రెస్ ఇన్ 100 ఇయర్స్‌గా శ్రీదేవి ఎంపికయ్యారు. పెళ్లి తర్వాత గుడ్‌బై, మళ్లీ పెళ్లి తర్వాత గుడ్‌బై, మళ్లీ పెళ్లి తర్వాత శ్రీదేవి సినిమా కెరీర్‌కు గుడ్‌బై చెప్పారు. అయితే 2004-05 మధ్యకాలంలో మాలినీ అయ్యర్‌గా బుల్లితెర మీద కొద్దికాలం ప్రత్యక్షమయ్యారు. శ్రీదేవి నటించడం వల్లే మాలినీ అయ్యర్ పాత్ర బాగా పాపులరయింది. ఆ సీరియల్ అయిపోయాక



రెండు మూడుసార్లు టీవీ షోలకు హాజరుకావడం తప్ప నటిగా మళ్లీ తెర మీదకు రాలేదు. కూతురును పరిచయం చేస్తున్న శ్రీదేవి కూతురును పరిచయం చేస్తున్న శ్రీదేవి నిర్మాతగా పోకిరి చిత్రా న్ని హిందీలో సల్మాన్‌తో వాంటెడ్‌గా నిర్మించారు శ్రీదేవి. 2012లో వచ్చిన ఇంగ్లీష్-వింగ్లీష్ చిత్రం ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఇటీవలే మామ్ చిత్రంతో మరోసారి అలరించారు. ప్రస్తుతం ఆమె పెద్ద కుమార్తె జాన్వీని వెండితెరకు పరిచయం చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. మరాఠాలో ఘన విజయం సాధించిన సైరాట్ సినిమాను హిందీలో దడాక్ పేరుతో రిమేక్ చేస్తున్నారు. కరణ్ జోహర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సినీ వినీలాకాశంలో శ్రీదేవి స్థానం ఎవరూ భర్తీ చేయలేనిది. అందంతో.. నటనతో మొత్తం భారతీయ సినీ ప్రపంచంలోనే తొలి మహిళా సూపర్ స్టార్‌గా ఆమె ఎదిగారు. ఆమె నటన అనిర్వచనీయం.. అమోఘం.. అనకుండా ఎవరూ ఉండరు. అంతటి నటి ఇంత త్వరగా అందరినీ విడిచి వెళ్లిపోతారని ఎవరూ ఊహించలేదు. అభిమానులకైతే ఊపిరి ఆగినంత పనైంది. ఆమె అందం గురించి మాట్లాడుతూ.. ప్రఖ్యాత పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్‌ను గుర్తు చేసుకుంటున్నారు. ఇద్దరి మధ్యా చాలా పోలికలున్నాయంటున్నారు. ఇద్దరూ ఆగస్టులోనే పుట్టారు. వయస్సులో ఐదేళ్లు తేడా ఉన్నా.. గెలవాలన్న తపనలో మాత్రం ఇద్దరిదీ ఒకే విధమైన ఆలోచన. చిన్న వయస్సులోనే కళా రంగంలోకి వచ్చారు. ఒకరు సినీ రంగంలో నెంబర్ వన్ అయితే.. మరొకరు సంగీత ప్రపంచంలో ధ్రువతారగా నిలిచారు. ఎన్నో అవార్డులు రివార్డులు సొంతం చేసుకున్నారు. ఇద్దరూ అందానికి .. తమను తాము అందంగా కనిపించడానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఆ అందమే వారిని త్వరగా అభిమానులకు దూరం చేసిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. శ్రీదేవి, మైఖేల్ జాక్సన్.. ఇద్దరూ సర్జరీలతోనే కాలం గడిపారు. అందంగా కనపడాలని.. అందరినీ మెప్పించాలని విపరీతంగా కాంక్షించారు. శ్రీదేవి బాలీవుడ్‌లో ప్రవేశించి తొలినాళ్ళలో ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారు. సేమ్ టు సేమ్ మైఖేల్ కూడా అంతే. తన ముక్కు కోసం ఎన్నో సార్లు సర్జరీ చేయించుకున్నాడు. శ్రీదేవి ఆ తర్వాత కూడా ఆమె ఆ ప్లాస్టిక్ సర్జరీని వదిలినట్లు లేరు. స్లిమ్‌గా, అందంగా కనిపించటంకోసం ఇంప్లాంట్స్, లైపో సక్షన్, బొటాక్స్ వంటి అనేక చికిత్సలను చేయించుకుంటున్నారట. మరోవైపు నల్లగా ఉండే జాక్సన్ తెల్లగా అవ్వడం కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చాడు. అంతేకాదు స్లిమ్‌గా ఉండడం కోసం అన్నం మానేసి ట్యాబ్లెట్లతోనే కాలం గడిపాడు. ఈ విషయం ఆయన పోస్టుమార్టం రిపోర్ట్ బయటపెట్టింది. కళా ప్రపంచంలో పోటీపడుతూనే.. అందరినీ మెప్పిస్తూనే.. ఓ రాత్రి ఎవరికీ చెప్పకుండా.. అందరినీ విషాదంలో ముంచేసి వెళ్లిపోయారు. ఇద్దరూ గుండెపోటుతో మరణించడం ఒకెత్తైతే.. రాత్రి సమయంలోనే చనిపోవడం మరో విషాదం. అందంగా కనిపించాలనే తాపత్రయమే వీరిద్దరినీ చంపేసిందా అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. ఇద్దరూ వారివారి రంగాల్లో అగ్రస్థానంలో ఉన్నవాళ్లు. తమ ప్రతిభతో ఎందరినో వెనక్కినెట్టినవాళ్లు. కానీ.. తమను తాము జయించలేకపోయారు. అయితే తమలోని అందాన్ని గెలవాలనే కోరికను గెలవలేకపోయారని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉంటే.. శ్రీదేవి మరణంపై అభిమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరో విషయం ఏంటంటే.. శ్రీదేవికి మైఖేల్ జాక్సన్ అంటే ఎంతో ఇష్టం. ఆమె తన ఇష్టాన్ని తన పెయింట్స్ ద్వారా తెలిపారు. మైఖేల్‌పై ఉన్న అభిమానాన్ని చాటుతూ అందమైన చిత్రాన్ని రూపుదిద్దారు. ఆ చిత్రాన్ని దుబాయిలో జరిగే ఓ కార్యక్రమంలో వేలం వేసి.. మంచి పనికి వినియోగిద్దామనుకున్నారు. కానీ అంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద బాహుబలి-2 ప్రభంజనాన్ని కోట్లాది మంది సినీ అభిమానులు ప్రత్యక్షంగా చూశారు. కనీవినీ ఎరుగని రీతిలో రూ.వెయ్యి కోట్ల వసూళ్లు సాధించిన తొలి సినిమాగా జక్కన్న బాహుబలి-2 చరిత్ర లిఖించింది. ఆ సినిమాలో రాజమాత శివగామిదేవి పాత్రకు ఎంతటి ఆదరణ లభించిందో తెలిసిందే. ఆ పాత్రకు తొలుత శ్రీదేవిని సంప్రదించామని, అయితే ఆమె మాత్రం భారీ డిమాండ్లు పెట్టడంతో చివరకు రమ్యకృష్ణను ఆ పాత్ర కోసం తీసుకున్నామని రాజమౌళి ఓ సందర్భంలో తెలిపారు. దీనిపై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన శ్రీదేవి.. రాజమౌళి తీరును తప్పుబట్టారు. అనంతరం దీనిపై రాజమౌళి స్పందించారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లిన జక్కన్న.. అక్కడి మీడియాతో మాట్లాడారు. శ్రీదేవి గురించి ప్రశ్నించగా.. రాజమౌళి ఆ వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకున్నారు. శివగామి దేవి పాత్రకు శ్రీదేవి నో చెప్పిన విషయాన్ని, ఆమె డిమాండ్లను వెల్లడించి ఉండాల్సిందికాదని జక్కన్న అన్నారు. ఎవరు కరెక్ట్ అనేది ప్రజలే నిర్ణయిస్తారు. అయితే ఒక్క విషయం.. ఆనాడు ఇంటర్వ్యూలో శ్రీదేవి గురించి మాట్లాడకపోయి ఉండి ఉంటే బాగుండేది. అదే నేను చేసిన పొరపాటు. దానికి నేను చింతిస్తున్నాను అని రాజమౌళి పేర్కొన్నారు. ముంబైలో ఉంటూ దక్షిణాది సినీ ఇండస్ట్రీకి పెద్దగా నిలిచిన శ్రీదేవి అంటే తనకు చాలా గౌరవముందని అన్నారు. ఆమె నటించిన మామ్ సినిమా విజయవంతమవ్వాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ప్రముఖ సినీనటి, అతిలోకసుందరి శ్రీదేవి కన్నుమూశారు. తెలుగు, తమిళ, మలయాళ హిందీ చిత్రపరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న శ్రీదేవి శనివారం అర్ధరాత్రి దాటక దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందారు. దశాబ్దాల పాటు చిత్రపరిశ్రమలో అగ్ర హీరోయిన్‌గా రాణించిన శ్రీదేవి మృతి పట్ల సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. ఆమె మరణవార్త తెలిసి దేశం మొత్తం మూగబోయింది. సినీ ప్రేక్షకులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బాలీవుడ్ నటుడు మోమిత్ మార్వా వివాహం కోసం భర్త బోనీకపూర్, చిన్న కుమార్తె ఖుషి కపూర్‌తో కలిసి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి గుండెపోటుతో మరణించినట్లు సంజయ్ కపూర్ ధ్రువీకరించారు. శ్రీదేవి మరణవార్త తెలిసిన ప్రముఖులు ఆమె ఇంటికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. "దడాక్" చిత్ర షూటింగ్ కారణంగా ముంబైలోనే వున్న శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వి విషయం తెలిసిన వెంటనే దుబాయ్ వెళ్లిపోయినట్టు సమాచారం. శనివారం రాత్రి దుబాయ్ లో ప్రముఖ సినీ నటి శ్రీదేవి తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో సోషల్ మీడియా కంటతడి పెడుతోంది.



శ్రీదేవి మరణవార్తతో యావత్ సినీ ప్రపంచం, అభిమానులు షాక్‌కు గురయ్యారు. పెళ్లివేడుకకు భర్త బోనీ కపూర్‌తో వివాహానికి హాజరైన సందర్భంగా శ్రీదేవి ఆనందంగా, హుషారుగా కనిపించారు. శ్రీదేవి మరణవార్తపై సోషల్ మీడియాలో పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ట్విట్టర్ ద్వారా పలువురు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మరణాన్ని నమ్మలేకపోతున్నామంటూ కొందరు కన్నీరు పెట్టుకున్నారు. ప్రముఖ సినీ నటి శ్రీదేవి (54) ఇకలేరు. అతిలోకసుందరి అనంత లోకాలకు వెళ్లిపోయారు. శ్రీదేవి కన్నుమూశారు. గుండెపోటుతో ఆమె మృతి చెందారు. వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు దుబాయ్ వెళ్లారు. ఓ పెళ్లి వేడుకకు హాజరై, అక్కడే గుండెపోటుతో మృతి చెందారు. రాత్రి 2.30 గంటల సమయంలో మృతి చెందారు. శ్రీదేవి మృతి చెందినప్పుడు ఆమె భర్త బోనీ కపూర్, చిన్న కూతురు ఖుషి ఆమె వద్దే ఉన్నారు. 1963 ఆగస్టు 13న తమిళనాడులోని శివకాశిలో శ్రీదేవి జన్మించారు. శ్రీదేవి తండ్రి అయ్యప్పన్, తల్లి రాజేశ్వరి. 1996లో బోనికపూర్‌తో శ్రీదేవి వివాహం జరిగింది. ఇద్దరు కూతుళ్లు జాన్వి, ఖుషి. ఆమె మరణవార్త విని భారత సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. శ్రీదేవి మరణం షాక్ కు గురి చేసిందని సినీ ప్రముఖులు అంటున్నారు. ఆమె మృతి పట్ల సంతాప ప్రకటనలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీదేవి మృతి పట్ల రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ప్రధాని మోడీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సీఎం చంద్రబాబు, కేసీఆర్‌లు సంతాపం తెలిపారు. 1967లో బాలనటిగా ఆరంగేట్రం చేశారు. నాలుగవ ఏటనే నటన ప్రారంభించారు. 1975లో బాలీవుడ్‌లోకి ప్రవేశించింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నటించారు. 15 ఫిల్మ్ ఫేర్ అవార్డులు అందుకున్నారు. 2013లో పద్మశ్రీ అవార్డు పొందారు. ఎన్ టీఆర్, ఎన్నార్ వంటి అగ్రనటులతో నటించారు. నాగార్జున, చిరంజీవితో నటించారు. రాఘవేంద్రరావు డైరెక్షన్ లో శ్రీదేవి నటించిన సినిమాలు హిట్ అయ్యాయి. మూడు తరాల చలనచిత్ర రంగంలో శ్రీదేవి నటించారు. ఐదు దశాబ్దాలతో సినిమా రంగంతో అనుబంధం ఉంది. అతిలోక సుందరి శ్రీదేవి మరణం చిత్ర పరిశ్రమను, అభిమానుల్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమెను ఎంతగానో ఆరాధించే దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మనసు కూడా చాలా ఆవేదనకు గురైంది. ఆమెపై తనకున్న ఇష్టాన్ని తెలుపుతూ వర్మ వరుస ట్వీట్లు చేశారు. కాగా శ్రీదేవి గురించి ఇకపై ట్వీట్లు చేయనని, ఇదే తన చివరి ట్వీట్ అని వర్మ తాజాగా పేర్కొన్నారు. ఆమెతో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వీడియోను పోస్ట్ చేశారు. శ్రీదేవి గురించి ఇదే నా ఆఖరి ట్వీట్.. ఇప్పటి నుంచి తను ఇంకా బతికుందనే ఊహించుకుంటాను. శ్రీదేవి.. నేను మిమ్మల్ని ఎంత నవ్వించిన (వీడియోలో) తర్వాత కూడా మీరు నన్నింతగా ఏడిపించడం అన్యాయం. ఇంకెప్పటికీ మీతో మాట్లాడను. లైఫ్ లాంగ్ కటీఫ్ అని వర్మ ట్వీట్‌లో పేర్కొన్నారు. క్షణక్షణం సినిమాలోని జాము రాతిరి జాబిలమ్మ పాట వీడియోను పంచుకుంటూ.. నా కెరీర్‌లో నేను చిత్రీకరించిన ఉత్తమమైన పాట ఇది. ఎం.ఎం. కీరవాణి పాటకు శ్రీదేవి జీవం పోశారు. మొత్తం కొరియోగ్రఫీ ఆమె ముఖ హావభావాలపైనే ఉంది అని ఆయన మరో ట్వీట్ చేశారు. శ్రీదేవితో కలిసి ఓ కార్యక్రమంలో దిగిన ఫొటోను పంచుకున్నారు. తన కళ్లలోకి చూస్తే ఎక్కడ ప్రేమ బయట పడిపోతుందో అని పక్క చూపులు చూసేవాడిని అంటూక్షణ క్షణం సెట్‌లో తీసిన మరో ఫొటోను వర్మ పోస్ట్ చేశారు. కాగా శ్రీదేవి భౌతికకాయాన్ని దుబాయ్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల సమయంలో భౌతికకాయాన్ని ప్రత్యేక విమానంలో ముంబయికి తీసుకురానున్నారు. అనంతరం అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పటికే దాదావు 20 గంటలు గడిచినా ఆమె పార్థివ దేహం ఇంకా ఆసుపత్రిలోనే ఉంది. శవపరీక్ష పేరుతో అక్కడి వైద్యులు కాలయాపన చేస్తున్నారు. ఇంకా ఆమె దేహానికి శవపరీక్ష చేయలేదు. మరికొన్ని పరీక్షలు అవసరమంటూ అక్కడి వైద్యులు చెబుతున్నట్లు సమాచారం. శవపరీక్ష అనంతరం ఆమె భౌతిక కాయాన్ని ముహైస్నా ఎంబాల్మింగ్ సెంటర్‌కు తరలించనున్నారు. అక్కడ్నుంచి ప్రైవేటు జెట్‌లో ముంబయి తరలించనున్నారు.



# మాపై ఆంక్షలు పెడితే యుద్ధాన్ని కోరుకున్నట్లే

- అమెరికా చేష్టలు యుద్ధానికి దారి తీస్తున్నాయి
- తమకు భయపడే యూఎస్ ఆంక్షలు పెడుతోంది
- డొనాల్డ్ ట్రంప్ ప్రకటనపై స్పందించిన ప్యాంగ్యాంగ్

సియోల్: అమెరికా చేష్టలు యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయని ఉత్తరకొరియా హెచ్చరించింది. ఉ.కొరియాపై మరింత కఠినమైన ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై ప్యాంగ్యాంగ్ స్పందించింది. మేము పదే పదే చెబుతున్నాం. మాపై ఆంక్షలు విధిస్తే యుద్ధాన్ని కోరి తెచ్చుకున్నట్లు అవుతుంది అని యూఎస్‌ను హెచ్చరిస్తూ ఉ.కొరియా విదేశాంగశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తమకు భయపడే యూఎస్ ఇలా ఆంక్షలు పెడుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. క్షిపణి ప్రయోగాలు ఆపకపోతే.. ఉ.కొరియాను సర్వనాశనం చేస్తామని ట్రంప్ గతంలో పలుమార్లు హెచ్చరించారు. తాజాగా.. ఉత్తరకొరియాకు చెందిన 50 నౌకలు, షిప్పింగ్ కంపెనీలు, వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు జరపకుండా అత్యంత కఠినమైన ఆంక్షలు విధిస్తున్నట్లు యూఎస్ నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంతకముందెన్నడూ ఏ దేశం మీద పెట్టని ఆంక్షలను ఉ.కొరియా మీద విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంక్షలు పెట్టినప్పటికీ ఉ.కొరియా తన వైఖరి మార్చుకోకపోతే.. మరింత కఠినమైన ఆంక్షలు పెడతామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికాతో శాంతి పూర్వకమైన చర్చలు జరిపే విషయంపై ఉత్తరకొరియా సానుకూలంగా స్పందించింది. ఈ విషయాన్ని దక్షిణకొరియా అధ్యక్షుడి కార్యాలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రస్తుతం ఉ.కొరియాకు చెందిన ప్రతినిధులు ద.కొరియాలో జరిగిన వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారితో ప్యాంగ్‌చాంగ్‌లోని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జై ఇన్ భేటీ అయ్యారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత ద.కొరియా మీడియా ద్వారా ఈ ప్రకటన చేసింది. వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరయ్యారు. ఆమె ద.కొరియా అధ్యక్షుడితో భేటీ అయిన సమయంలో ఉ.కొరియా అంశం గురించి చర్చించినట్లు అక్కడి మీడియా వర్గాలు వెల్లడించాయి. క్షిపణి ప్రయోగాలను అడ్డుకునేందుకు ఉ.కొరియాపై ఏ దేశం మీద విధించని ఆంక్షలను విధిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన రెండు రోజుల వ్యవధిలోనే యూఎస్‌తో చర్చలు జరిపే విషయంపై ఉ.కొరియా సానుకూలంగా స్పందించడం గమనార్హం. వరుస క్షిపణి ప్రయోగాలతో ప్రపంచ దేశాలకు తలనొప్పిగా మారిన ఉ.కొరియాను సర్వనాశనం చేస్తామని ట్రంప్ గతంలో పలుమార్లు హెచ్చరించారు. ఇప్పటికే ఆ దేశంపై ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించింది. తాజాగా అమెరికా.. ఉ.కొరియా నౌక వ్యాపారంపై ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించింది.



## దీర్ఘకాలం తరువాత గర్జించిన శతఘ్నులు



న్యూఢిల్లీ: భారత్ - పాక్ దాదాపు 15ఏళ్ల తర్వాత ఇరు పక్షాలను పరస్పరం శతఘ్నులను ఉపయోగించి దాడులుచేసుకున్నాయి. 2003లో జరిగిన ఒప్పందం ప్రకారం ఇరు దేశాల సైన్యాలు శతఘ్నుల వినియోగాన్ని నిలిపివేశాయి. కానీ గత సోమవారం ఉరి సెక్టార్‌లోని హాజీపీర్‌లో ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయి. ఇవి క్రమంగా పెరుగుతూ మోర్టార్ షెల్స్‌ను ప్రయోగించుకున్నాయి. శనివారం పరిస్థితి మరింత దిగజారింది. భారీ శతఘ్నులను రంగంలోకి దించాయి. దీంతో అక్కడ నివసించే దాదావు 8000 మంది ప్రజలు భయం గుప్పిట బతుకుతున్నారు. దీంతో ఉరి సెక్టార్‌లో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. ఇక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 11.50 సమయంలో పాక్ సైన్యం ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని శ్రీనగర్‌లోని రక్షణశాఖ ప్రతినిధి రాజేష్ ఖలియా తెలిపారు. దీనికి భారత బలగాలు ధీటుగా జవాబిచ్చినట్లు చెప్పారు. గత వారం ప్రారంభంలో పాక్ దళాల కాల్పులకు దిగాయి. దీనికి ప్రతిగా హాజీపీర్ వద్ద భారత బలగాలు పాకిస్థాన్ బంకర్‌ను ధ్వంసం చేశాయి. దీంతో పాక్ బలగాలు ఎల్‌వోసీ వెంట పలు భారత బంకర్లపై దాడులను ప్రారంభించాయి. సిలికోట్‌లో పాక్ బలగాల దాడిలో రెండు ఇళ్లు దెబ్బతిన్నాయి. పాక్ బలగాలు ఆదివారం తెల్లవారుజాము నుంచే మసీదుల్లోని లౌడ్‌స్పీకర్లను వినియోగించి సరిహద్దుల్లోని గ్రామాలు ఖాళీ చేయాలంటూ హెచ్చరికలు జారీ చేశాయి.

# పారిస్ ఒప్పందంతో అమెరికాకు నష్టం

- భారత్, చైనా వల్లే ఆ ఒప్పందం విరమణ
- ఈ ఒప్పందంతో ఆ రెండు దేశాలకే లాభం
- నా బట్టతల దాచేందుకు ప్రయత్నిస్తున్నాను
- ఘాటుగా వ్యాఖ్యానించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలకు దిగారు. పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి తాము వైదొలగడానికి కారణం భారత్, చైనా దేశాలే కారణమని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందం వల్ల ఆ రెండు దేశాలే ఎక్కువగా లాభపడుతున్నాయని ఆయన అన్నారు. దీని వల్ల అమెరికా ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది, ట్రిలియన్ డాలర్లను నష్టపోతుందన్నారు. తమ దేశ పరిశ్రమల వ్యవస్థ దెబ్బతింటోందని ట్రంప్ పేర్కొన్నారు. పారిస్ వాతావరణ ఒప్పందం అమెరికాకు తీవ్ర నష్టం. మా దేశానికి అది పెనుముప్పుగా పరిణమించింది. ఆ ఒప్పందం వల్ల ఎక్కువగా భారత్, చైనా దేశాలు లబ్ధిపొందుతున్నాయి. అందుకే దాని నుంచి వైదొలిగాం. మా వ్యాపారాలను, ఉద్యోగాలను ఈ ఒప్పందం దెబ్బతీస్తుంది. మా దగ్గర అద్భుతమైన సాంకేతికత ఉంది. అంతేకాదు మా దగ్గర గ్యాస్, చమురు, బొగ్గు నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించొద్దని చెబుతారు. భారత్ వంటి దేశాలు అభివృద్ధి చెందుతోన్న దేశాలు. వాళ్లకి మేం ఎంతో చేస్తున్నాం. భారత్, చైనాలు అభివృఎద్ధి చెందుతోన్న దేశాలని అంటారు. మరి అమెరికా మాటేంటి?ఇతర దేశాల మాదిరిగానే మరి మేం అభివృఎద్ధి చెందొద్దా అని ట్రంప్ ప్రశ్నించారు. పారిస్ ఒప్పందం నుంచి వైదొలగాలని తీసుకున్న నిర్ణయాన్ని అర్థం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ప్రయోజనాలకు పారిస్ ఒప్పందం అడ్డంగా ఉందని ట్రంప్ ఆ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు గతేడాది జూన్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే అత్యధిక



కాలుష్యానికి కారణమవుతున్న దేశాల్లో అమెరికాది రెండో స్థానం. అటువంటి పరిస్థితుల్లో ఉన్న అమెరికా ఈ ఒప్పందం నుంచి తప్పుకోవడాన్ని పలువురు విమర్శించారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి 190 దేశాలకు పైగా అంగీకరించాయి. అందులో భారత్ కూడా ఉంది. ప్రముఖ మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ కౌఫెపె వంటి సరికొత్త పదాలను సృఎష్టిస్తూ.. నెటిజన్లకు సవాళ్లు విసురుతుంటారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఏదైనా కార్యక్రమంలో మాట్లాడే సమయంలో ఆయన చూపే హావభావాలు, ముఖ కవళికలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఒక్కోసారి ట్రంప్ తనమీద తానే జోకులు వేసుకుంటారు. ఇప్పుడు కూడా అదే చేశారు. కన్జర్వేటివ్ పొలిటిక్ యాక్షన్ కాన్ఫరెన్స్‌లో ట్రంప్ ప్రసంగానికి వచ్చిన సమయంలో ఆయన తన బట్టతల గురించి మాట్లాడారు. తన బట్టతల గురించి జోకులు వేయడంతో హాలంతా నవ్వులతో నిండిపోయింది. నా బట్టతలను కనిపించకుండా చేయడం కోసం నేను చాలా కష్టపడుతున్నాను. కానీ అది మాత్రం అందరికీ కనపడిపోతుంది. కానీ అది అంత బాగోకుండా మాత్రం లేదు అంటూ ట్రంప్ చమత్కరించారు. దీంతో ఆ హాలు అంతా నవ్వులతో నిండిపోయింది. తన బట్టతలను కనిపించకుండా ఉంచేందుకు జుట్టును ఎలా సరిచేసుకుంటారో అనేది యాక్షన్ ద్వారా చేసి చూపించడం మరింత నవ్వు తెప్పిస్తోంది. అమెరికా అధ్యక్షుడి నివాసం అయిన శ్వేత సౌధం రక్షణ వలయాన్ని ఛేదించుకుంటూ ఒక మహిళ తన వాహనంతో దూసుకెళ్లడానికి ప్రయత్నించింది. దాన్ని అడ్డుకున్న పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా అధ్యక్షుడు నాకు కాబోయే భర్త అంటూ ఆమె కోర్టు ముందు వెల్లడించింది. పోలీసులు కథనం ప్రకారం..టెన్నిస్సే రాష్ట్రానికి చెందిన జెస్సికా ఫోర్డ్ (35) అనే మహిళ శుక్రవారం 3 గంటల ప్రాంతంలో తన వ్యాన్‌లో అధ్యక్షుడి నివాసంలోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించింది. ఒక హ్యాండ్ గన్ తీసుకొని వ్యాన్ చక్రం వెనకాల కూర్చొని ఆమె లోపలికి వెళ్లడానికి ప్రయత్నించింది. అధికారులు ఆమెను గన్ పడేయమని కోరగా ఆమె తిరస్కరించడంతో అధికారులు వ్యాన్ విండో నుంచి బలవంతగా వెనక్కి లాగాల్సి వచ్చింది. ఫోర్డ్ మూడు నేరాలకు పాల్పడినట్లు పోలీసులు ఆమె మీద కేసు నమోదు చేశారు. పోలీసుల రికార్డుల ప్రకారం.. గతంలో కూడా ఆమె శ్వేత సౌధంలోకి వెళ్లడానికి ప్రయత్నించింది. దీనికి సంబంధించి ఆమెకు 90 రోజుల జైలు శిక్షతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. శ్వేత సౌధం ఆమె నివాసంగా కూడా చెప్పుకుంటోంది. దీని గురించి న్యాయస్థానంలో అడిగిన ప్రశ్నకు ట్రంప్ తన కాబోయే భర్త అని సమాధానం ఇచ్చింది. అంతేకాకుండా ఆరు సంవత్సరాల నుంచి తన పిల్లలు కనిపించకుండా పోయారని, నా పిల్లలు నాకు కావాలి అంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఆమె మానసిక పరిస్థితి గురించి అధికారులు అనుమానం వ్యక్తం చేయగా, అమె తరవు న్యాయవాది మాత్రం ఆమె ఆరోగ్యంగా ఉందని కోర్టులో వెల్లడించారు.

## వరుడు జాప్యం చేస్తే జరిమానా



రామ్‌పూర్: ఈ గ్రామంలో వరుడు.. వధువు ఇంటికి ఆలస్యంగా వస్తే మాత్రం గ్రామపెద్దలు జరిమానా విధిస్తారు. నిమిషానికి రూ.100 చొప్పున జరిమానా వేస్తారు. చెప్పిన సమయానికి కాకుండా ఎన్ని నిమిషాలు ఆలస్యంగా వస్తారో అన్ని వందలు వాళ్లు చెల్లించాల్సిందే. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రామ్‌పూర్ జిల్లా దొంకిపురి తండాలో పెళ్లిళ్లు విచిత్రంగా జరుగుతాయి. కానీ అవి ఎంతో మందికి ఆదర్శంగా ఉంటాయి. అదే గ్రామంలోని అబ్బాయిలు, అమ్మాయిలు మాత్రమే పెళ్లిళ్లు చేసుకుంటారు. బయట సంబంధాలకు వెళ్లరు. పెళ్లి కొడుకు వూరేగింపుగా వధువు ఇంటికి వచ్చే సరికి కొన్ని సార్లు ముహూర్తం దాటి పోతుందట. అందుకని వాళ్లు విచిత్రమైన పద్ధతి పెట్టారు. వరుడు ఎన్ని నిమిషాలు ఆలస్యంగా వస్తే నిమిషానికి వంద రూపాయలు చొప్పున ఫైన్ కట్టాల్సి ఉంటుంది. గతంలో ఇలాగే ఓ పెళ్లి కొడుకు వధువు ఇంటికి 14 నిమిషాల పాటు ఆలస్యంగా వెళ్లాడు. దీంతో అతడి కుటుంబానికి గ్రామస్థులు రూ.1400 జరిమానా విధించారు. అంతేకాదు.. ఈ గ్రామంలో జరిగే వివాహాల్లో అనవసరపు ఖర్చులు చేయకూడదు. పెళ్లి ఇంటి దగ్గర డీజే సాంగ్స్ పెట్టడం వంటివి ఇక్కడ నిషేధం. అందుకని అక్కడి పెళ్లిళ్లు అన్నీ నిశ్శబ్దంగా జరుగుతాయి. ఈ నిబంధనలను అక్కడి వారందరూ తప్పకుండా పాటిస్తారు. ఎవరూ వాటికి అభ్యంతరం కూడా చెప్పరు.

## ఆస్ట్రియా ఓపెన్ విజేత కశ్యప్



వియన్నా : మూడేళ్ల తర్వాత భారత బ్యాడ్మింటన్ స్టార్ పారుపల్లి కశ్యప్ తన ఖాతాలో మరో అంతర్జాతీయ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. శనివారం రాత్రి ముగిసిన ఆస్ట్రియా ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో ఈ హైదరాబాద్ ప్లేయర్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో కశ్యప్ 23-21, 21-14తో జూన్ వె చీమ్ (మలేసియా)పై గెలుపొందాడు. సెమీఫైనల్లో కశ్యప్ 2118, 214తో రౌల్ మస్ట్ (ఎస్టోనియా)ను ఓడించాడు. 2015లో సయ్యద్ మోదీ గ్రాండ్‌ప్రి గోల్డ్ టైటిల్ గెలిచాక కశ్యప్ నెగ్గిన మరో టైటిల్ ఇదే కావడం గమనార్హం. మరోవైపు స్విస్ ఓపెన్‌లో భారత్‌కే చెందిన సమీర్ వర్మ కూడా ఫైనల్‌కు చేరాడు. సెమీఫైనల్లో సమీర్ వర్మ 21-14, 11-21, 21-12తో వాంగ్‌చరోయిన్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు.

# కోహ్లీ త్యాగానికి హ్యాట్సాఫ్

- నా కోసం అతని స్థానాన్ని వదులుకున్నాడు
- సహచరుడిగా అంతకంటే మరేం కావాలి
- కోహ్లీ గొప్పతనాన్ని కొనియాడిన సురేశ్ రైనా



కేప్‌టౌన్ : భారత్ తరఫున మళ్లీ ఆడాలన్న కాంక్ష మరింత బలపడింది. 2019 ప్రపంచకప్‌లో నేను ఆడాలనుకుంటున్నా. ఎందుకంటే ఇంగ్లాండ్‌లో బాగా ఆడతానని తెలుసు. నాలో ఇంకా ఎంతో సత్తా ఉంది. దక్షిణాఫ్రికాతో మూడు టీ20ల సిరీస్‌లో రాణిస్తానన్న నమ్మకం ఉంది అంటూ దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు బోర్డు నుంచి పిలుపురాగానే రైనా అన్న మాటలివి. అయితే మొదటి రెండు టీ20ల్లో నామమాత్రపు పరుగులు చేసిన ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్.. తప్పక గెలవాల్సిన చివరి మ్యాచ్‌లో సరైన సమయంలో చెలరేగి ఆడాడు. 1.3ఓవర్‌లోనే కెప్టెన్ రోహిత్ శర్మ వెనుదిరగడంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాల్సిన బాధ్యత రైనా వంతైంది. ఈ క్రమంలో మరో ఓపెనర్ ధావన్‌తో కలిసి రైనా 43(27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం పార్ట్‌టైమ్ స్పిన్నర్ అవతారమెత్తి ప్రమాదకర మిల్లర్ 24 (23 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్)ను బోల్తా కొట్టించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చేజిక్కించుకున్నాడు.

గత రెండు సంవత్సరాలుగా నేను ఎంతో కష్టపడుతున్నాను. జాతీయ క్రికెట్ అకాడమీలో కఠోరంగా శ్రమించా. నా కెరీర్‌లో నేనెప్పుడూ ఫిట్‌గానే ఉన్నా. కచ్చితంగా భారత్ తరఫున ఆడతానని ఆశించాను. దానికోసం ప్రతి క్షణం శ్రమిస్తూనే ఉండేవాడిని. నేను తప్పకుండా భారత్ జెర్సీ ధరిస్తానని నన్ను నిత్యం ప్రోత్సహించిన నా భార్యకు ప్రత్యేక ధన్యవాదాలు అని రైనా తెలిపాడు.

***నా కోసం తన స్థానాన్నే వదులుకున్నాడు..***

మరోవైపు నాలోని సత్తాను ముందే గుర్తించిన కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. కోహ్లీ గత రెండున్నర నెలలకు పైగా జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. జట్టులో ప్రతి ఒక్క ఆటగాడికి తగిన ప్రాధాన్యమిస్తున్నాడు. విరాట్ టీ20ల్లో మూడో స్థానంలో దిగి ఎన్నో గుర్తుండిపోయే ఇన్నింగ్‌లు ఆడాడు. కానీ ఈ సిరీస్‌లో మాత్రం నా కోసం తన స్థానాన్ని త్యాగం చేశాడు. అతని త్యాగానికి హ్యాట్సప్. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపి స్వేచ్ఛగా ఆడేమని మొదటి నుంచి ప్రోత్సహించాడు అని ఈ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చెప్పాడు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం టీంఇండియా మిడిల్ ఆర్డర్‌లో బలహీనంగా ఉందని వన్డే సిరీస్ ముగిసిన అనంతరం కోచ్ రవి శాస్త్రి అన్న సంగతి తెలిసిందే. దీంతో ఇంతకు ముందు మిడిల్ ఆర్డర్‌లో రాణించిన సురేశ్ రైనాకే సెలక్షన్ కమిటీ మొగ్గు చూపింది. ఈ క్రమంలో వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని జట్టులో స్థానాన్ని పదిలం చేసుకోవాలని ఈ ఉత్తర్రపదేశ్ బ్యాట్స్‌మెన్ ఆశిస్తున్నాడు. శ్రీలంకలో జరగనున్న ముక్కోణపు సిరీస్‌పైనే తన దృష్టి అంటూ రైనా చెప్పాడు. అనంతరం ఐపీఎల్ ద్వారా వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడి 2019 ప్రపంచ కప్‌లో కచ్చితంగా స్థానం సంపాదించాలని రైనా ఆశిస్తున్నాడు.

31 ఏళ్ల రైనా టీమ్‌ఇండియా తరఫున 223 వన్డేలు, 68 టీ20లు ఆడాడు. వన్డేల్లో 4, 5 స్థానాలు తన బ్యాటింగ్ శైలికి నప్పుతాయని రైనా చెప్పాడు.

***రైనా.. టాక్ ఆఫ్ ది టౌన్***

ఏడాది తర్వాత భారత క్రికెట్ జట్టులో పునరాగమనం చేసిన టాపార్డర్ ఆటగాడు సురేశ్ రైనా.. దక్షిణాఫ్రికా పర్యటన తర్వాత టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిపోయాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో రైనా బ్యాట్ ఝుళిపించడంతో అతనిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. 'భారత్ సిరీస్ గెలవడంలో ముఖ్య భూమిక పోషించిన రైనా పునరాగమనం అదిరింది' అని మహ్మద్ కైఫ్ ట్వీట్ చేయగా, స్పెషల్ షూటౌట్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలిచిన రైనాకు అభినందనలు' అని సచిన్ పేర్కొన్నాడు.

'రైనా అద్భుతంగా ఆడావు' అంటూ పాకిస్తాన్ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ ట్వీట్ చేశాడు. ఇక భార్య ప్రియాంక కూడా రైనా ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశారు. 'నీ హృదయం భావోద్వేగంతో నిండిపోయి ఉంటుంది. నీ కళ్లలో ఆనంద భాష్పాలు వర్షించి ఉంటాయి' అని ఆమె ట్వీట్ చేశారు. ఇలా పలువురు క్రికెటర్లతో పాటు అభిమానులు కూడా రైనాకు అభినందలు తెలియజేస్తున్నారు. అందివచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకున్నావంటూ ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్‌మన్‌ను ప్రశంసిస్తున్నారు.

సఫారీలతో మూడు టీ20ల సిరీస్ ద్వారా భారత జట్టులోకి తిరిగి ప్రవేశించిన రైనా..తన దైన మార్కు ఆటను చూపెట్టాడు. ప్రధానంగా చివరి టీ 20లో రైనా చెలరేగి ఆడాడు. 27 బంతుల్లో 5 ఫోర్లు 1 సిక్సర్ సాయంతో 43 పరుగులు సాధించాడు. విలువైన పరుగుల్ని రైనా నమోదు చేయడంతో భారత జట్టు 172 పరుగుల్ని సాధించి సఫారీలకు సవాల్ విసిరింది. మరొకవైపు బౌలింగ్‌లో సత్తా చాటుకున్నాడు. ఒకవైపు ప్రధాన బౌలర్లు భారీగా పరుగులిచ్చిన తరుణంలో రైనా మాత్రం పొదుపుగానే బౌలింగ్ చేశాడు. మూడు ఓవర్లలో 27 పరుగులతో సరిపెట్టుకున్నాడు. డేవిడ్ మిల్లర్ వంటి ప్రమాదకర బ్యాట్స్‌మన్ వికెట్‌ను సైతం తన ఖాతాలో వేసుకుని భేష్ అనిపించాడు. ఇవన్నీ భారత విజయానికి బాటలు వేశాయి.

తొలి టీ20లో 7 బంతుల్లో 15 పరుగులు చేసిన రైనా.. రెండో టీ20లో 30 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన రైనా.. వచ్చీ రావడంతోనే సఫారీ బౌలర్లపై ఎదురుదాడికి దిగి వారిని ఒత్తిడిలోకి నెట్టడంలో సక్సెస్ అయ్యాడు. అటు కెప్టెన్ కోహ్లీ నమ్మకాన్ని, ఇటు సెలక్టర్ల నమ్మకాన్ని వమ్ము చేయని రైనా.. త్వరలో శ్రీలంకలో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్‌లో కూడా చోటు దక్కించుకోవడం విశేషం.

## ఈ ఘనత అభిమానులదే

### అందుకే వారికి ప్రత్యేక కృతజ్ఞతలు : విరాట్ కోహ్లీ



కేప్‌టౌన్ : ఐసీసీ టెస్టు ఛాంపియన్ షిప్ గద వరుసగా రెండో సారి అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. భారత జట్టులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ప్రత్యేకమైన అనుభూతి. భారత్ క్రికెట్ సిబ్బందికి కూడా ధన్యవాదాలు. ఇక ప్రపంచ వ్యాప్తంగా పెద్ద పెద్ద జట్లతో ఆడుతున్నప్పుడు దగ్గరుండి మమల్ని ప్రోత్సహించిన భారత క్రికెట్ అభిమానులందరికీ కృతజ్ఞతలు. కఠిన సమయాల్లో కూడా మా వెంటే ఉండి నిత్యం ప్రోత్సహించారు. ఇదే ప్రదర్శనను కొనసాగిస్తూ భారత క్రికెట్‌ను ఉన్నత శిఖరాల్లో నిలబెడతామని మీకు మాటిస్తున్నాను. ఇదంతా అభిమానులు, జట్టు సమష్టి విజయం. రానున్న 12-18 నెలల్లో విదేశాలలో కఠినమైన సిరీస్‌లు ఆడనున్నాం. ఇదే ప్రోత్సాహాన్ని అప్పుడు కూడా మీ నుంచి పొందుతామని ఆశిస్తున్నా ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ గదను అందుకున్న అనంతరం భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ అన్న మాటలివి. గత కొన్ని సంవత్సరాలుగా టెస్టులలో నిలకడగా ఆడుతూ అద్భుతంగా రాణించడం వల్లే అగ్రస్థానాన్ని పదిలం చేసుకోగలిగామని కోహ్లీ అన్నాడు. టెస్టులలో అగ్రస్థానంలో కొనసాగుతున్న భారత్‌కు ఐసీసీ శనివారం రాత్రి టెస్టు ఛాంపియన్‌షిప్ గదను అందించింది. కేప్‌టౌన్‌లో ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ సునీల్ గవాస్కర్, గ్రేమ్ పొలాక్ చేతుల మీదుగా భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ఈ గదను అందుకున్నాడు. గదతో పాటు 1 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ సైతం ఐసీసీ టీంఇండియాకు అందజేసింది. టెస్టుల్లో అగ్రస్థానంలో ఉన్న భారత్‌కు దరిదాపుల్లో కూడా ఏ జట్టు లేకపోవడంతో ఐసీసీ టెస్ట్ ఛాంపియన్ షిప్ గదను అందించింది. టీంఇండియా 2016 అక్టోబర్ నుంచి టెస్టుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కోహ్లీ కంటే ముందు ఈ గదను అందుకున్న ఘనత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని పేరున ఉంది. ధోని నేతృత్వంలో టీంఇండియా 2009 నవంబర్ నుంచి 2011 ఆగస్టు వరకు అగ్రస్థానంలో కొనసాగింది.

## అదీ ద్రవిడ్ అంటే...

### వరల్డ్ కప్ సిబ్బందికి సమానంగా నజరానా



బెంగళూరు : రాహుల్ ద్రవిడ్..సగటు భారతీయులకు ప్రత్యేకించి పరిచయం అక్కర్లేని పేరు. ఒక ఆటగాడిగా, కోచ్‌గా, సామాజిక బాధ్యత గల వ్యక్తి..ఇలా ఒక్కటేమిటీ అన్నింటిలో తన పాత్రకు వంద శాతం న్యాయం చేయడం ద్రవిడ్ నైజం. ఇటీవల అండర్-19 భారత క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా ద్రవిడ్ బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. జట్టు ప్రపంచకప్ గెలిచేంత వరకు ఆటగాళ్లకు వెన్నుదన్నుగా నిలుస్తూ ద్రవిడ్ కీలక పాత్ర పోషించాడు. కప్ గెలిచిన అనంతరం ఒక బాధ్యత గల కోచ్‌గా నా పాత్రను నేను విజయవంతంగా నిర్వర్తించాను. ఈ గెలుపులో ప్రత్యేకించి నా గొప్పతనం ఏమీ లేదని ఇదంతా ఆటగాళ్ల ఘనతేనంటూ బాహాటంగా వెల్లడించి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నాడు ఈ మిస్టర్ డిఫెండబుల్. ఇప్పుడు ద్రవిడ్ గురించి మళ్లీ ప్రత్యేకించి కొత్తగా ఏంటా అనుకుంటున్నారా? అండర్-19 ప్రపంచకప్ గెలుచుకున్న భారత యువ ఆటగాళ్లకు బీసీసీఐ నజరానా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కోచ్‌గా కీలక సలహాలు అందించినం దుకుగానూ ద్రవిడ్‌కు రూ.50లక్షలు, మైదానంలో పోరాడిన ఆటగాళ్లకు రూ.30లక్షలు, వారికి సహకరించిన సిబ్బందికి రూ.20లక్షలు చొప్పున నజరానా ప్రకటించింది. అయితే జట్టుతో న్యూజిలాండ్ నుంచి తిరిగి వచ్చిన అనంతరం ద్రవిడ్ ముంబయిలో పత్రికా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇందులో భాగంగా కప్ కోసం అందరూ సమానంగా పనిచేశారు. కోచ్‌గా నా పాత్ర సక్రమంగా నిర్వర్తించాను. అదేవిధంగా జట్టుకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సిబ్బంది కూడా వంద శాతం తమ పనిని సక్రమంగా పూర్తి చేశారు. కావున వారికి కూడా సమానంగా నజరానా అందించాలంటూ ద్రవిడ్ కోరాడు. ఇంకా వరల్డ్ కప్‌లో జట్టు ఇంతగా రాణించడానికి అం తకంటే ముందు జట్టు కోసం పనిచేసిన సిబ్బందికి కూడా సమానంగా నజరానా అందించాలని బీసీసీఐను కోరాడు. అందరికంటే ఎక్కువగా నజరానా ప్రకటించడం పట్ల ద్రవిడ్ అసంతృాప్తిగా ఉన్నాడు. ప్రపంచ కప్ సాధించడంలో ప్రతి ఒక్కరూ సమాన పాత్ర పోషించారంటూ అతను బీసీసీఐకి తెలిపారు. కావున నజరానా కూడా అందరికీ సరిసమానంగా పంచాలంటూ ద్రవిడ్ కోరడం మమల్ని ఆశ్చర్యపరిచిందటూ బోర్డులో ఓ సభ్యు డు తెలిపారు. ద్రవిడ్ కోరిక మేరకు అండర్-19 వరల్డ్ కప్‌లో పనిచేసిన సిబ్బందితో పాటు, అంతకు ముందు జట్టు ఇంగ్లాండ్ టూర్‌లో కోచ్‌గా వ్యవహరించిన డబ్ల్యూవీ రామన్, లాజిస్టిక్ మేనేజర్ మనూజ్ శర్మ, సుమీత్, ట్రైనీ అమోఘ్ పండిట్‌కు కూడా నజరానా ఇచ్చేందుకు బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రి అంగీకరించారు. దీంతో ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు మిగతా సిబ్బంది అందరికీ రూ.25లక్షలు నజరానాగా బీసీసీఐ అందించనుంది.

## నాలో మార్పునకు కారణం ఐపీఎల్

### స్పష్టం చేసిన పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్



కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికా పర్యటనలో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారనటంలో ఎలాంటి సందేహం లేదు. టెస్ట్‌లలో సీమర్లు తమ ప్రతాపం చూపించగా, పరిమిత ఓవర్ల మ్యాచ్‌లలో స్పిన్నర్లు తమ మణికట్టుతో మాయ చేసేశారు. ఫాస్ట్ బౌలింగ్‌కు మాత్రమే అనుకూలించే దక్షిణాఫ్రికా వంటి కఠినమైన పిచ్‌లపై భారత స్పిన్నర్లు కూడా అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఔరా అనుపించుకున్నారు. ఇక భారత పేస్ దళానికి నేతృత్వం వహించిన సీమర్ భువనేశ్వర్ కుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వన్డేల్లో వికెట్లు పడగొట్టడానికి ఇబ్బంది పడినా, టెస్ట్‌లు, టీ20లలో మాత్రం భువీ విశేషంగా రాణించాడు. ఇక టీ20 సిరీస్‌లో ఏడు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ చేజిక్కించుకున్న భువీ, దక్షిణాఫ్రికా టూర్‌లో విజయవంతంగా రాణించడానికి ఐపీఎలే ప్రధాన కారణమని అంటున్నాడు. లీగ్ ద్వారా వచ్చిన అనుభవమే తనను ఆలోచనాత్మక బౌలర్‌గా మర్చిందని భువనేశ్వర్ అన్నాడు. టీ20 ఫార్మెట్ అంటేనే తక్కువ సమయంలో పూర్తవుతుంది. ఒక బౌలర్‌గా నిరూపించుకోవడానికి మన చేతిలో కేవలం నాలుగు ఓవర్లే ఉంటాయి. ఒకవేళ దురదృష్టవశాత్తు ఓవర్‌లో వరుసగా మూడు చెత్త బంతులు పడితే ఇక అంతే సంగతులు. అది పూర్తిగా మ్యాచ్ మీదున్న విశ్లేషణనే దెబ్బతీస్తుంది. దీంతో జట్టు విజయానికి కూడా దూరమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఇందులో ప్రతి ఒక్క బంతి కీలకమే. అదే ఒక బౌలర్‌ను ఆలోచనాత్మక బౌలర్‌గా మారుస్తుంది. అప్పుడే విజయం ప్రణాళిక ప్రకారం వస్తుందనిభువనేశ్వర్ అన్నాడు. ఈ సిరీస్‌లో కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులు విసరడం వలన బ్యాట్స్‌మెన్‌ను ప్రలోభపెట్టే అవకాశం దొరికింది. దాని కారణంగానే నేను పవర్‌ప్లేలో విజయవంతంగా రాణించగలిగినట్లు భువీ చెప్పాడు.

ఈ విషయంలో బుమ్రా తనకు నచ్చినట్లు ఆడుతుంటాడు. టీం అనుకున్న ప్రణాళికకు విరుద్ధంగా ఆడినా, చివరికి మాత్రం విజయాన్ని సాధించగలుగుతాడని భువీ తెలిపాడు. పవర్‌ప్లేలో బౌలింగ్ కట్టుదిట్టంగా చేయడం, మరోవైపు హిట్టింగ్ బ్యాట్స్‌మెన్ నుంచి కీలక ఇన్నింగ్స్ రావడం వలనే ఇటీవల భారత్‌కు నిలకడగా విజయాలు సాధ్యపడుతున్నాయని ఈ మీడియం పేస్ బౌలర్ అభిప్రాయపడుతున్నాడు. ఇక దక్షిణాఫ్రికా పర్యటన ద్వారా వచ్చిన గెలుపు జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని, ఇదే ఉత్సహాన్ని రానున్న ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనలోనూ కొనసాగించే ప్రయత్నం చేస్తామని భువనేశ్వర్ తెలిపాడు.

భువనేశ్వర్ కుమార్ ఈ దక్షిణాఫ్రికా పర్యటనలో అన్ని ఫార్మెట్‌లలో మొత్తం 21వికెట్లు పడగొట్టాడు. మరో వైపు టీ20 సిరీస్‌లోనూ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీని అందుకున్నాడు.

## రోహిత్ విశిష్ట కెప్టెన్ల జాబితాలో రోహిత్



కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన టీ20 మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఏడు పరుగుల తేడాతో విజయం సాధించి 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెన్నునొప్పి కారణంగా విరాట్‌కోహ్లీ ఆఖరి టీ20కి దూరమయ్యాడు. రోహిత్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన సఫారీ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 165 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ టూర్‌లో బ్యాట్‌తో ఆశించినంతగా రాణించలేకపోయిన రోహిత్‌శర్మ చివరి టీ20లో సారథ్య బాధ్యతలు చేపట్టి సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో రోహిత్ విశిష్ట కెప్టెన్ల జాబితాలో చోటు సంపాదించుకున్నాడు. సారథ్య బాధ్యతలు చేపట్టిన మ్యాచ్‌తోనే సిరీస్‌ను కైవసం చేసుకున్న కెప్టెన్ల జాబితాలో చేరాడు. ఇంతకుముందు మిస్బావుల్ హక్, షాహిద్ అఫ్రిది, సర్ఫరాజ్ అహ్మద్, శ్రీలంక ఆటగాళ్లు సంగక్కర, లసిత్ మలింగలు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలినాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించారు. ఇప్పుడు వీరి సరసన రోహిత్ శర్మ చేరాడు. డిసెంబరు 2017లో శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో రోహిత్ శర్మ తొలి సారి సారథ్య బాధ్యతలు చేపట్టాడు.ఆ సిరీస్‌ను టీమ్ ఇండియా 3-0తో గెలుచుకుంది.

## రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదు : ఆనందబాబు

గుంటూరు,సూర్యబ్యూరో : రాయలసీమలో రెండో రాజధాని పెట్టాలన్న బీజేపీ నేతల తీర్మానాన్ని మంత్రి నక్కా ఆనందబాబు తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికే కేంద్రం నిధులు ఇవ్వడంలేదని, విభజన హామీ చట్టాన్ని అమలు చేయడం లేదని మంత్రి విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆరోపణలు చేసిన సోము వీర్రాజు జగన్ ఏజెంటుగా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. వాళ్ల సత్తా ఏంటో ప్రజల్లోకి వస్తే తెలుస్తుందని మంత్రి ధ్వజమెత్తారు. చంద్రబాబు ఢిల్లీకి పలుమార్లు వెళ్లినా ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. జగన్, వైసీపీ నేతల వైఖరిని ఆనందబాబు దుయ్యబట్టారు. ప్రధాని మోదీకి జగన్, వైసీపీ ఎంపీలు భయపడుతున్నారని, కానీ టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం ధైర్యంగా పోరాటం చేస్తున్నారని ఆయన అన్నారు. రాయలసీమ అభివృద్ధికి కేంద్రం రూ. 600 కోట్లు ఇచ్చిందని, అటువంటిది ,ఇవాళ బీజేపీ నేతలు రాయలసీమలో మీటింగ్ పెట్టుకుని, కొత్త విధానంలో మాట్లాడడం అవివేకమని, అజ్ఞానమని మంత్రి ఆనందబాబు అన్నారు. తాను బీజేపీ నేతలు అందరినీ అనడంలేదని, ఎవరైతే అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారో వారిని ఉద్దేశించి మాత్రమే మాట్లాడుతున్నానని ఆయన అన్నారు. వాళ్ల స్థాయి తెలుసుకోకుండా విమర్శలు చేస్తున్నారని, వాళ్ల ఉనికిని కాపాడు కోవడం కోసం రాష్ట్రాన్ని అబాసుపాలు చేసే పనులు చేయద్దని నక్కా ఆనందబాబు హెచ్చరించారు. ఈ విధంగా ప్రవర్తిస్తున్న బీజేపీ, వైసీపీ నాయకులకు ఇదే హెచ్చరికని ఆయన అన్నారు.

## ముక్కోణపు సీరీస్‌కు టీమిండియా ఎంపిక

### కెప్టెన్ కోహ్లితో సహా ధోనీకి కూడా విశ్రాంతి



ముంబై: వచ్చే నెలలో శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు టీ 20 సిరీస్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును ప్రకటించారు. ముందుగా ఊహించినట్లుగానే భారత రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీకి ట్రై సిరీస్‌లో విశ్రాంతి కల్పించారు. అదే సమయంలో ఎంఎస్ ధోని కూడా లంక పర్యటనకు దూరం కానున్నాడు. వీరితో పాటు జస్ప్రిత్ బూమ్రా, భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతినిచ్చారు. ఈ మేరకు 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ సెలక్టర్లు ఆదివారం ప్రకటించారు. ఈ పర్యటనలో రోహిత్ శర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పచెప్పగా, శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. హైదరబాద్ పేసర్ మొహ్మద్ సిరాజ్‌కు మరోసారి అవకాశం కల్పిస్తూ సెలక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, రిషబ్ పంత్‌లకు అవకాశం దక్కింది. మార్చి 6 వ తేదీ నుంచి ఆరంభమయ్యే ముక్కోణపు 20 సిరీస్‌లో భారత్, శ్రీలంకలతో పాటు బంగ్లాదేశ్ పాల్గొనుంది.

భారత్ జట్టు : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేశ్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కత్, సిరాజ్, రిషబ్ పంత్.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·